teenmaardesk@gmail.com
RNI no TELTEL/2021/86151

# తీన్మార్

నేటి వాస్తవాలు...
తెలుగు దిన పత్రిక

ములుగు | సంపుటి : 03 | సంచిక : 225 | చీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | ఆదివారం | 15 డిసెంబర్ 2024 | పేజీలు : 08 | వెల ₹5

Published from Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar,Nizamabad, Adilabad.

## వివాహానికి సీఎం రేవంత్ రెడ్డిని ఆహ్వానించిన పీవీ సింధు



హైదరాబాద్, డిసెంబర్ 14 (తీన్మార్ న్యూస్): ఒలింపిక్ పతక విజేత, తెలుగు తేజం పీవీ సింధు త్వరలోనే పెళ్లి పీటలు ఎక్కబోతుంది. పెద్దలు కుదుర్చిన సంబంధంతో వివాహ బంధంలోకి అడుగు పెట్టబోతుంది బ్యాడ్మింటన్ స్టార్. 2024,

మిగతా 2 లో

## తీన్మార్ ప్రేరణ ప్రశ్న..



### హామీలు.. అప్పులు.. సర్కార్ తిప్పలు..?

ఎండమావిని చూపిస్తూ ఎండబెట్టడం ఇంకెంతకాలం..?

హామీలన్నారు.. అమలులో /అమలుపై అయోమయం..!

ఆవిరైపోతున్న ఖాజానా.. అంతుచిక్కని పాలనా..?




రెడ్డి. శేఖర్
ఎడిటర్,
తీన్మార్ దినపత్రిక




## యూనివర్సిటీల్లో ఖాళీల భర్తీపై ప్రభుత్వం దృష్టి

ప్రొఫెసర్ల నియామకాలు చేపట్టాలని నిర్ణయం

ముగ్గురు వీసీలతో త్రిసభ్య కమిటీ ఏర్పాటు




## కాంగ్రెస్ సర్కార్ ఏడాది పాలనలో సాధించిందేమీ..?

సర్కారుపై ఎమ్మెల్యే హరీశ్‌రావు తీవ్ర విమర్శలు

14 రోజులు గడిచినా జీతాలు రాకపోవడంపై ఆగ్రహం వ్యక్తం



సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని సర్కారుపై సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శలు గుప్పించారు. 14 రోజులు గడిచినా జీతాలు ఇవ్వకపోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకటో తేదీ నాడే ఉద్యోగులకు జీతాలు అంటూ రేవంత్‌రెడ్డి గప్పాలు కొట్టారన్నారు.

హైదరాబాద్, డిసెంబర్ 14 (తీన్మార్ న్యూస్): డిసెంబర్‌లో 14వ తేదీ వచ్చినా 39,568 మంది అంగన్‌వాడీ టీచర్లలు, ఆయాలు జీతాలు రాక ఆవేదన చెందుతున్న పరిస్థితి ఉందన్నారు. పది నెలలుగా అంగన్‌వాడీ కేంద్రాలకు అద్దెలు కూడా చెల్లించని దుస్థితి నెలకొందన్నారు. ఏడాది

మిగతా 2 లో



## సంక్షేమ, గురుకుల హాస్టల్స్ విద్యార్థుల డైట్‌లో మార్పులు

పౌష్టికాహారం అందేలా మెనూ సిద్ధం

ఇకపై లంచ్‌లో నెలలో రెండు సార్లు మటన్, 4 సార్లు చికెన్

తెలంగాణ బ్యూరో, డిసెంబర్ 14 (తీన్మార్ న్యూస్): అన్ని సంక్షేమ, గురుకుల హాస్టల్స్ విద్యార్థులకు ప్రభుత్వం శుభవార్త తెలిపింది. సంక్షేమ హాస్టల్స్ పై సీరియస్‌గా ఫోకస్ పెట్టిన తెలంగాణ ప్రభుత్వం తనిఖీల పేరుతో హాస్టల్స్ బాటపట్టింది. రాష్ట్రంలోని సంక్షేమ హాస్టళ్లలో పరిస్థితులను స్వయంగా అంచనా వేయడానికి ముఖ్యమంత్రి, మంత్రులతోపాటు ప్రభుత్వ యంత్రాంగం అంతా హాస్టల్స్, గురుకులాల్లో తనిఖీలు చేపట్టారు. విద్యార్థులతో మాట్లాడి వాళ్లతో కలిసి

మిగతా 2 లో

## కుల గణనపై సీఎం రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు

98 శాతం పూర్తి అయ్యిందని వెల్లడి



హైదరాబాద్, డిసెంబర్ 14 (తీన్మార్ న్యూస్): తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన కుల గణనపై సీఎం రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన కుల గణన సర్వే 98 శాతం పూర్తి అయ్యిందనిమరో రెండు శాతం మిగిలి ఉందని చెప్పారు. మిగిలిన రెండు శాతం పూర్తి

మిగతా 2 లో



## ఉచిత బస్సు సౌకర్యంపై ఘాటు సమాధానాలు

### ఆయనది పొలిటికల్ మోటివేటెడ్ స్టేట్ మెంట్

ఫ్రీ బస్సు వల్ల మెట్రో రైల్ కు నష్టమెలా వస్తది

రాజకీయ పార్టీతో కుమ్మక్కయి సర్కారును బద్నాం చేస్తుండు

అజెండా ఆజ్ తక్ 2024 లో సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, డిసెంబర్ 14 (తీన్మార్ న్యూస్): మెట్రో సీఎఫ్‌వోను లోపలేయుమన్న ఆయన పొలిటికల్ మోటివేటెడ్ స్టేట్‌మెంట్ ఇచ్చారు. అంతలోనే ఆయన ముంబై పారిపోయిండు హైదరాబాద్‌లో మెట్రో లైన్ ఉన్నది కేవలం 69 కిలోమీటర్లు మేం మహిళలకు ఫ్రీ బస్ రాష్ట్ర వ్యాప్తంగా ఇస్తున్నం. ఉచిత బస్సు కారణంగా మెట్రో నష్టాల పాలవుతుందని ఎట్లా స్టేట్‌మెంట్ ఇస్తడు, హైదరాబాద్‌లో

మిగతా 2 లో

## ఒకే దేశం, ఒకే ఎన్నికపై లోక్‌సభలో రెండు బిల్లులు

రెండు దశల్లో అమలుకానున్న ఎన్నికలు



02



## అల్లు అర్జున్ అరెస్టుతో ప్రభుత్వానికి సంబంధం లేదు

రాష్ట్ర మంత్రి దనసరి అనసూయ (సీతక్క)

ఓ మహిళ మృతి కేసులో చట్టం తనపని తాను చేసుకుపోతుంది

02

## గ్రూప్ -2 పరీక్ష నిర్వహణకు ఏర్పాట్లు సిద్ధం

టీజీపీఎస్సీ చైర్మన్ బుర్ర వెంకటేశం



02

## ఈ నెల 18 నుంచి కాళేశ్వరం ప్రాజెక్టుపై క్రాస్ ఎగ్జామినేషన్

జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్

ఈ నెలాఖరుతో ముగియనున్న కమిషన్ విచారణ గడువు

రెండునెలలు పొడిగించే సూచనలు



హైదరాబాద్, డిసెంబరు 14 (తీన్మార్ న్యూస్): కాళేశ్వరం ప్రాజెక్టు బ్యారేజీల నిర్మాణంలో అవకతవకతలపై విచారణలో భాగంగా జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ 18 నుంచి క్రాస్ ఎగ్జామినేషన్‌ను ప్రక్రియను పునః ప్రారంభించనుంది. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంతో సంబంధం ఉన్న ఐఏఎస్, మాజీ ఐఏఎస్ అధికారులతోపాటు

మిగతా 2 లో



## తెలంగాణ తల్లి రూపురేఖల మార్పుతో అవహేళన

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై ఆరోపణలు

బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత వాఖ్యలు

తెలంగాణ అస్తిత్వంపై దాడి అంశంపై సమావేశం

హైదరాబాద్, డిసెంబరు 14 (తీన్మార్ న్యూస్): తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ తల్లి రూపురేఖలు మార్చి, అవహేళన చేస్తున్నారని తెలంగాణ

మిగతా 2 లో

## రైతుకు సంకెళ్ళ వేయడంపై స్పందించిన ఈటెల

### కాంగ్రెస్ ప్రభుత్వం నైజం మరోసారి బట్టబయలు



ఎద్దు ఏడ్చిన ఎవుసం రైతు ఏడ్చిన రాజ్యం బాగుపడదు

రైతుకు వేసిన బేడీలు, సర్కార్ కు ఉరితాళ్ళు అవుతాయ్

ప్రభుత్వ వైఖరిపై ఎంపీ ఈటల రాజేందర్ ఘాటు వాఖ్యలు

02

# యూనివర్సిటీల్లో ఖాళీల భర్తీపై ప్రభుత్వం దృష్టి

తెలంగాణ బ్యూరో, డిసెంబర్ 14 (తీన్మార్ న్యూస్): సర్కారు యూనివర్సిటీల్లో ఖాళీల భర్తీపై ప్రభుత్వం దృష్టి సారించింది. కొన్నేండ్లుగా వివిధ కారణాలతో ఆగిపోయిన ప్రొఫెసర్ల నియామకాలు చేపట్టాలని నిర్ణయించింది. వర్సిటీల్లో ప్రొఫెసర్ల నియామకం, ప్రమోషన్ల ప్రక్రియలోని సమస్యలను అధిగమించేందుకు ముగ్గురు వీసీలతో తెలంగాణ హయ్యర్ ఎడ్యుకేషన్ కౌన్సిల్ త్రిసభ్య కమిటీని నియమించింది. ఈ కమిటీకి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి చైర్మన్ గా, ఓయూ వీసీ కుమార్, ఎంజీయూ వీసీ అల్తాఫ్ హుస్సేన్ ను సభ్యులుగా నియమించారు. ఖాళీల భర్తీకి త్వరగా రిక్రూట్మెంట్ పూర్తయ్యేలా కొత్త గైడ్ లైన్స్ ఇవ్వాలని కమిటీకి ప్రభుత్వం సూచించింది. ఈ కమిటీ మూడు వారాల్లో తన నివేదికను సమర్పించనుంది. ఆ నివేదికను హయ్యర్ ఎడ్యుకేషన్ కౌన్సిల్ అధికారులు సర్కారుకు పంపించనున్నారు. కాగా రాష్ట్రంలోని 12 సర్కారు వర్సిటీలు ఉండగా, వాటిలో మొత్తం 2,825 టీచింగ్ పోస్టులు ఉన్నాయి. దాంట్లో 873 మంది మాత్రమే పనిచేస్తున్నారు. వర్సిటీల్లో కొన్నింటిలో రెగ్యులర్ ప్రొఫెసర్లు కూడా లేరు.




# కాంగ్రెస్ సర్కార్ "ఏడాది పాలనలో" సాధించిందేమీ..?



మొదటి పేజీ తరువాయి

కాంగ్రెస్ పాలనలో రేవంత్ సర్కారు సాధించిన ఘనత ఇదేనన్నారు. విశ్రాంత ఉపాధ్యాయులను, ఉద్యోగులను సైతం ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. హైకోర్టు ఉత్తర్వులు ఉంటే తప్ప హక్కుగా రావాల్సిన రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వకుండా వారిని, వారి కుటుంబాలను క్షోభకు గురి చేస్తున్నావంటూ మండిపడ్డారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, విశ్రాంత ఉపాధ్యాయ, ఉద్యోగులు, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ఇలా లక్షల మంది సకాలంలో జీతాలు రాక అనేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఒకటో తేదీనే జీతాలు చెల్లిస్తున్నట్లు చేస్తున్న డబ్బా ప్రచారాన్ని ఇకనైనా ఆపాలని ఉద్యోగులందరికీ సకాలంలో జీతాలు చెల్లించి మాట నిలుపుకోవాలని హితవు పలికారు.

# ఒకే దేశం, ఒకే ఎన్నికపై లోక్‌సభలో రెండు బిల్లులు

న్యూ ఢిల్లీ, డిసెంబర్ 14 (తీన్మార్ న్యూస్): ఒకే దేశం, ఒకే ఎన్నికలకు సంబంధించిన రెండు బిల్లులను సోమవారం లోక్‌సభలో ప్రవేశపెట్టనున్నారు. కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ దిగువ సభలో రాజ్యాంగం (129వ సవరణ) బిల్లు మరియు కేంద్రపాలిత ప్రాంతాల చట్టాల (సవరణ) బిల్లును ప్రవేశపెడతారు. ఇటీవల, దేశవ్యాప్తంగా ఒకేసారి ఎన్నికలకు మార్గం సుగమం చేస్తూ ఒకే దేశం, ఒకే ఎన్నికలు అనే ఆలోచనను అన్వేషించడానికి ఏర్పాటు చేసిన ఉన్నత స్థాయి కమిటీ సిఫార్సులను ప్రభుత్వం ఆమోదించింది. మాజీ రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్ అధ్యక్షతన ఏర్పాటైన ఉన్నత స్థాయి కమిటీ రాజకీయ పార్టీలు, నిపుణులతో సహా వాటాదారులతో విస్తృత చర్చలు జరిపింది. దీన్ని రెండు దశల్లో అమలు చేయనున్నారు. మొదటి దశలో లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలు ఒకేసారి జరగనుండగా, సాధారణ ఎన్నికలు జరిగిన 100 రోజులలోపు పంచాయతీలు, మున్సిపాలిటీలు వంటి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తారు.

# ఉచిత బస్సు సౌకర్యంపై ఘాటు సమాధానాలు

మొదటి పేజీ తరువాయి

ఎంత మంది మహిళలు మెట్రో వదిలి ఫ్రీ బస్సు ఎక్కుతున్నారు. మీరు హైదరాబాద్ రండి చూపిస్తాఅది కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బద్నాం చేసే స్టేట్‌మెంట్ అని తనదైన శైలిలో స్పందించారు సీఎం రేవంత్ రెడ్డి. శుక్రవారం రాత్రి ఢిల్లీలో జరిగిన అజెండా ఆజ్ తక్-2024 కాంక్లేవ్‌లో సీఎం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉచిత బస్సు సౌకర్యంపై అడిగిన ప్రశ్నకు ఘాటుగా సమాధానం చెప్పారు.



**మెట్రో సీఎఫ్‌వో ఏమన్నారంటే?**

ఈ ఏడాది మే నెలలో ఓ బిజినెస్ చానల్ కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఎల్ అండ్ టీ సీఎఫ్ వో ఆర్ శంకర్ రామన్ మాట్లాడారు. బిజినెస్ ప్లాన్ లో భాగంగా హైదరాబాద్ మెట్రో వాటాలను అమ్మేయనున్నట్టు చెప్పారు. రోజుకు ఐదు లక్షల మంది మెట్రో సేవలను వినియోగించుకుంటారని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మహిళలకు మహాలక్ష్మి పథకం కింద ఫ్రీ బస్ జర్నీ పథకాన్ని ప్రవేశపెట్టిందని, దీంతో మెట్రో నిర్వహణ భారంగా మారిందని ఎల్ అండ్ టీ సంస్థ చెబుతోంది. వాస్తవాలను పరిశీలిస్తే ఫ్రీ బస్ తర్వాత కేవలం రోజుకు 20 వేల మంది ప్రయాణికులు మాత్రమే తగ్గారు. దీనిపై అప్పుడే సీఎం రేవంత్ రెడ్డి స్పందించారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తున్నామనే సాకుతో మెట్రో నిర్వహణను వదులుకుంటామంటే వేరొకరికి అప్పగిస్తామని చెప్పారు. ఉచిత బస్సు సౌకర్యం విషయంలో వెనక్కు తగ్గేది లేదని కుండబద్దలు కొట్టారు. వాస్తవానికి మెట్రో సర్వీసుల్లో నిలుచునేందుకు కూడా జాగా ఉండటం లేదన్నది అందరికీ తెలిసిందే. గత ప్రభుత్వం నుంచి అనేక రాయితీలు పొందిన ఎల్ అండ్ టీ సంస్థ మెట్రో నిర్వహణ నుంచి తప్పుకొనేందుకు ప్రయత్నిస్తుండటంపై అనేక విమర్శలు వచ్చాయి. ఈ నేపథ్యంలోనే కాళేశ్వరం ప్రాజెక్టు అంశం తెరమీదకు వచ్చింది. మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజీలు కుంగిపోవడం, వాటిపై జ్యుడీషియల్ ఎంక్వైరీ మొదలు కావడంతో సర్కారును బ్లాక్ మెయిల్ చేసేందుకే ఎల్ అండ్ టీ అలాంటి స్టేట్ మెంట్ ఇచ్చిందనే చర్చ కూడా జరిగింది.

# కుల గణనపై సీఎం రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు

అయితే తెలంగాణ కులగణన దేశానికి ఆదర్శంగా నిలుస్తోందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కులగణన తెలంగాణ ప్రజల మెఘా హెల్త్ ప్రొఫైల్ లాంటిదన్నారు.
హైదరాబాద్‌లో నిర్మించిన కురుమ విద్యార్థి వసతి గృహ ట్రస్ట్ - దొడ్డి కొమురయ్య ఆత్మ గౌరవ కురుమ భవనాన్ని శనివారం సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రజాకార్లను గ్రామాల్లోకి రాకుండా, దొరల పెత్తనాన్ని అడ్డుకోవడానికి దుడ్డుకర్రల సంఘం పెట్టి పోరాడిన గొప్ప యోధుడు దొడ్డి కొమురయ్య అని కొనియాడారు. చాకలి ఐలమ్మ పేరును యూనివర్సిటీకి పెట్టినట్టుగానే దొడ్డి కొమురయ్య పేరు శాశ్వతంగా గుర్తుండిపోయేలా మంత్రివర్గ సహచరులతో మాట్లాడి సరైన నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. దొడ్డి కొమురయ్య భవన ప్రాంగణం ఒక విద్యా వేదిక కావాలని విజ్ఞానం పంచాలని సీఎం ఆకాంక్షించారు. కురుమ సోదరులకు విద్య కోసం అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు.కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిన రుణమాఫీ, సన్నాలకు బోనస్, ఉచిత విద్యుత్, రూ.500 లకే సిలిండర్, పేదలకు వైద్య సౌకర్యాలు అందించడం వంటి ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఎక్కువగా బలహీన వర్గాలకు అందాయని పేర్కొన్నారు.

# సంక్షేమ, గురుకుల హాస్టల్స్ విద్యార్థుల డైట్‌లో మార్పులు

మొదటి పేజీ తరువాయి

భోజనాలు చేశారు. హాస్టల్ విద్యార్థులకు పోషకాహారంతో పాటు, రుచికరమైన భోజనం అందించడంపై దృష్టిపెట్టిన ప్రభుత్వం. ఇప్పటి వరకు అమలవుతున్న డైట్‌లో పలు మార్పులు చేస్తూ విద్యార్థులకు పౌష్టికాహారం అందేలా మెనూ సిద్ధం చేసింది. ప్రభుత్వ హాస్టళ్లలో ఇప్పటి వరకు ప్రతి ఆదివారం చికెన్ పెడుతున్నారు. అయితే తొలిసారిగా విద్యార్థులకు మటన్ పెట్టబోతున్నారు. ఇకపై లంచ్‌లో నెలలో రెండు సార్లు మటన్, 4 సార్లు చికెన్ పెట్టనున్నారు. నాన్ వెజ్ భోజనం పెట్టినప్పుడు సాంబార్, పెరుగు కూడా ఉంటుంది. నాన్ వెజ్ తినని వారికి ఆ రోజుల్లో మీల్ మేకర్ కర్రీ పెడతారు. నాన్ వెజ్ లేని మిగతా రోజుల్లో లంచ్‌లో ఉడికించిన గుడ్డు లేదా ఫ్రైడ్ ఎగ్ ఇస్తారు.

# తెలంగాణ తల్లి రూపురేఖల మార్పుతో అవహేళన



మొదటి పేజీ తరువాయి

జాగృతి సంస్థ వ్యవస్థాపకురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత చెప్పారు. శనివారం సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో "తెలంగాణ అస్తిత్వంపై దాడి" అంశంపై ఆమె రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. తెలంగాణ తల్లి పేరుతో రేవంత్ ఏర్పాటుచేసిన రూపాన్ని కాంగ్రెస్ మాతగా నామకరణం చేద్దామని కవిత తీర్మానించారు. బతుకమ్మను తెలంగాణ తల్లి చేతిలో నుంచి తీసేయడం తెలంగాణ సంస్కృతిపై దాడేనని, దీన్ని తెలంగాణ సమాజమంతా వ్యతిరేకించాలని కవిత పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పాలకులు తెలంగాణ తల్లి రూపురేఖలు మార్చి ప్రజలందరినీ అవమానించారని కేవీ రమణాచారి ఆరోపించారు. తెలంగాణ తల్లి రూపురేఖలు మార్చడాన్ని చరిత్ర హర్షించదని ప్రత్యేక తెలంగాణ ఉద్యమకారిణి తిరునగరి దేవకీదేవి చెప్పారు. ఉద్యమకాలం నాటి తెలంగాణ తల్లి విగ్రహాలను తాకితే జనం చూస్తూ ఊరుకోరని, తిరగబడతారని తెలంగాణ సాహిత్య అకాడమీ పూర్వ అధ్యక్షుడు జూలూరు గౌరీశంకర్ హెచ్చరించారు. తెలంగాణ తల్లి రూపాన్ని మార్చడమంటే శిల్పిగా తనను చంపేసినట్టేనని తెలంగాణ తల్లి రూపశిల్పి బీవీఆర్ చారి చెప్పారు. కార్యక్రమానికి తెలంగాణ గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ అయాచితం శ్రీధర్ సభాధ్యక్షత వహించగా, ఎమ్మెల్సీలు దేశపతి శ్రీనివాస్, సురభి వాణీదేవి, మాజీ ఎమ్మెల్సీ దేవీప్రసాద్, బీసీ కమిషన్ మాజీ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్, దళిత స్త్రీవాద రచయిత్రి గోగు శ్యామల, విశ్లేషకుడు వి. ప్రకాష్, ఆచార్య కె. సీతారామారావు, సీనియర్ జర్నలిస్టులు టంకశాల అశోక్,వేణుగోపాల స్వామి, జమాతే ఇస్లామీ ప్రతినిధి హమీద్ ముహమ్మద్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

# రైతుకు సంకెళ్ళ వేయడంపై స్పందించిన ఈటెల

తెలంగాణ బ్యూరో, డిసెంబర్ 14 (తీన్మార్ న్యూస్): కాంగ్రెస్ ప్రభుత్వం నైజం మరోసారి బయటపడిందని మల్కాజ్‌గిరి బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. లగచర్ల ఘటనలో జైలులో ఉన్న ఖైదీకి అనారోగ్య సమస్యతో బాధపడుతున్నారని జైలు అధికారులు ఆసుపత్రికి తరలించే సమయంలో సంకెళ్లు వేసి తీసుకెళ్లారు. ఈ ఘటనకు సంబంధించిన ఫోటోలను ట్విట్టర్ వేదికగా పోస్ట్ చేసిన ఈటల సంచలన వ్యాఖ్యలు చేశారు. దీనిపై రైతుకు వేసిన బేడీలు, మీ సర్కార్ కు ఉరితాళ్ళు అవుతాయని ఘాటు వ్యాఖ్యలు చేశారు. అలాగే ఎద్దు ఏడ్చిన ఎవుసం రైతు ఏడ్చిన రాజ్యం ఏనాడూ బాగుపడలేదనేది చరిత్ర రుజువు చేసిందని అన్నారు. అంతేగాక లగిచర్ల రైతు ఈర్య నాయక్ గుండె నొప్పితో ఉంటే కనికరం చూపాచాల్సింది పోయి చేతులకు బేడీలు వేసి తీసుకెళ్లడం దుర్మార్గమని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం మరోసారి తన నైజాన్ని బయటపెట్టుకుందని, ఈ ఘటనతో రేవంత్ రెడ్డి రైతు వ్యతిరేకి అని రుజువైందని ఈటల ఆరోపించారు.



# వివాహానికి సీఎం రేవంత్ రెడ్డిని ఆహ్వానించిన పీవీ సింధు



డిసెంబర్ 22వ తేదీన రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్ వేదికగా సింధు వివాహం జరగనుంది. ఈ క్రమంలో సింధు సీఎం రేవంత్ రెడ్డిని కలిసి తన వివాహానికి హాజరు కావాలని ఆహ్వానించింది. శనివారం కుటుంబ సభ్యులతో కలిసి జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని సింధు కలిసింది. ఈ సందర్భంగా తన వివాహానికి అటెండ్ కావాలని సీఎం రేవంత్ రెడ్డిని ఇన్వైట్ చేసింది. ఇటీవల పీవీ సింధు సయ్యద్ మోడీ బ్యాడ్మింటన్ ట్రోఫి గెల్చిన విషయం తెలిసిందే. దాదాపు రెండేళ్ల తర్వాత బీడబ్ల్యూఎఫ్ టైటిల్ నెగ్గిన సింధుకు ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఇదిలా ఉంటే భారత స్టార్ షట్లర్ పీవీ సింధు.. తనకు కాబోయే భర్త వెంకట దత్త సాయితో డిసెంబర్ 14, శనివారం నిశ్చితార్థం జరిగింది. కటుంబ సభ్యులు, సన్నిహితుల నడుమ వీరి నిశ్చితార్థం అంగరంగ వైభవంగా జరిగింది. ఎంగేజ్మెంట్ ఫోటోను సింధు తన అధికారిక ఇన్‌స్టాగ్రామ్ హ్యాండిల్‌లో పోస్ట్ చేసింది. కాబోయే భర్తతో కలిసి సింధు కేక్ కట్ చేయడం ఫొటోలో కనిపిస్తోంది. డిసెంబర్ 22న ఆదివారం ఉదయ్‌పూర్‌లో వీరి వివాహం జరగనుంది. ఈ పెళ్ళికి భారత క్రికెట్ లెజెండ్ సచిన్ టెండూల్కర్, ప్రధాని నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్ షా హాజరు కానున్నట్లు సమాచారం. ఇదివరకే ఈ జంట వీరిని తమ వివాహానికి విచ్చేయాలని ఆహ్వానించారు. పివి సింధుకు కాబోయే భర్త వెంకట దత్త సాయి ప్రస్తుతం పోసిడెక్స్ టెక్నాలజీస్‌లో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా ఉన్నారు.

# అల్లు అర్జున్ అరెస్టుతో ప్రభుత్వానికి సంబంధం లేదు

హైదరాబాద్, డిసెంబరు 14 (తీన్మార్ న్యూస్): సినీ హీరో అల్లు అర్జున్ అరెస్టుతో తమ ప్రభుత్వానికి ఎలాంటి సంబంధం లేదని మంత్రి సీతక్క పేర్కొన్నారు. సంధ్య థియేటర్ వద్ద తొక్కిసలాట, ఓ మహిళ మృతి కేసులో చట్టం తనపని తాను చేసుకుపోతుందని చెప్పారు. శనివారం నిర్మల్ జిల్లా కడెం మండలంలో పర్యటించిన సందర్భంగా అల్లు అర్జున్ అరెస్టుపై మాట్లాడారు. అల్లు అర్జున్‌పై తమ ప్రభుత్వానికి ఎటువంటి ద్వేషం లేదని, ఆ మాటకొస్తే అల్లు అర్జున్ మామ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బంధువేనని చెప్పారు. సినీ హీరో చిరంజీవి కూడా కాంగ్రెస్ నేపథ్యం ఉన్న వారేనన్నారు. చట్టపరంగా జరిగే అంశాలపై రాద్ధాంతం తగదన్నారు. ఇక చట్టానికి ఎవరూ అతీతులు కాదని, దాని ముందు అందరూ సమానమేనని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్ వ్యాఖ్యానించారు. సంజయ్‌గాంధీ 44వ వర్ధంతి సందర్భంగా గాంధీభవన్‌లో శనివారం ఆయన చిత్రపటానికి నివాళులర్పించిన అనంతరం విలేకరులతో ఆయన అల్లు అర్జున్ అరెస్టుపై మాట్లాడారు. సంధ్య థియేటర్‌లో జరిగిన తొక్కిసలాటలో ఒక సామాన్యురాలు ప్రాణాలు కోల్పోయిందని, ఆమె కుమారుడు చావు, బతుకుల మధ్య కొట్టు మిట్టాడుతున్నాడని గుర్తు చేశారు. అల్లు అర్జున్‌కు పిల్లనిచ్చిన మామ.. కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకుడేనని, సీఎం రేవంత్‌రెడ్డికీ.. అల్లు అర్జున్ కుటుంబంతో బంధుత్వం ఉందన్నారు. అయినా చట్టం ముందు అందరూ సమానమేనని చెప్పారు. తెలుగు చిత్రసీమకు, కాంగ్రెస్ పార్టీకి విడదీయరాని బంధం ఉందన్నారు. కాగా.. ఫార్ములా-ఈ రేసింగ్‌లో నిధుల్లో గోల్‌మాల్ జరిగినట్లుగా అధికారులు గుర్తించారని, ఇందులో కేటీఆర్ అక్రమాలకు పాల్పడినట్లు తెలితే ఆయనపైనా చట్ట ప్రకారం చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. ఇచ్చిన మాటకు కట్టుబడి కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేసిందన్నారు. పదేళ్లు అధికారంలో ఉండి తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు పైనా ఎందుకు ధ్యాస పెట్టలేదో కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావు, కవిత చెప్పాలన్నారు.

# గ్రూప్ -2 పరీక్ష నిర్వహణకు ఏర్పాట్లు సిద్ధం

హైదరాబాద్, డిసెంబర్ 14 (తీన్మార్ న్యూస్): రాష్ట్రంలో గ్రూప్ -2 సర్వీసుల పోస్టుల భర్తీ కోసం పరీక్ష నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేశామని టీజీపీఎస్సీ చైర్మన్ బుర్ర వెంకటేశం చెప్పారు. నేడు, రేపు గ్రూప్-2 పరీక్షలు నిర్వహిస్తున్నామని పబ్లిక్ సర్వీస్ కమిషన్ పై నమ్మకం, అభ్యర్థులు వారి మెరిట్ పై నమ్మకం ఉంచి పరీక్షలు రాయాలని అభ్యర్థులకు సూచించారు. టీజీపీఎస్సీ మీ తల్లి లాంటిదని ఎలాంటి అపోహలు లేకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలన్నారు. ఎవరి ఓఎంఆర్ షీట్ వారికే ఉంటుందని అభ్యర్థులు తమకు కేటాయించిన ఓఎంఆర్ షీట్ ను పక్కాగా చెక్ చేసుకోవాలన్నారు. ప్రతి అభ్యర్థికి బయోమెట్రిక్ తప్పనిసరి అని బయోమెట్రిక్ లేకుండా పరీక్ష రాసేందుకు వీలు లేదన్నారు. ఏదయినా పరిస్థితిలో బయోమెట్రిక్ లేకుండా పరీక్ష రాసినా అది వ్యాలీడ్ కాదని స్పష్టం చేశారు. 2022లో నోటిఫికేషన్ ఇస్తే గత వారంలో సుప్రీంకోర్టు, హైకోర్టు కేసుల నుంచి గెలిచామన్నారు. 783 పోస్టులకు పరీక్ష ఒక్కొక్కరి ఉద్యోగానికి కనీసం 70 మంది పోటీ పడుతున్నారన్నారు. గ్రూప్-2 పోస్టుల భర్తీకి గతంలో 2015 నుంచి 2019 వరకు టైం పట్టింది.ఈసారి తక్కువ సమయంలో భర్తీ చేస్తున్నాం. గ్రూప్ 2 కు పూర్తిస్థాయిలో మేము సన్నద్ధంగా ఉన్నామన్నారు. కేంద్రాల్లో సీసీ కెమెరాలు, ఓఎంఆర్ షీట్లు, ప్రశ్నాపత్రాలు స్టోరేజీ చేసేందుకు 58 కేంద్రాలు సిద్ధం చేశామన్నారు. అభ్యర్థులకు తప్ప అందులో ఏ ప్రశ్నలు ఉన్నాయో ఎవరికీ తెలియదని చెప్పారు.

**టీజీపీఎస్సీ ప్రక్షాళన కోసం ఢిల్లీకి:**

పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రక్షాళన కోసం ఈ నెల 18,19 తేదీల్లో టీజీపీఎస్సీ సభ్యులు అంతా కలిసి ఢిల్లీకి వెళ్తున్నామని బుర్ర వెంకటేశం చెప్పారు. 18న ఉదయం యూపీఎస్సీ కార్యాలయంలో గైడ్ లైన్ తీసుకుంటామని, 19న ఎస్ఎస్ సీ కమిషన్ ఆఫీస్ కు, సాయంత్రం ఎన్



టీఏ చైర్మన్ తో భేటీ అవుతామన్నారు. పారదర్శకంగా పరీక్షల నిర్వహణ కోసం అధ్యయనం చేసేందుకు ఈ పర్యటన ఉంటుందన్నారుర. జనవరి నాటికి ప్రభుత్వానికి దీనిపై నివేదిక అందజేసి తర్వాత రిక్రూట్ మెంట్ కు పూర్తిస్థాయిలో సన్నద్ధమవుతామన్నారు. కేరళ, కర్ణాటక, మహారాష్ట్ర, యూపీ పబ్లిక్ సర్వీస్ కమిషన్ లు తెలంగాణలో పర్యటించనున్నాయని వచ్చే జనవరిలో వారు రాష్ట్రానికి వచ్చే అవకాశం ఉందన్నారు. టీజీపీఎస్సీ అంటే కమిట్ మెంట్, స్పీడ్ అనేలా అభ్యర్థులకు నమ్మకం కలిగించేలా చూస్తామన్నారు. ప్రిలిమ్స్, మెయిన్స్ లాంటి వాటిని 6 నుంచి 9 నెలల్లో పరీక్ష ప్రక్రియ పూర్తిచేస్తామన్నారు. సింగిల్ పరీక్ష ఉన్నవాటిని 6 నెలల్లోనే భర్తీ చేస్తామన్నారు. జనవరి నుంచి మార్చి మధ్యలో గ్రూప్-3 పరీక్ష ఫలితాలు రిలీజ్ చేస్తామన్నారు.

# ఈ నెల 18 నుంచి కాళేశ్వరం ప్రాజెక్టుపై క్రాస్ ఎగ్జామినేషన్

మొదటి పేజీ తరువాయి



బ్యారేజీల నిర్మాణ సంస్థల ప్రతినిధులకు ఈ దఫా కమిషన్ క్రాస్ ఎగ్జామినేషన్‌లో ప్రశ్నించనుంది. ఇక ఈ నెల 17న జస్టిస్ పినాకి చంద్రఘోష్ హైదరాబాద్‌కు రానుండగా, మరుసటి రోజు(ఈనెల 18వ తేదీ) నుంచి విచారణ ప్రక్రియను ప్రారంభించనున్నారు. ఈ దఫా నీటిపారుదల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులుగా వ్యవహరించిన రిటైర్డ్ ఐఏఎస్ అధికారులు ఎస్‌కే జోషీ, రజత్‌కుమార్, ఇన్‌చార్జి కార్యదర్శులుగా పనిచేసిన సోమేశ్‌కుమార్, వికాసరాజ్, స్మితా సభర్వాల్ తదితరులను కమిషన్ క్రాస్ ఎగ్జామిన్ చేయనుంది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణ సంస్థల ప్రతినిధులను సైతం ఇదే దఫాలో ప్రశ్నించనుంది. కమిషన్ విచారణ గడువు ఈ నెలాఖరుతో ముగియనుండడంతో రెండునెలలు పొడిగించే సూచనలు కనిపిస్తున్నాయి.

తీన్మార్
తెలుగు దినపత్రిక

## పొంచి ఉన్న పొరుగు ముప్పు

బంగ్లాదేశ్ నిజ స్వరూపం ఇప్పుడిప్పుడే బయటపడుతోంది. తూర్పు పాకిస్తాన్ పేరును సార్థకం చేసుకోవాలని అనుకుంటుంది. యూనస్‌ని రబ్బర్ స్టాంప్ చేసి పాకిస్తాన్, బంగ్లాదేశ్ ఆర్మీ, గేమ్ ఆడుతున్నట్లు కనిపిస్తుంది. పాకిస్తానీయులు బంగ్లాదేశ్ వెళ్లడానికి సెక్యూరిటీ క్లియరెన్స్ ఎత్తేశారు. బంగ్లా పాకిస్తాన్‌కు దగ్గరౌతుందన డానికి ఇది పెద్ద నిదర్శనంగా కనిపిస్తోంది. ఇండియా సహకారంతో స్వతంత్ర దేశంగా అవతరించిన బంగ్లాదేశ్, భారత్‌కే ముప్పుగా మారుతుందనే సందేహం వస్తోంది. బంగ్లాదేశ్‌లో మధ్యంతర ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు చూస్తుంటే.. భారత వ్యతిరేక పాకిస్తాన్‌కు మరింత దగ్గరవుతున్న సంకేతాలు కనిపిస్తున్నాయ్. విద్యార్థి ఉద్యమంతో మొదలైన బంగ్లాదేశ్ ఉద్రిక్తత.. తర్వాత, భారత వ్యతిరేక ఉద్యమంగా మార్పు చెందడం చాలా అనుమానాలను రేపింది. బంగ్లాదేశ్ మిలటరీ కనుసన్నల్లో ఏర్పాటైన యూనస్ మధ్యంతర ప్రభుత్వం దీనికి మరింత ఆజ్యం పోసింది. నోబుల్ శాంతి బహుమతి పొందిన ముహమ్మద్ యూనస్.. తన దేశాన్ని తీవ్రమైన అశాంతి దిశగా నడిపే నిర్ణయాలు తీసుకుంటు న్నారు. ముఖ్యంగా, యూనస్‌కి అధికారం వచ్చిన తర్వాత ఉగ్రవాదుల్ని పెంచి పోషించే పాకిస్తాన్‌కు బంగ్లాదేశ్ మరింత దగ్గరయ్యింది. పాకిస్తాన్ నాయకులతో పెరిగిన సంప్రదింపుల నుండీ పాక్‌తో చేసుకుంటున్న మిలటరీ ఒప్పందాల వరకూ చాలా అంశాల్లో పాక్-బంగ్లాదేశ్‌ల మధ్య బంధం బలపడుతూ ఉంది. బంగ్లాదేశ్ పాకిస్తాన్ నుండి భారీ సంఖ్యలో ఆయుధాలను కొనుగోలు చేసింది. దీని తర్వాత, కొన్ని రోజుల క్రితమే, బంగ్లాదేశ్- భారత్ సరిహద్దుల్లో అత్యంత బలమైన వార్ డ్రోన్లను మోహరించింది. నిఘా కోసం మాత్రమే పెట్టామంటూ బొంకింది కూడా. ఇక, తాజాగా, మిలటరీ ఆదేశాలతో నడుస్తున్న యూనస్ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. గతంలో పాకిస్తానీయులు బంగ్లాదేశ్ రావాలంటే సెక్యూరిటీ క్లియరెన్స్ తప్పనిసరిగా ఉండేది. అలాంటిది, ఇప్పుడు ఆ క్లియరెన్స్ ఏమీ లేకుండానే వీసాలకు అనుమతి ఇచ్చేశారు పాక్ ఉగ్రవాదులు కూడా స్వేచ్ఛగా బంగ్లాదేశ్‌లోకి అడుగుపెట్టడానికి ఎంట్రీ మరింత సులువుగా మార్చారు. బంగ్లాదేశ్ హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖలోని సెక్యూరిటీ సర్వీసెస్ విభాగం.. విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖకు ఈ మేరకు సమాచారం ఇచ్చినట్లు ఆ దేశ స్థానిక మీడియా చెప్పింది. అయితే, ప్రభుత్వం నిర్ణయంపై అక్కడ నుండి ఎలాంటి కామెంట్లూ రాలేదు. గతంలో, తమ దేశంలోకి ఉగ్రవాదుల్ని రాకుండా అరికట్టడానికి చేసిన చట్టాన్ని ఇప్పుడు ఎందుకు ఎత్తేశారనే దానిపై ఎలాంటి విశ్లేషణా లేకపోవడం అనుమానాలకు తావిస్తోంది. 2019 నుండి.. పాకిస్తాన్ పౌరులు బంగ్లాదేశ్ వీసా పొందాలంటే బంగ్లా సెక్యూరిటీ సర్వీసెస్ డిపార్ట్‌మెంట్ నుండి "నో అబ్జెక్షన్" సర్టిఫికేట్ పొందాలి. ఆ సమయంలో పాకిస్తాన్-బంగ్లాదేశ్ మధ్య కొనసాగుతున్న రాజకీయ, దౌత్యపరమైన ఉద్రిక్తతల మధ్య భద్రతా ప్రోటోకాల్స్‌లో భాగంగా ఈ విధానం ప్రవేశపెట్టారు. అయితే, మహ్మద్ యూనస్ నేతృత్వంలోని మధ్యంతర ప్రభుత్వంలో పాకిస్తాన్-బంగ్లాదేశ్ సంబంధాలను మెరుగుపరచడంలో భాగంగా ఈ విధానాన్ని రద్దు చేశారు. ఇకపై, సెక్యూరిటీ క్లియరెన్స్ అవసరం లేదంటూ నిర్ణయం తీసుకున్నారు. నవంబర్‌లో కరాచీ నుండి చిట్టగాంగ్‌కు నేరుగా కార్గో నౌకల తరలింపును బంగ్లాదేశ్ ప్రభుత్వం అనుమతించిన ఒక నెల తర్వాత ఈ పరిణామం చోటుచేసుకుంది. డిసెంబర్ 3న, బంగ్లాదేశ్‌లోని పాకిస్తాన్ హైకమిషనర్ సయ్యద్ అహ్మద్ మరూఫ్, బంగ్లాదేశ్ నేషనల్ పార్టీ అధినేత బేగం ఖలీదా జియాను తన ఇంటిలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన చర్చల అనంతరం ఈ ప్రకటన రావడం చర్చకు దారి తీసింది. దేశ భద్రతకు అవసరమైన ఈ చర్యను మాఫీ చేయడంపై చాలా మంది విమర్శలు కూడా చేస్తున్నారు. ఖలీదా జియా బంగ్లాదేశ్ ప్రభుత్వంలో ఎలాంటి అధికారిక హోదాలో లేకపోయినప్పటికీ.. ఆమె సలహా మేరకే ఇది జరిగినట్లు కొందరు అనుమానిస్తున్నారు. ఈ క్రమంలో.. బంగ్లా ఆర్మీ చీఫ్ జనరల్ వాకర్-ఉజ్-జమాన్ కనుసన్నల్లో గవర్నమెంట్ చీఫ్ సలహాదారుగా ఉన్న యూనస్ రబ్బర్ స్టాంప్‌లా వ్యవహరిస్తున్నారనే కామెంట్లు వస్తున్నాయి. ప్రస్తుతం, బంగ్లాదేశ్‌లో జరుగుతున్న పరిణామాలపై ఆ దేశ మాజీ ప్రధాని షేక్ హసీనా తీవ్ర అసహనాన్ని వ్యక్తం చేశారు. బంగ్లాదేశ్ ప్రధాన సలహాదారు ముహమ్మద్ యూనస్ నేతృత్వంలో ఉగ్రవాదులు, ఛాందసవాదులను అనుమతించే "ఫాసిస్ట్ పాలన" నడుస్తుందని ఆరోపించారు. డిసెంబర్ 8న లండన్‌లో విదేశీ అవామీ లీగ్ మద్దతుదారుల సమావేశానికి వర్చువల్‌గా చేసిన ప్రసంగంలో హసీనా ఈ వ్యాఖ్యలు చేశారు. తన ప్రభుత్వాన్ని కూలదోసిన జూలై-ఆగస్టు అల్లర్ల వెనక యూనస్ "మాస్టర్ మైండ్" ఉందని కూడా ఆమె ఆరోపించారు. ఆగస్టు 5 నుండి, మైనార్టీలు, హిందువులు, క్రైస్తవులు, బౌద్ధుల ప్రార్థనా స్థలాలపై దాడులు విపరీతంగా జరుగుతున్నాయనీ.. యూనస్ పాలనలో జమాత్, ఉగ్రవాదులు స్వేచ్ఛగా తిరుగుతున్నారంటూ విమర్శించారు. కాల్పులు, హత్యలకు పాల్పడిన ఉగ్రవాదులు, నేరస్థులకు యూనస్ ప్రభుత్వం క్షమాభిక్ష కల్పిస్తోందని హసీనా ఆరోపించారు. హసీనా విడుదల చేసిన 37 నిమిషాల ఆడియో రికార్డింగ్‌ను బంగ్లాదేశ్ స్టూడెంట్స్ లీగ్, బంగ్లాదేశ్ అవామీ లీగ్ ఫేస్‌బుక్ పేజీలో షేర్ చేశారు. అయితే, ఈ కీలక పరిణామల మధ్య తాజాగా భారత విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ డిసెంబర్ 9న ఢాకా పర్యటించారు. అక్కడ, యూనస్‌తో సమావేశమైన మిస్రీ? బంగ్లాదేశ్‌లో హిందూ మైనారిటీల భద్రతపై ఆందోళనను తెలియజేశారు. "సాంస్కృతిక, మత, దౌత్యపరమైన ఆస్తులపై దాడులు చేయడం విచారకరమని" మిస్రీ, యూనస్‌కు చెప్పినట్లు తెలుస్తోంది. అయితే, ఇటీవల, దేశ ద్రోహం కేసులో బంగ్లా పోలీసులు అరెస్ట్ చేసిన ఇస్కాన్ గురువు చిన్మోయ్ కృష్ణ దాస్ కేసును వాదించే న్యాయవాదిని కూడా కేసును వాదించకుండా నిరోధించడంపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. దేశం చట్టపరమైన హక్కులను ఉల్లంఘిస్తుందని ఆరోపిస్తున్నారు. ఇక, బంగ్లాదేశ్‌లో ప్రస్తుతమున్న పరిస్థితిపై యూరోపియన్ యూనియన్ కూడా స్పందించింది. యూనస్ నేతృత్వంలో నడుస్తున్న ప్రభుత్వం చట్టపరమైన పాలనకు ప్రాధాన్యతనివ్వాలని, విధి విధానాలను గౌరవించాలని, దేశ పౌరుల ప్రాథమిక హక్కులను కాపాడాలని కోరింది. బంగ్లాదేశ్‌లో మానవ హక్కుల ఉల్లంఘన ఆరోపణలపై తీవ్రంగా స్పందించింది.

# రాష్ట్ర వ్యాప్తంగా అన్ని సంక్షేమ హాస్టళ్లలో కామన్ డైట్ ప్లాన్ ప్రారంభం

**- సంక్షేమ హాస్టళ్ల చరిత్రలో తొలిసారి డైట్ చార్జీల పెంపు**

**- అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు**

**- రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**

మహబూబాబాద్ జిల్లా, డిసెంబర్ 14 (తీన్మార్ న్యూస్): రాష్ట్రంలోని అన్ని సంక్షేమ హాస్టల్లో ఒకే విధమైన డైట్ ప్లాన్ ను నేడు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ప్రారంభించారని, రాష్ట్రంలో గత పదేళ్లలో మొదటిసారిగా, సంక్షేమ హాస్టళ్ల చరిత్రలో మరెన్నడూ లేని విధంగాడైయిట్ చార్జీలను 40 శాతం, కాస్మోటిక్ చార్జీలు 200 శాతం పెంచుతూ ప్రభుత్వం విప్లవాత్మక నిర్ణయం తీసుకొని అమలుపరుస్తు న్నామని, పెంచిన డైట్ ఛార్జీలలో భాగంగా రాష్ట్రంలోని ఎస్.సి, ఎస్.టి. బీసీ, మైనారిటీ సంక్షేమ హాస్టల్లో అధికారులు, ఇతర ప్రజా ప్రతినిధులు గురుకుల, రెసిడెన్షియల్ హాస్టళ్లను నేడు వ్యక్తిగతంగా సందర్శించి, అక్కడే విద్యార్థులతో కలసి భోజనం చేసి పరిస్థితులను స్వయంగా అంచనా వేయడం జరుగుతుందని, రాష్ట్రంలోని పాఠశాలలో 667.25 కోట్లతో మౌలిక సదుపాయాలను కూడా ప్రభుత్వం కల్పించింది.





హాస్టల్ల పనితీరును నిరంతరం పర్యవేక్షించేందుకు ఆకునూరి మురళి అధ్యక్షతన స్టేట్ ఎడ్యుకేషన్ కమిషన్ కూడా ఏర్పాటుతోపాటు, రాష్ట్రంలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గం ఇంటిగ్రేటెడ్ హాస్టల్ నిర్మాణానికి కూడా శ్రీకారం చుట్టిందని. ఈ నేపథ్యంలో ప్రస్తుతం ఉన్న ఎస్సీ ఎస్టీ బీసీ, మైనారిటి హాస్టల్లో మరింత ప్రామాణికమైన ఆహారాన్ని అందించే కార్యక్రమంతో పాటు మెరుగైన విద్య బోధనా అవకాశాలను పెంపొందించడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి ఆదేశాలతో రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం మొత్తం రాష్ట్రంలోని అన్ని గురుకుల సంక్షేమ హాస్టల్లో ఈ పథకం అమలు చేస్తున్నారు, మరిపెడ తెలంగాణ సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల పాఠశాల, కాలేజ్ లో కామన్ డైట్ మెనూ ప్రారంభించి, విద్యార్థులతో కలిసి భోజనం చేసి సరదాగా మాట్లాడుతూ అందుతున్న సౌకర్యాల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కాలేజీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం కాలం పూర్తవుతున్న సందర్భంగా ఆరు గ్యారెంటీలు అభివృద్ధి పథకాలను అమలు చేస్తూ ప్రజల మన్ననలు పొందుతూ ప్రభుత్వం నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటుందన్నారు. జిల్లాలోని అర్హులైన ప్రతి ఒక్కరికి రెండు పడకల గదుల మంజూరు చేసి పేదరిక నిర్మూలనకు కృషి చేస్తూ పేదవాడి సొంత ఇంటి కలని నెరవేర్చడం జరుగుతుందన్నారు, జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల సర్వే జరుగుతుందని, ఇంటిగ్రేటెడ్




పాఠశాలల భవనం నిర్మాణానికి శంకుస్థాపన చేయడం జరిగిందని, గతంలో ఎన్నడూ లేని విధంగా జిల్లాను అభివృద్ధి చేస్తామని అన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మరిపెడ ఆవరణంలో దంతాలపల్లి, సీరోలు, నరసింహులపేట మండలాలకు (మూడు) 108 వాహనాలను ప్రారంభించారు, టీజీ డబ్ల్యూ ఆర్ ఈఐఎస్ పాఠశాలను సందర్శించి పిల్లలతో ముచ్చటించారు అందుతున్న సేవలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. క్షేత్రస్థాయిలో ప్రతి ఒక్కరికి విద్య, ఆరోగ్యం, పరిశుభ్రత పరిరక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా చర్యలు తీసుకొని ఆరోగ్య తెలంగాణగా, విద్య తెలంగాణగా గా రూపొందించడం కోసం చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోత్ రామచంద్రనాయక్, మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అత్యంత ప్రాధాన్యత కల్పిస్తూ పేద విద్యార్థుల కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతూ వారి అభ్యున్నతికి కృషి చేస్తుందని అన్నారు, విద్యార్థిని,విద్యార్థులు ఉన్నత చదువులతో ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్, ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, అదనపు కలెక్టర్ రెవెన్యూ కే.వీర బ్రహ్మచారి, మండల ప్రత్యేక అధికారి డాక్టర్ కిరణ్ కుమార్, సంబంధిత జిల్లా అధికారులు. విద్యార్థినీ విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయ రంగంలో మరిన్ని పరిశోధనలు జరగాలి

**వ్యవసాయ కళాశాలను ఆదర్శంగా తీర్చిదిద్దుతా**

**- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, డిసెంబర్ 14 (తీన్మార్ న్యూస్): రైతులకు వ్యవసాయపరంగా అన్ని విధాల మేలు జరిగేలా వ్యవసాయ విద్యలో మరిన్ని పరిశోధనలు చేపట్టాల్సిన అవసరం ఉందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. శనివారం అశ్వరావుపేటలోని ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ కళాశాల డైమండ్ జూబ్లీ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన వ్యవసాయ కళాశాలలో సాగు చేస్తున్నటువంటి మియాజాకి మామిడి సాగును, ఇతర పంటల సాగును పరిశీలించారు. వ్యవసాయ కళాశాల ప్రిన్సిపల్ హేమంత్ చేపట్టే సాగు మరియు వినూత్న ప్రయోగాలు గురించి మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వ్యవసాయ కళాశాల కేవలం విద్యార్థులకు బోధన అందించడం మాత్రమే కాకుండా రైతులకు ఉపయోగపడేలా వినూత్న రీతిలో సాగు చేయు పంటలు మరియు రైతులకు ఆదాయం వచ్చే పంటల సాగు చేపట్టాలన్నారు. అశ్వరావుపేటలో ఆనాటి ముఖ్యమంత్రి స్వర్గీయ ఎన్టీ రామారావు ఆలోచనలతో ఇక్కడ వ్యవసాయ కళాశాల ఏర్పాటుకు అంకురార్పణ జరిగిందన్నారు. ఈ ఈ ప్రాంతంతో పాటు ఇక్కడ రైతాంగాన్ని వ్యవసాయపరంగా మరింత ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఇక్కడ వ్యవసాయ కళాశాలను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. అశ్వరావుపేట వ్యవసాయ కళాశాల ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగానే కాకుండా దేశవ్యాప్తంగా ప్రసిద్ధి పొందిందని, 35 ఏళ్ల ప్రస్థానంలో 2,500 మంది వ్యవసాయ విద్యార్థులు ఇక్కడ నుంచే తయారయ్యారని గుర్తు చేశారు. ఇక్కడ నుంచి బయటకు వెళ్తున్న విద్యార్థులు వ్యవసాయ పరమైన రంగాల్లో రైతులకు అవగాహన కల్పిస్తూ అండగా నిలవాలని సూచించారు. వ్యవసాయ కళాశాల నా చిరకాల




కలల పంట అని ఇతర వ్యవసాయ కళాశాలలకు దీటుగా ఈ కళాశాలను తీర్చిదిద్దడమే తన చిరకాల వాంఛ అని అన్నారు. దీనికోసం కళాశాల పూర్తిస్థాయి అభివృద్ధి కోసం అధికారులు ప్రతిపాదనలను సిద్ధం చేయాలన్నారు. పంటలకు వాల్యూయేటెడ్ రావాలంటే ప్రాసెసింగ్ ప్లాంట్లను ఎక్కువ సంఖ్యలో నెలకొల్పాల్సిన అవసరం ఉందని, ఇందుకోసం పామాయిల్ మొక్కల నుంచి బై ప్రొడక్ట్స్ పరిశోధనలు విస్తృతంగా జరగాలని ఆయన అన్నారు. భవిష్యత్తులో కలెక్టర్, ఎస్పీల కంటే పామాయిల్ రైతులు ఎక్కువ ఆదాయాన్ని రాబట్టే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. తెలంగాణ రాష్ట్రం వరి పంటలో నెంబర్ వన్ గా నిలుస్తోందని ప్రభుత్వం వరి రైతులను మరింతగా ప్రోత్సహిస్తూ ప్రస్తుతం బోనస్ ను సైతం అందిస్తుందని అన్నారు. గిరిజన ప్రాంతాల్లో రైతులతో పాటు అన్ని వర్గాల ప్రజల జీవితాల్లో వెలుగులు నింపేలా అభివృద్ధి కోసం ప్రత్యేక ప్రణాళికలను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. అశ్వరావుపేట కళాశాలలో ఆధునిక మౌలిక వసతుల కల్పనకు పూర్తి బాధ్యత తనదేనని ఈ సందర్భంగా మంత్రి హామీ ఇచ్చారు. అశ్వరావుపేట శాసనసభ్యులు జారే ఆదినారాయణ మాట్లాడుతూ మాది ఒక రైతు కుటుంబం అని అన్నారు. 1989లో గొప్ప సంకల్పంతో ఈ వ్యవసాయ కళాశాలను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సహకారంతో ఆనాడు ప్రారంభించి,ఎంతోమంది గొప్ప గొప్ప శాస్త్రవేత్తలను తయారుచేసిందన్నారు. వ్యవసాయ కళాశాల విద్యార్థులు ఆ శాస్త్రవేత్తలను ఆదర్శంగా తీసుకొని నూతన పద్ధతుల ద్వారా వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి పరచాలన్నారు. అశ్వరావుపేట నియోజక వర్గంలో వ్యవసాయ రీసెర్చ్ సెంటర్ ఏర్పాటుకు మరియు ములకలపల్లి మండలంలో ఫ్యాక్టరీ స్థాపనకు కృషి చేయాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మలనాగేశ్వరరావు ని కోరారు. ఈ సందర్భంగా చెట్ల యొక్క ప్రాముఖ్యత తెలిపే పాటను పాడి విద్యార్థుల్లో ఉత్సాహాన్ని పెంపొందించారు. నిజమైన రాజు అంటే రైతేనని, సామ్రాజ్యం అంటే పంట అని అన్నారు. వ్యవసాయంలో సామ్రాజ్యం అంటే వరి పంట దేనని మేము నూతనంగా మునగ సామ్రాజ్యం నెలకొల్పటానికి ప్రయత్నిస్తున్నామన్నారు. ప్రస్తుతంవ్యవసాయంలో సాగు విస్తీర్ణం తగ్గుతుందని, భూమాత నుండి మనం పంటను తీసుకుంటున్నాం కానీ,కృత్రిమంగా ఉపయోగించు ఎరువులు, పురుగు మందులు వల్ల ప్రజల ఆరోగ్యానికి హాని మరియు భూసారం కూడా తగ్గుతుందని తెలిపారు. వ్యవసాయ కళాశాలలో విద్యార్థులు సేంద్రియ ఎరువులపై దృష్టి పెట్టి వ్యవసాయ రంగా అభివృద్ధికి కృషి చేయాలని ఆయన సూచించారు. ఐ టి టి ఏ పి ఓ రాహుల్ మాట్లాడుతూలి ప్రతి సంవత్సరం సాగు విస్తీర్ణం తగ్గుతుందన్నారు. వ్యవసాయ రంగం మీదనే మానవ మనుగడ ఆధారపడి ఉంటుందన్నారు. ప్రతి ఒక్క ఊరులో మిల్లెట్స్ ద్వారా తయారు చేసే ఆహారానికి ప్రస్తుతం ప్రజలు ఇష్టపడుతున్నారు. అశ్వరావుపేట అనేది ఆయిల్ ఫామ్ కి కేంద్రంగా ఉందన్నారు. వ్యవసాయ రంగంలో వినూత్నమైనప్రయోగాల ద్వారానూతన వంగడాల సాగుపై రైతులకు అవగాహన కార్యక్రమాలు వ్యవసాయ కళాశాల ద్వారా కల్పించాలన్నారు. వ్యవసాయ శాఖ డైరెక్టర్ డాక్టర్ బి గోపి, డాక్టర్ రాజిరెడ్డి హార్టికల్చర్ వైస్ ఛాన్సర్, పాల్వంచ డిఎస్పి సతీష్ బాబు వ్యవసాయ కళాశాల పూర్వ విద్యార్థులు, వ్యవసాయ కళాశాల సిబ్బంది మరియు విద్యార్థులు మరియు తదితరులు పాల్గొన్నారు.

# నాణ్యమైన పౌష్టికాహారం, విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యం

**- పరిశుభ్రత పాటిస్తూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి**

**- జిల్లా కలెక్టర్ దివాకర్ టి.ఎస్**

ములుగు జిల్లా, డిసెంబర్ 14 (తీన్మార్ న్యూస్): రాష్ట్ర ప్రభుత్వం ఉన్నత విద్య అందించడమే కాకుండా ప్రతి విద్యార్థికి నాణ్యమైన పౌష్టిక ఆహారం అందించాలని ఉద్దేశంతో 40 శాతం డైట్ చార్జీలను పెంచిందని జిల్లా కలెక్టర్ దివాకర్ టి.ఎస్. అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని ఉద్దేశంతో డైట్ చార్జీలను పెంచగా పెరిగిన చార్జీలతో అందిస్తున్న పౌష్టిక ఆహార కార్యక్రమాన్ని శనివారం జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., డైరెక్టర్ టి సి ఆర్ అండ్ టి ఐ సముజ్వల, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవి చందర్ లతో కలిసి ములుగు మండలం జగ్గన్నపేట గ్రామంలోని ఆశ్రమ పాఠశాలలో జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కు విద్యార్థులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి కడుపునిండా తిండి కంటి నిండా నిద్రపోవాలని ఉద్దేశంతో ప్రభుత్వం సాహెూపిత నిర్ణయం తీసుకున్నారని అన్నారు. ప్రతి సంవత్సరం విద్యార్థులకు అందించే ఆహారం విషయంలో టెండర్లను నిర్వహించడం జరుగుతుందని, టెండర్‌లో పాల్గొనే వ్యక్తులు ప్రభుత్వం ఇచ్చే నిధులతో పిల్లలకు సరియైన అందించలేమని విషయాన్ని తమ దృష్టికి తీసుకురాగా ప్రభుత్వానికి ఈ విషయం తెలియంరడంతో డైట్ చార్జీలను పెంచడం ఆశించదగ్గ విషయమని అన్నారు. గత కొద్ది రోజుల క్రితం విద్యా కమిషన్ సభ్యులు జిల్లాలోని ఆరు ఆశ్రమ పాఠశాలలో పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారని వివరించారు. ఏడు రోజుల పాటు ఏ రోజుకి ఏ ఆహారం అందిస్తున్నానే విషయం తెలుసుకోవడానికి ప్రతి పాఠశాలలో బోర్డులను ఏర్పాటు చేయడం జరిగిందని, ఈ విషయం పిల్లల తల్లిదండ్రులకు తెలియ జేయడం



కోసమే ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశామని అన్నారు. విద్యార్థిని విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూనే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ చైర్మన్ రవిచందర్ మాట్లాడుతూ గత 10 సంవత్సరాలుగా గతంలోని పాలకులు డైట్ చార్జీలను పెంచకపోవడంతో విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందలేకపోయిందని, నేడు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఇబ్బందికరంగా ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 40 శాతం డైట్ చార్జింగ్ పెంచారని అన్నారు. డైట్ చార్జ్ పెంచడమే కాకుండా 200 శాతం కాస్మోటిక్స్ చార్జీలను పెంచారని హర్షం వ్యక్తం చేశారు. ప్రతి విద్యార్థి కడుపునిండా తిండి తిని ఉన్నత చదువులు చదవాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం చే జారీ చేయబడిన హాండ్ బుక్ ను కలెక్టర్ ఆవిష్కరించారు. విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అనందరిని ఆకట్టుకున్నాయి. కలెక్టర్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ విద్యార్థులతొ కలిసి మధ్యాహ్నం భోజనము చేశారు. ఈ కార్యక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ డిడి పోచ%శీ%, డి ఈ ఓ పాణిని, డిడ బ్లు ఓ శిరీష, ప్రజాప్రతినిధులు, విద్యార్థినీ, విద్యార్థులు, తల్లిదండ్రులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఈ నెల 16న ప్రజా వాణి రద్దు

హనుమకొండ జిల్లా, డిసెంబర్ 14 (తీన్మార్ న్యూస్): ఈ నెల 16వ తేదీ సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు హనుమకొండ జిల్లా ఇంఛార్జి కలెక్టర్ డాక్టర్ సత్య శారద శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్ లో జరిగే ప్రజావాణి కార్యక్రమాన్ని గ్రూప్-2 పరీక్షలు జరుగుతున్నందున రద్దు చేసినట్లు పేర్కొన్నారు. వచ్చే సోమవారం యథావిధిగా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్ లో ప్రజావాణి కార్యక్రమం జరుగుతుందని ఇంచార్జి కలెక్టర్ డాక్టర్ సత్య శారద ప్రకటనలో వెల్లడించారు.

## ఘనంగా డైట్, కాస్మోటిక్స్ చార్జీల పెంపు ప్రారంభోత్సవం

**- జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పింకేష్ కుమార్**

జనగామ జిల్లా, డిసెంబర్ 14 (తీన్మార్ న్యూస్): శనివారం, జిల్లాలోని పెంబర్తి మండలంలో గల ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్ పాఠశాలలో నిర్వహించిన డైట్, కాస్మోటిక్స్ చార్జీల పెంపు ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పింకేష్ కుమార్‌లి పాల్గొన్నారు. ఈ సందర్భంగా డైట్ మెనూ బోర్డును, హ్యాండ్ బుక్ ను ఆవిష్కరించారు. అలాగే పాఠశాలలోని వంట గది, డైనింగ్ గది, మూత్రశాలలు, మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యం, వంట సరుకులను నిల్వ చేసే గదిని పర్యవేక్షించి, తగిన సూచనలు చేశారు. అలాగే మధ్యాహ్న భోజనం స్టాక్ రికార్డులను తనిఖీ చేసి, నాణ్యమైన శుచిరుచికరమైన ఆహారం విద్యార్థులకు అందించాలని, పోషకాలతో కూడిన బలవర్ధకమైన భోజనం ఇవ్వాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి అదనపు కలెక్టర్ భోజనం చేసారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాదవశాత్తు గడ్డివాము దగ్ధం

దేవరకద్ర,డిసెంబర్ 14 (తీన్మార్ న్యూస్): ప్రమాదవశాత్తు గడ్డివాము దగ్ధమైంది.గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.వనపర్తి జిల్లా మదనాపురం మండలం తీర్మాలయాపల్లి గ్రామంలో ఖాళీ స్థలంలో బొగ్గు చిన్న బుర్రన్న, శ్రను పశువులు, గేదెల మేత కోసం 15 ఎకరాల గడ్డిని నిల్వ చేశాడు. శనివారం మధ్యాహ్నం గడ్డివాము నుంచి ఆకస్మికంగా మంటలు రావడాన్ని గ్రామస్థులు గుర్తించి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు.మంటలను అగ్నిమాపక సిబ్బంది ఇన్చార్జి దేవేందర్ రెడ్డి,శివప్రసాద్, ఉదయ్ కుమార్,బాలరాజు ఆర్పారు. ఈ ప్రమాదంలో రూ. ఒక లక్ష యాభై వేలు ఆస్తి నష్టం జరిగిందని,దీంతో మంటలు ఆర్పే లోపు పశుగ్రాసం కాలి బూడిదై పోయింది.తన పశువులు ఆకలితో అలమటిస్తాయని, తిరిగి పశు గ్రాసం కొనడానికి తన వద్ద ఆర్థిక స్తోమత లేదని,పేద కుటుంబానికి చెందిన తనను ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు బొగ్గు చిన్న



బుర్రన్న కోరారు.

# కేసుల్లో ఇరుక్కుంటే నష్టమే తప్ప లాభం ఉండదు

**కేసుల్లో ఇరువర్గాలు రాజి మార్గాన్ని ఎంచుకుంటే మంచిది**

**జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి. నారాయణ బాబు**

జయశంకర్ భూపాలపల్లి జిల్లా, డిసెంబర్ 14 (తీన్మార్ న్యూస్): జయశంకర్ భూపాలపల్లి జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలోని కోర్టు ప్రాంగణాల్లో శనివారం రోజున జాతీయ లోక్ అదాలత్ జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి మరియు జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ పి. నారాయణ బాబు గారు ప్రసంగించారు. ప్రజలు ద్వేష భావాలను తగ్గించుకొని రాజి మార్గాన్ని అలవాటు చేసుకోవాలన్నారు. రాజి మార్గమే రాజా మార్గం అని మనసులో నాటుకోవాలని తెలిపారు, దాంతో విలువైన సమయం, డబ్బు దుర్వినియోగం కాదని అన్నారు. చిన్న చిన్న సమస్యలను పెద్దవి చేసుకొని పంతాలకు పోయి కేసుల్లో ఇరికితే పోలిసు స్టేషన్లు, కోర్టులకు ఎక్కితే నష్టమే తప్ప లాభం ఉండదని జడ్జి గారు అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సీనియర్ సివిల్ జడ్జి మరియు న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కే. జయరాం



రెడ్డి, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి ఎన్. రామచంద్ర రావు గారు, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి జి. అఖిల గారు, అడ్వొకేట్స్ బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు లింగంపల్లి విష్ణువర్ధన్ రావు, ప్రధాన కార్యదర్శి శ్రీ బల్ల మహేందర్ గారు, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ మెరుగు రవీందర్, డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ శ్రీమతి కంప అక్షయ, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ శ్రీమతి జి. ప్రియాంక, బెంచ్ మెంబర్లు శ్రీ మంగళంపల్లి రాజ్ కుమార్, పారనంది సురేందర్, సిహెచ్. అశోక్ రెడ్డి, కనపర్తి కవిత, న్యాయవాదులు సంగేమ్ రవీందర్, రజినీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ గురుకులాలు

పరకాల, డిసెంబర్ 14 (తీన్మార్ న్యూస్): హనుమకొండ జిల్లా పరకాల పట్టణంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల/ కళాశాల ఆత్మకూర్ (మాతృశ్రీ స్కూల్ పరకాల) లో జరిగిన తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన గురుకులాల బాట కామన్ డైట్ మెనూ చార్జీల లాంచింగ్ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం విద్యార్థినీ, విద్యార్థులకు పెంచిన సందర్భంగా జరిగిన కార్యక్రమం లో పాల్గొన్న పరకాల మున్సిపల్ చైర్మన్ సోదా అనిత రామకృష్ణ మాట్లాడుతూ బాబాసాహెబ్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ స్ఫూర్తితో ఆయన సిద్ధాంతం ప్రకారం సమీకరించు బోధించు పోరాడు అని ఆయన బాటలో విద్యార్థిని, విద్యార్థులు అందరూ అదే బాటలో నడుచుకొని భావితరాలకు ఉన్నత విద్య అభ్యసించి ముందుకు సాగే విధంగా నడుచుకోవాలని, అలాగే విద్యార్థులను ప్రతిభవంతులను తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం గురుకులాల విద్యార్థిని, విద్యార్థులను ప్రతిభావంతులను చేయడమే కాంగ్రెస్



పార్టీ ప్రజాపాలన ప్రభుత్వం లక్ష్యం అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ తక్కల్లపల్లి స్వర్ణలత, పరకాల మండల ఎంఈఓ రమాదేవి గారు, మున్సిపల్ కౌన్సిలర్స్ నల్లెల్ల జ్యోతి అనిల్ కుమార్, పసుల లావణ్య రమేష్, మార్క ఉమా రఘుపతిగౌడ్,ఏకు రాజు, మార్కెట్ డైరెక్టర్ బొమ్మకంటి రుద్రమదేవి చంద్రమౌళి, కాంగ్రెస్ నాయకులు జూపాక కిషన్ తదితరులు పాల్గొన్నారు

# షార్ట్ సర్క్యూట్ బాధితునికి పదివేల రూపాయలు ఆర్థిక సాయం అందజేత

ఆత్మకూర్ డిసెంబర్ 14 (తీన్మార్ న్యూస్):- వనపర్తి జిల్లా ఆత్మకూరు మండలం తిప్పడంపల్లి గ్రామానికి చెందిన మారమోని కృష్ణ గుడిసె షార్ట్ సర్క్యూట్ వల్ల మొత్తం దగ్ధమైపోయింది.తన ఇంట్లో ఉన్న నిత్యావసర సరుకులు అన్నీ కూడా కాలిపోయాయి. ఇట్టి విషయాన్ని తెలుసుకున్న మక్తల్ నియోజకవర్గ బిజెపి నాయకులు కంబలాపురం రాము కుటుంబ సభ్యులను పరామర్శించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం నిత్యవసరాలు నిమిత్తం పదివేల రూపాయల ఆర్థిక సహాయని కుటుంబ సభ్యులకు అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం కృష్ణ కుటుంబాన్ని ఆదుకోవాలని ఈ సందర్భంగా వారు కోరారు. ఇట్టి



కార్యక్రమంలో గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలపై పోరాటం చేయాలి ..

**- సీపీఐ(ఎం) పార్టీ సీనియర్ నాయకులు పెద్ది వెంకట్ రాములు..**

మాక్లూర్ : ప్రజా సమస్యలను గుర్తించి ప్రభుత్వము ద్వారా సమస్యల పరిష్కారానికై సీపీఐ(ఎం) ఆద్వర్యంలో పోరాటం చేయాలని సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు పెద్ది వెంకట్ రాములు తెలిపారు. ఆలూరు మండలంలోని రామచంద్ర పల్లి గ్రామ శివారులో గల వడ్డెర కాలనిలో పార్టీ ఆర్మూర్ ఏరియా రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించారు. ముందుగా రామచంద్ర పల్లి వడ్డెర కాలనీ కమ్యూనిటీ భవనం నందు రామచంద్ర పల్లి శాఖ కార్యదర్శి ఈడగోటి సాయిలు జండా ఆవిష్కరణ చేసి ప్రారంభించారు. ప్రారంభానికి ముందుగా అమరవీరులకు సంతాప సభ నిర్వహించి ఒక నిమిషం మౌనం పాటించారు. ఈ సందర్భంగా సభ్యులకు గతి తార్కిక భౌతిక వాదం పని పద్ధతులు క్లాసును పార్టీ సీనియర్ నాయకులు పెద్ది వెంకట రాములు బోధించారు. ఈ క్లాస్ కొండగంగాధర్ ప్రిన్సిపాల్ వ్యవహరించారు. ప్రధానంగా పాలకవర్గాలు వాస్తవాలను కప్పిపుచ్చి తోన్మాదాన్ని ప్రజల్లో ఏ విధంగా వ్యవహరి స్తున్నారని అన్నారు. నిజ జీవితంలో మానవుడు ప్రకృతి పై పోరాడుతూ సమాజాన్ని మారుస్తూ వచ్చాడని ఈ మార్పు వల్ల అభివృద్ధి చెందడం




జరిగిందని తెలియజేశారు. కానీ పేద ప్రజలను మూడ విశ్వాసాల వైపు మళ్ళిస్తున్నారని, సైన్సును అందరు ఆచరించాలని వాస్తవాన్ని తెలుసుకోవాలని తెలిపారు. పాలకవర్గాలు ప్రజా సమస్యలు గాలికి వదిలేసి ప్రజా సమస్యలపై ప్రజలు కలిసి పోరాటం చేయకుండా ప్రజల మధ్య విభేదాలు సృష్టించే కృషి చేస్తున్నారని అన్నారు దేశ సంపదను కొంతమంది పెట్టుబడిదారులకి అప్పనంగా చెప్తున్నారని పెద్ది వెంకట్ రాములు చెప్పారు. పార్టీ నిర్మాణం క్లాసును ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి పల్లపు వెంకటేష్ వివరించారు. ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి సిరుపలింగం పాటలు పాడుతూ పార్టీ సభ్యులను ఆనందింపజేశారు.

# గ్రూప్ 2 పరీక్షలకు సర్వం సిద్ధం

**- జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**

**- రెండు రోజులపాటు పరీక్షలకు హాజరుకానున్న 11,309 అభ్యర్థులు**

**- నిమిషం ఆలస్యమైనా పరీక్షలకు నో ఎంట్రీ**

వరంగల్ జిల్లా, డిసెంబర్ 14 (తీన్మార్ న్యూస్): తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో జరిగే గ్రూప్ 2 పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తినట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పేర్కొన్నారు. సీసీ కెమెరాలు నిఘా నీడలో ఈ పరీక్షలు జరగనున్నాయని పరీక్షలకు జిల్లాలోని 28 కేంద్రాలలో 11,309 మంది అభ్యర్థులు హాజరుకానున్నారని అన్నారు. 15వ తేదీ (ఆదివారం) ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 12.30 వరకు మొదటి పేపర్, మధ్యాహ్నం 3.00 గంటల నుండి సాయంత్రం 5.30 గంటల వరకు
రెండవ పేపర్, అదేవిధంగా 16వ తేదీ (సోమవారం) ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 12.30 వరకు, మూడవ పేపర్, మధ్యాహ్నం 3.00 గంటల నుండి సాయంత్రం 5.30 గంటల వరకు నాల్గవ పేపర్ ఉంటుందని, అభ్యర్థులను ఉదయం 8:30 నుండి 9:30 గంటల వరకు పరీక్ష కేంద్రాల్లో అనుమతి ఇస్తారన్నారు. 9:30 గంటల తర్వాత గేట్లు మూసి వేస్తారని అన్నారు. ఆలస్యంగా వస్తే అభ్యర్థులను అనుమతించరని తెలిపారు. అభ్యర్థుల సౌకర్యార్థం టీ జి ఎస్ ఆర్ టి సి ద్వారా బస్సులు నడపడం జరుగుతుందని, వరంగల్ బస్ స్టేషన్ వరంగల్ రైల్వే స్టేషన్, పోచమ్మ మైదాన్ సర్కిల్, ఎంజీఎం సర్కిల్ ల వద్ద హెల్ప్ డెస్క్ లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

**అభ్యర్థులకు సూచనలు**

పరీక్ష కేంద్రాలకు అభ్యర్థులను ఉదయం సెషన్ లో 8.30 నుంచి, మధ్యాహ్నం సెషన్ లో 1.30 నుంచి అనుమతించడం జరుగుతుంది. పరీక్ష కేంద్రాల గేటు ఉదయం 9.30 గంటలకు, మధ్యాహ్నం 2.30 గంటలకు మూసి వేస్తారు. దీని తర్వాత పరీక్ష కేంద్రాలకు ఎవరిని అనుమతించరు. అభ్యర్థులు పరీక్ష కేంద్రాలకు తమ వెంట బ్లూ/బ్లాక్ పాయింట్ పెన్నులు, ఫోటోతో కూడిన హాల్ టికెట్, ప్రభుత్వం చేజారి చేసిన ఒరిజినల్ ఫోటో ఐడి కార్డ్ తీసుకుని రావాలి. హాల్ టికెట్ పై పాస్పోర్ట్ సైజ్ ఫోటో ముద్రించి తీసుకెళ్ళాలి. ఒకే హాల్ టికెట్ ను పరీక్ష మొత్తం వినియోగించాలి. హాల్ టికెట్ లో ఫోటో సరిగ్గా లేకపోతే అభ్యర్థి 3 పాస్పోర్ట్ సైజ్ ఫోటోలు గెజిటెడ్ అధికారి లేదా చివర చదివిన విద్యాసంస్థ ప్రిన్సిపల్ సంతకంతో తీసుకువచ్చి పరీక్షా హాల్లో ఇన్విజిలేటర్ కు అప్పగించాలి. అభ్యర్థులు పరీక్ష కేంద్రానికి ఒక రోజు ముందు వచ్చి చూసుకోవాలి. పరీక్ష కేంద్రాలకు అభ్యర్థులు క్యాలిక్యులేటర్, సెల్ ఫోన్, పెన్ డ్రైవ్ ,బ్లూ టూత్ డివైసెస్, జువెలరీ, ఎలక్ట్రానిక్ గాడ్జెట్ మొదలగు సామాగ్రి తీసుకుని రావడానికి వీల్లేదు. చెప్పులు మాత్రమే వేసుకుని రావాలి. షూస్ వేసుకోవద్దు. సెల్ఫోన్ బ్లూటూత్ ఇతర ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్ అభ్యర్థులు తీసుకువచ్చినట్లైతే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటారు. బయోమెట్రిక్ ప్రక్రియ పూర్తయ్యే వరకు అభ్యర్థులు పరీక్ష హాల్ విడిచి వెళ్ళరాదు. బయోమెట్రిక్ ఇవ్వని అభ్యర్థుల ఓఎంఆర్ షీట్ వ్యాలీడ్ కాదు. బయోమెట్రిక్ విధానం ఉన్న నేపథ్యంలో అభ్యర్థులు మెహందీ టాటూ వంటివి పెట్టుకోవద్దు. ప్రతి పేపర్ సమయంలో అభ్యర్థి ఇన్విజిలేటర్ సమక్షంలో హాల్ టికెట్ పై సంతకం పెట్టాలి. మోడల్ ఓ.ఎం.ఆర్ షీట్ల ను వెబ్ సైట్ నుంచి డౌన్లోడ్ చేసుకుని సరిగ్గా బబుల్స్ చేయడం ప్రాక్టీస్ చేయాలి. ఓ.ఎం.ఆర్ షీట్ ను సరిగా చెక్ చేసుకోవాలి. పరీక్ష ముగిసే వరకు అభ్యర్థులు పరీక్షా హాల్ ను విడిచి వెళ్లడానికి వీలులేదు.

**గంట ముందే చేరుకోవాలి**

గ్రూప్-2 పరీక్ష రాసే అభ్యర్థులు%బ% వారికీ కేటాయించిన కేంద్రానికి నిర్దేశిత సమయానికంటే గంట ముందే చేరుకోవాలి. టీజీ పీఎస్ సి నిబంధనలు కచ్చితంగా పాటించాలి. ఆయా పరీక్ష కేంద్రాల్లో ఇప్పటికే సౌకర్యాలు కల్పించాము.

# విద్యార్థుల ఉన్నతి కోసమే కామన్ డైట్

**హుజుర్నగర్ లో కామన్ మెనూ, డైట్ కార్యక్రమం**

**- విద్యార్థులతో కలిసి భోజనాలు చేసిన కలెక్టర్**

**- ప్రైవేట్ పాఠశాలకు దిటుగా ప్రభుత్వ రెసిడెన్షియల్ స్కూల్స్**

**- జిల్లా కలెక్టర్ తేజాస్ నంద్ లాల్ పవర్**





సూర్యాపేట, డిసెంబర్ 14 (తీన్మార్ న్యూస్): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గురుకుల బాట కార్యక్రమంలో భాగంగా కామన్ డైట్, మెనూను కార్యక్రమాన్ని తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్, హుజూర్నగర్ పట్టణంలో జిల్లా కలెక్టర్ తేజాజ్ నంద్ లాల్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్టి, మైనారిటీ ఇతర స్కూల్స్ నందు విద్యార్థులకు 40 శాతం డైట్ చార్జీలు, 200 శాతం కాస్మటిక్ చార్జీలను పెంచడం జరిగిందని, చార్జీలను నాలుగు వారాలకు సంబంధించి మెనూ కూడా ఈరోజు నుంచి అమలు చేయడం జరుగుతుందని అన్నారు. ప్రతి రోజు కామన్ డైట్ ప్లాన్ తో పాటు ప్రతిరోజు స్కూల్ కి వచ్చిన సరుకులు అనగా బియ్యం, పప్పులు, కూరగాయలు, పాలు, నూనె వంటి వాటిని ఏ విధంగా సైంటిఫిక్ పద్ధతిలో నిలువ చేసుకోవాలో సూచించడం జరిగినదని అలాగే వంట చేసే పద్ధతిని కూడా తెలుసుకొని ఎంతమందికి ఎంత క్వాంటిటీ వంట చేస్తే సరిపోతుందో తెలుసుకుని వంట చేయాలని, కిచెన్లో వంట చేసేటప్పుడు వంట పాత్రలు ఎలా ఉండాలో సూపర్వైజర్లకు, ప్రిన్సిపాల్ లకు ఆదేశాలు ఇచ్చి రోజువారీగా అమలు చేయడానికి అనేక స్కూల్స్ కాలేజీలలో అమలు అమలు చేస్తున్నాం అని చెప్పడానికి పిల్లలు యొక్క తల్లిదండ్రులు ధైర్యం కల్పించడానికి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం అన్నారు. అంతర్జాతీయ స్థాయిలో ఎడ్యుకేషన్ స్టాండర్డ్స్ ఎలా ఉన్నాయో విద్యార్థులు కూడా అందుకు అనుగుణంగా విద్యా బోధన చేయాలని దానితోపాటు నాలెడ్జ్, స్కిల్ డెవలప్మెంట్, పర్సనాలిటీ కలిగి ఉండాలని సూచించారు. పిల్లల భవిష్యత్తు శుభ్రంగా ఉండాలంటే బట్టలు, పుస్తకాలు తో పాటు డైట్, కాస్మోటిక్ చార్జీలను పెంచడం జరిగినదని, ఉన్నత విద్య ఉంటే భవిష్యత్తులో ముందుకు వెళ్లడం జరుగుతుందని దేశ భవిష్యత్తు ముందు ముందు యువత చేతిలో ఉంటుందని కావున ప్రతి విద్యార్థి కష్టపడి చదవాలని, భవిష్యత్తులో ఏమి సాధించాలో దేని మీద ఇంట్రెస్ట్ ఉందో ముందుగానే ప్రణాళిక వేసుకొని అందుకు అనుకూలంగా కృషి చేయాలని మన ఆలోచన ఎలా ఉందో మన మాటలు కూడా అలా వస్తాయని, రోజువారీ ప్రవర్తన ఎలా ఉంటే మనం నడవడిక కూడ ఇలాగే ఉంటుందని కలెక్టర్ అన్నారు. రాబోవు పదవతరగతి వార్షిక పరీక్షల్లో నూటికి నూరు శాతం డిస్టెన్స్ లో ఉత్తీర్ణత సాధించాలని కలెక్టర్ విద్యార్థులను కోరారు. అనంతరం విద్యార్థులతో కలిసి కలెక్టర్ భోజనాలు చేసి అందరికి డైట్, మెనూ చేర్జెస్ పంపు సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్ ప్రిన్సిపాల్ రెహనా, స్పెషల్ ఆఫీసర్ ఏ డి ఏ రమేష్ బాబు, ఎమ్మార్వో నాగార్జున రెడ్డి, పిల్లల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# కేబినెట్ విస్తరణకు అడగడుగునా అడ్డంకులు

హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయ్యింది. అప్పటి నుంచి బుగ్గ కారు కోసం కొందరు నేతలు కంట్లో వత్తులేసుకుని ఎదురు చూస్తున్నారు. రేవంత్ రెడ్డి ఢిల్లీకి వెళ్లడం ఏదో శుభవార్త తెస్తారని ఎదురుచూడడం.. ఢిల్లీ నుంచి వచ్చి విస్తవరణపై పెదవి విప్పకపోవడంతో డీలా పడిపోవడం సర్వ సాధారణమైపోయింది. ఈ నిశబ్ధ వాతావరణంతో కొండంత ఆశ పెట్టుకున్న ఆశావహుల గుండెలు గుభేల్మంటున్నాయి. అసలు విస్తరణ ఉంటుందా? ఉంటే ఎప్పుడు ఉంటుంది? అంటూ గుర్రుగా ఉన్నారట ఎమ్మెల్యేలుగతేడాది డిసెంబర్ 7న సీఎంగా అధికార పగ్గాలు చేపట్టిన రేవంత్ రెడ్డి..తనతో పాటు 11మందితో ప్రమాణ స్వీకారం చేశారు. అప్పటి నుంచి క్యాబినెట్ విస్తరణ ఊరిస్తూనే ఉంది. నెలలు గడుస్తున్నా విస్తరణ మాత్రం జరగడం లేదు. ప్రస్తుతం రేవంత్ క్యాబినెట్లో అదనంగా మరో ఆరుగురికి చోటు దక్కే అవకాశం ఉంది. ఈ ఆరు స్థానాల కోసం.. పదుల సార్లు.. అధిష్టానంతో చర్చోప చర్చలు.. మంతనాలు జరిగాయి. ఏడాది పూర్తైనా అదే సాగదీత.. అదే ఊరడింపు..సంక్రాంతికి అన్నారు. అంతలోనే ఉగాది తర్వాత చూద్దామన్నారు. ఇంతలోనే ఆషాఢ మాసం తెరపైకి వచ్చింది. అది పోగానే లోక్సభ ఎన్నికలు అడ్డొచ్చాయి. కొత్త పీసీసీ ప్రెసిడెంట్ ఎంపిక తర్వాత.. విస్తరణ పక్కా అంటూ ప్రచారం జరిగింది. చెప్పినట్లుగానే పీసీసీ చీఫ్గా మహేశ్ కుమార్ గౌడ్ నియామకం పూర్తి చేసింది. ఇక అడ్డంకులన్నీ తొలిగిపోయాయి. దసరా పండుగకు కొత్త మంత్రులు వస్తారని అధిష్టానం లీకులు ఇచ్చింది. కానీ ఆ లీకులకు అధిష్టానం పోకడలకు పొంతన లేదు. మొన్నటికి మొన్న దీపావళికి పక్కా అంటూ ఊరడించి ఊసురుమనిపించారు అధిష్టానం పెద్దలు. ఇంతలోనే మహారాష్ట్ర, జార్ఖండ్ ఎన్నికలు రాగానే మళ్లీ ఢిల్లీ పెద్దలు సైలెంట్ అయ్యారు. ఆ రెండు రాష్ట్రాల ఫలితాలు వచ్చాయి ప్రభుత్వాలు కొలువుదీరాయి. ఐనా క్యాబినెట్ విస్తరణపై నో క్లారిటీ. మంత్రివర్గంలో చోటు కోసం చాలా మంది ఆశావహులు కొండంత ఆశ పెట్టుకున్నారు. అందులో మాజీ మంత్రులతో పాటు సీనియర్ ఎమ్మెల్యేలు, జూనియర్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఉన్నారు. ఎవరి లెవల్ లో వారు పైరవీలు చేసుకుంటూ వస్తున్నారు. సీఎం రేవంత్ రెడ్డి నుంచి అధిష్టానం వరకు విన్నపాలు చేసుకుంటున్నారు. దీంతో క్యాబినెట్ బెర్త్ కోసం పోటీ పడుతున్న వారి సంఖ్య భారీగానే ఉంది. మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి, మల్రెడ్డి రంగారెడ్డి, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, శ్రీహరి ముదిరాజ్, ఆది శ్రీనివాస్, వివేక్ వెంకట స్వామి, ప్రేమ్ సాగర్ రావు పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. వచ్చే నెల మరో 7 ఎమ్మెల్సీ స్థానాలు కాంగ్రెస్కు లభించే అవకాశం ఉంది. ఎమ్మెల్సీలుగా ఎన్నికయ్యే ఒకరిద్దరు నేతలకు కూడా మంత్రివర్గంలో పదవి ఆశిస్తున్నారు. ఈ జాబితాలో షబ్బీర్ అలీ, పహీం ఖురేషీ పేర్లు వినిపిస్తున్నాయి.కేబినెట్ బెర్తులు ఆరు ఖాళీ ఉంటే పోటీ పడుతున్న నేతల సంఖ్య పదికి పైగా ఉంది. దీంతో మంత్రివర్గ విస్తరణకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చేందుకు ఢిల్లీ పెద్దలకు బిగ్ టాస్క్గా మారిందట. మంత్రి పదవులు ఆశిస్తున్న ఆశావహులు పెద్ద సంఖ్యలో ఉండటంతో అధిష్టానం ఎటూ తేల్చుకోలేక పోతోందని తెలుస్తోంది. దీనంతటికీ కారణం ఒక్కటే.. అనుకున్న శాఖలు రాకున్నా.. మంత్రి పదవి దక్కకున్నా అసంతృప్తి జ్వాలలు రగిలే అవకాశముంది. అందుకే ఎప్పటికికప్పుడు వాయిదాలు వేస్తూ వస్తోందని ఆ పార్టీ ఇన్సైడ్ టాక్..అంతేకాదు సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సీనియర్ మంత్రుల సిఫారసులు కూడా హైకమాండ్కు తలనొప్పిగా మారాయంట.. కొందరు కర్ణాటక సర్కార్ పెద్దలతో కూడా సిఫార్సులు చేయిస్తున్నారని సమాచారం. ఇలాంటి పరిస్థితుల్లో ఎవరి రికమండేషన్ను పరిగణలోకి తీసుకోవాలో తెలియక హైకమాండ్ పెద్దలు అయోమయంలో పడ్డారనేది కాంగ్రెస్ సర్కిల్స్లో వినిపిస్తున్న చర్చ.. విభేదాలు, అలకలు లేకుండా సాఫీగా సాగిపోతున్న సమయంలో మంత్రివర్గ విస్తరణ చేసి లేని తలనొప్పులు తెచ్చుకోవడం ఎందుకని ఢిల్లీ పెద్దలు వాయిదాల జపం చేస్తున్నారు. మరి ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడని మంత్రి పదవుల ఆశావహులు గుర్రుగా ఉన్నారంట.. మరి హైకమాండ్ ఏం చేస్తుంది, ఈ సారైనా సీఎం హస్తిన టూర్ తీపి కబురుతో ముగుస్తుందో లేదో చూడాలి.

# రైతాంగ సమస్యల పరిష్కారంలో విఫలం

**- సంఘం జిల్లా కార్యాలయం ప్రారంభం**

వనపర్తి రూరల్: రైతాంగ సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. సాగర్ అన్నారు. వనపర్తి జిల్లా మర్రికుంట కలెక్టరేట్ వద్ద నిర్మించిన తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యాలయాన్ని సాగర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ మూడోసారి అధికారాన్ని చేపట్టిన తర్వాత మొండిగా రైతు వ్యతిరేక విధానాలను అమలు చేసేందుకు పూనుకుంటుందని తెలిపారు. కనీస మద్దతు ధరల చట్టం చేసేందుకు పూనుకోవడం లేదన్నారు. అదే విధంగా, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం తమ ఎన్నికల మ్యానిఫెస్టోలో రైతులకు అనేక వాగ్దానాలు ప్రకటించిందని తెలిపారు. రూ.2 లక్షల రైతు రుణమాఫీ, రైతు భరోసా పేరుతో భూమి ఉన్న రైతులతో పాటు, కౌలు రైతులకు ఏడాదికి ఎకరాకు రూ.15 వేలు, భూమిలేని రైతుకూలీలకు ఏడాదికి రూ.12 వేలు ఇస్తామని హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. అలాగే, అన్ని పంటలను మెరుగైన మద్దతు ధరతో ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని, మూతబడిన చక్కెర కర్మాగారాలు తెరిపిస్తామని, పసుపు బోర్డు ఏర్పాటు చేస్తామని హామీలిచ్చిందని తెలిపారు. రూ.2 లక్షల్లోపు పంట రుణాలను ప్రభుత్వ అంచనా ప్రకారం 41లక్షల మందికి రూ.31వేల కోట్లు మాఫీ చేయాల్సి ఉన్నా కుంటి సాకులతో పూర్తిగా మాఫీ చేయలేదని తెలిపారు. ధరణి చట్టంలో అనేక లోపాలున్నాయని, దాన్ని రద్దు చేసి భూమాతను తీసుకొస్తామని ప్రభుత్వం చెప్పిందని, కానీ ఇప్పటికీ అమల్లోకి రాలేదని అన్నారు. గత ప్రభుత్వం ధరణిలో రద్దు చేసిన పాసు పుస్తకాల చట్టం 1971 సెక్షన్ 26ని తిరిగి పునరుద్ధరించాలన్నారు. రైతు ఆత్మహత్యల నివారణకు, కౌలుదారులకు



చట్టపరమైన రక్షణ కల్పించాలని కోరారు. ప్రభుత్వ భూములకు రక్షణ కల్పించడంతో పాటు చట్టాల్లో మార్పు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం అమరచింత పట్టణంలోని దుంపాయికుంటలో కొన్నేండ్లుగా గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్న వారిని సందర్శించి స్థలాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) కార్యదర్శి పుట్ట ఆంజనేయులు, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర నాయకులు ఎండీ జబ్బార్, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బాల్ రెడ్డి, పరమేశ్వర చారి, జిల్లా ఉపాధ్యక్షులు జీఎస్ గోపి, దేవేందర్, ఐద్వా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సాయిలీల, లక్ష్మి, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఎం రాజు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్. రాజు, ఆవాజ్ జిల్లా కన్వీనర్ పెద్దకాజా, టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు రవి ప్రసాద్, కెవీపీఎస్ జిల్లా అధ్యక్షులు భగత్, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ సభ్యులు గంధం నాగరాజు, కవి జనజ్వాల, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఆది, డీవైఎఫ్ఐ జిల్లా కో కన్వీనర్ మహేష్, పీఎన్ఎం జిల్లా అధ్యక్షులు నందిమల్ల రాములు తదితరులు పాల్గొన్నారు.

# జన్నారంలో న్యూ కామన్ డైట్ కార్యక్రమాన్ని ప్రారంభించిన అడిషనల్ కలెక్టర్..

జన్నారం: రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల కోసం ప్రవేశపెట్టిన న్యూ కామన్ డైట్ కార్యక్రమాన్ని జన్నారం మండల కేంద్రంలోని బీసీ హాస్టల్ లో శనివారం మంచిర్యాల జిల్లా అడిషనల్ కలెక్టర్ సభావత్ మోతిలాల్ నాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 8 సంవత్సరాల నుంచి విద్యార్థులకు డైట్ మెనూ చార్జీలు పెంచలేదన్నారు. హాస్టల్లో చదువుతున్న విద్యార్థులు మంచి భోజనం అందించాలనే ఉద్దేశంతోనే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందన్నారు. చికెన్ గుడ్లు నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందిస్తామన్నారు. అలాగే ప్రభుత్వం విద్యార్థుల కోసం కాస్మోటిక్ చార్జీలను కూడా పెంచిందన్నారు. హాస్టల్లో ఏర్పాటుచేసిన న్యూ డైట్ మెనూ వాల్ పోస్టర్ను ఆవిష్కరించారు. అనంతరం వంటశాలను తనిఖీ చేశారు. చూసి శుభ్రతను పాటించాలన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి సహపంతి భోజనం చేశారు. అలాగే మండలంలోని కవ్వాల్ గ్రామంలో ఉన్న గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలలో రాష్ట్ర జిసిసి చైర్మన్ కోట్నాక తిరుపతి, మండల కేంద్రంలోని ఆశ్రమ బాలుల పాఠశాలలో తాసిల్దార్ రాజ మనోహర్ రెడ్డి, తపాలపురం గ్రామంలో ఉన్న ఎస్సీ బాయ్స్ హాస్టల్ లో డిప్యూటీ తాసిల్దార్ రామ్మోహన్ రావు న్యూ డైట్ కార్యక్రమాలను వేరువేరుగా ప్రారంభించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ



విద్యార్థులు క్రమశిక్షణతో ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. హాస్టల్ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారి వినోద్ కుమార్,మండల ఎంఈఓ విజయ్ కుమార్ ఎంపీడీవో శశితల, బిసి హాస్టల్ వార్డెన్ రమేష్, తపా లాపూర్ ఎస్సీ హాస్టల్ వార్డెన్ గోపాల్, ఫోన్కాల్ మేజర్ గ్రామపంచాయతీ ఈవో , రాహుల్, ఆయా హాస్టల్ లో విద్యార్థులు ఉపాధ్యాయులు ఇబ్బంది పాల్గొన్నారు.

# అటవీ శాఖ కార్యాలయాల్లో ఫర్నీచర్ జప్తు

**- కోర్టు ఆదేశాల మేరకు తరలించిన అధికారులు**
**- ఉద్యోగిని విధుల్లోకి తీసుకోవాలన్న ఉత్తర్వులను పట్టించుకోనందుకే..**

జన్నారం: గోదావరిఖని లేబర్ కోర్టు ఆదేశాల మేరకు లక్షెట్టిపేట కోర్టు అధికారులు ఎండీ యూసుఫ్, (బెలీఫ్) ప్రాసెస్ సర్వెయర్లు సాయికుమార్, సంధ్యారాణి మంచిర్యాల జిల్లా జన్నారం మండలంలోని అటవీ డివిజన్ కార్యాలయంలో ఫర్నీచర్ను సీజ్ చేశారు. డివిజన్ కార్యాలయంలో అనిమల్ ట్రాకర్గా విధులు నిర్వహిస్తున్న బియ్యాల లింగయ్యను అటవీ డివిజన్ అధికారులు తొలగించడంతో తాను నష్టపోయానని గోదావరిఖని లేబర్ కోర్టును ఆశ్రయించారు. 18 జూన్ 2024న మళ్లీ విధుల్లోకి తీసుకోవాలని లేబర్ కోర్టు డివిజన్ అధికారులకు ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ పట్టించుకోకపోవడంతో మళ్లీ బియ్యాల లింగయ్య కోర్టును ఆశ్రయించారు. డివిజన్ అధికారులు నిర్లక్ష్యం వహించడంతో అటవీ డివిజన్ కార్యాలయంలోని ఫర్నీచర్ను సీజ్ చేయాలని కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు అధికారులు, జన్నారంలోని ఎఫ్డీఓ కార్యాలయం, తాళ్లపేట ఎఫ్ఆర్ఓ కార్యాలయంలో ఉన్న టేబుల్లు,



కుర్చీలు, కంప్యూటర్లు, బీరువాలు, మహీంద్రా జీప్ ఇతర సామాగ్రిని సీజ్ చేసి కోర్టుకు తరలించారు. దీనిపై మంచిరాల డీఎఫ్ఓ శివ్ ఆసీస్ సింగ్ను వివరణ కోరగా.. జన్నారం డివిజన్ కార్యాలయం, తల్లాపేట రేంజ్ కార్యాలయంలోని ఫర్నీచర్ను కోర్టు అధికారులు తీసుకెళ్లింది వాస్తవమేనన్నారు. అటవీ శాఖ ఆధ్వర్యంలో దీనిపై హైకోర్టులో పిటిషన్ వేసినట్టు తెలిపారు.

# భారీగా పెరుగుతున్న మస్క్ ఆదాయం

న్యూయార్క్: ఎలోన్ మస్క్ 400 బిలియన్ డాలర్ల మొత్తం సంపదను కలిగి ఉన్నటువంటి ప్రపంచంలోని మొదటి వ్యక్తిగా నిలిచాడు. ఇప్పటి వరకు ఎవరూ ఇలాంటి చరిత్ర సృష్టించలేదు. బ్లూమ్బెర్గ్ నివేదిక ప్రకారం.. స్పేస్ ఎక్స్ వ్యాపార విక్రయాల కారణంగా.. ఎలాన్ మస్క్ నికర విలువలో 50 బిలియన్ డాలర్లు అనూహ్యంగా పెరిగాయి. తన కంపెనీ టెస్లా షేర్లలో భారీ పెరుగుదల తర్వాత మస్క్ సంపద ఊహించని విధంగా పెరిగింది. బ్లూమ్బెర్గ్ బిలియనీర్స్ ఇండెక్స్ ప్రకారం, ఎలోన్ మస్క్ నికర విలువ బుధవారం ఒక్క రోజే 62 బిలియన్ డాలర్లు పెరిగింది. మొత్తం నికర విలువ 447 బిలియన్ డాలర్లకు చేరుకుంది. విశేషమేమిటంటే, డొనాల్డ్ ట్రంప్ విజయం తర్వాత ఎలోన్ మస్క్ నికర విలువలో 183 బిలియన్ డాలర్లు పెరిగాయి. మరోవైపు, టెస్లా షేర్లు కూడా మంచి పెరుగుదలను చవిచూశాయి. డిసెంబర్ 4 నుండి టెస్లా షేర్లు 72 శాతానికి పైగా పెరిగాయి. బ్లూమ్బెర్గ్ నివేదిక ప్రకారం స్పేస్ ఎక్స్, దాని పెట్టుబడిదారులు కంపెనీ ఉద్యోగులు, ఇతర వ్యక్తుల నుండి 1.25 బిలియన్ డాలర్ల విలువైన షేర్లను కొనుగోలు చేసేందుకు అంగీరించారు. ఈ డీల్ తర్వాత స్పేస్ ఎక్స్ విలువ 350 బిలియన్ డాలర్లుగా మారింది. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రైవేట్ స్టార్టప్గా అవతరించింది. ఈ ఒప్పందం కారణంగా ఎలాన్ మస్క్ నికర విలువలో 50 బిలియన్ డాలర్లు పెరిగాయి. మరోవైపు టెస్లా షేర్లు పెరగడం వల్ల ఎలాన్ మస్క్ సంపద కూడా పెరిగి 12 బిలియన్ డాలర్లు లాభపడింది. ఎలోన్ మస్క్ ఒక్క రోజులో 62 బిలియన్ డాలర్ల లాభం ఆర్జించాడు. ఆ తర్వాత అతని మొత్తం నికర విలువ 447 బిలియన్ డాలర్లకు పెరిగిందిఅధ్యక్ష ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంప్ గెలిచిన తర్వాత ఎలాన్ మస్క్ సంపద పెరుగుదల మరింత పెరిగింది. నవంబర్ 5న ఎలోన్ మస్క్ నికర విలువ 264 బిలియన్ డాలర్లు. ఇప్పుడు అతని నికర విలువ 447 బిలియన్ డాలర్లు దాటింది. అంటే ఎలోన్ మస్క్ సంపద అతి తక్కువ సమయంలో 183 బిలియన్ డాలర్లు పెరిగింది. ప్రస్తుత సంవత్సరంలో 200 బిలియన్ డాలర్లకు పైగా పెరుగుదల కనిపించింది. బ్లూమ్బెర్గ్ బిలియనీర్స్ ఇండెక్స్ ప్రకారం, జూలై 1, 2023 నాటికి, ఎలోన్ మస్క్ నికర విలువ 126 బిలియన్ డాలర్లు. ఇందులో సుమారు ఒకటిన్నర సంవత్సరాలలో 3.55 రెట్లు అంటే 255 శాతం పెరుగుదల కనిపించింది.మరోవైపు టెస్లా షేర్లలో మంచి పెరుగుదల ఉంది. బుధవారం ట్రేడింగ్ సెషన్లో, టెస్లా షేర్లు సుమారు 6 శాతం పెరిగాయి. జీవితకాల గరిష్ట స్థాయి 424.88డాలర్లకి చేరుకుంది. టెస్లా షేర్లు నవంబర్ 4 నుండి మంచి పెరుగుదలను చూస్తున్నాయి. నవంబర్ 4న కంపెనీ షేర్ల విలువ 242.84 డాలర్లు. ఇందులో ఇప్పటి వరకు 75 శాతం వరకు పెరుగుదల కనిపించింది. అమెరికా స్టాక్ మార్కెట్ ముగిసిన తర్వాత, టెస్లా షేర్లు 5.93 శాతం లాభంతో 424.77డాలర్ల వద్ద ముగిసింది.ఎలోన్ మస్క్ ఈ సంవత్సరం ముగిసేలోపు 500 బిలియన్ డాలర్లపై దృష్టి పెట్టాడు. అక్కడికి చేరుకోవడానికి, ఎలోన్ మస్క్కి 15 రోజుల కంటే ఎక్కువ సమయం ఉంది. ఎలోన్ మస్క్కి 53 బిలియన్ డాలర్లు మాత్రమే అవసరం. అంటే 500 బిలియన్ డాలర్ల మార్కును చేరుకోవాలంటే, ఎలోన్ మస్క్ సంపద ప్రతిరోజూ సగటున 2.76 బిలియన్ డాలర్లు పెరగాలి. నవంబర్ 5 నుండి ప్రతిరోజూ ఎలోన్ మస్క్ సంపదలో సగటున 5 బిలియన్ డాలర్ల పెరుగుదల ఉంది. మస్క్ సంపద సంవత్సరం చివరి నాటికి 500 బిలియన్ డాలర్లకు చేరుకుంటుంది.

# ఇథనాల్ కంపెనీ అనుమతులు రద్దు చేయాలి

**- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి**
**- పార్టీ ఆధ్వర్యంలో పాదయాత్ర**

మోతె: ప్రజల ప్రాణాలకు ముప్పు కలిగించే.. పంట పొలాలను బీడు భూములుగా మార్చే ఎన్ఎమ్కే ఇథనాల్ కంపెనీ వద్దని, దానికి ఇచ్చిన అన్ని అనుమతులనూ రద్దు చేయాలని సీపీఐ(ఎం) సూర్యాపేట జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మోతె మండల పరిధిలోని రావిపహాడ్ గ్రామంలో నిర్మిస్తున్న కంపెనీని రద్దు చేయాలని, నిర్మాణానికి ఇచ్చిన అన్ని అనుమతులను వెనక్కి తీసుకోవాలని కోరుతూ పార్టీ ఆధ్వర్యంలో రావిపహాడ్ పాదయాత్ర చేపట్టారు. శెట్టిగూడెం కూడలి, సర్వారం గ్రామాలలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మట్టిపల్లి సైదులు ఆధ్వర్యంలో చేపట్టిన పాదయాత్రను నాగార్జున రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. రావిపహాడ్ గ్రామంలో ఇథనాల్ కంపెనీ పనులు పూర్తయితే శెట్టిగూడెం, సర్వారం, కోటపాడు, అప్పన్నగూడెం గ్రామాలతోపాటు అనేక గిరిజన తండాలు, పరిసర ప్రాంతాల్లో భూగర్భజలాలు కలుషితమై ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కంపెనీ వల్ల శ్వాసకోశ వ్యాధులు,




చర్మవ్యాధులు, గుండె, మెదడు, కిడ్నీ, లివర్ తదితర సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందన్నారు. రైతుల పంటపొలాలు నాశనమవుతా యన్నారు. బంగారం లాంటి పంటలు పండే భూములు బీళ్లుగా మారే ప్రమాదం ఉందని చెప్పారు.

పరిశ్రమ ద్వారా విడుదలయ్యే వ్యర్థాలను పక్కనే ఉన్న పాలేరు రిజర్వాయర్కి వదిలితే భూగర్భ జలాలు పూర్తిగా కలుషిత మవు తాయని, పశువులు మృత్యువాతపడే అవకాశం ఉందని అన్నారు. కంపెనీ రద్దు కోసం చేసే పోరాటంలో రాజకీయా లకతీతంగా ప్రజలు తమతో కలిసి రావాలని కోరారు.

# నిర్వాసితులు ఇంటి నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించాలి...

ఖమ్మం: రైల్వే మూడవ లైన్ క్రింద ఇండ్లు కోల్పోయిన నిర్వాసితులు, వారికి కేటాయించిన ఇండ్ల స్థలాలలో ఇంటి నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని, వారికి అవసరమైన అన్ని రకాల మౌలిక వసతులు కల్పించుటకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖామాత్యులు తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. రైల్వే మూడవ లైన్ ఏర్పాటుతో భూములు కోల్పోయిన వారికి రఘునాథపాలెం మండలం వెంకటాయపాలెంలో ఇళ్ల పట్టాలను అందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రైల్వే 3వ లైన్ క్రింద పూర్తిగా ఇండ్లను కోల్పోయిన 58 మందికి వెంకటాయపాలెంలో 75 గజాల చొప్పున ఇండ్ల పట్టాలు పంపిణీ చేస్తున్నామని, వీరికి పట్టాలతో పాటు ఇంటి విలువ పరిహారం కూడా అందించామని అన్నారు. నిర్వాసితులు ప్రభుత్వం అందించిన ఇంటి పట్టాలతో ఇండ్ల నిర్మాణ పనులు ప్రారంభించాలని, వీరికి అవసరమైన త్రాగు నీటి సరఫరా, డ్రైనేజ్, విద్యుత్తు మొదలగు మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటామని అన్నారు. అమరావతి వెళ్ళే జాతీయ రోడ్డు, సర్వీస్ రోడ్డు ఈ ప్రాంతంలో వస్తాయని, ఇక్కడ భూములకు మంచి ధరలు పెరుగుతాయని అన్నారు. యంగ్ ఇండియా సమీకృత విద్యాలయాలు సమీపంలోనే నిర్మాణం అవుతున్నాయని, మీ పిల్లలు ఇక్కడే చదువుకునే అవకాశం ఉంటుందని అన్నారు. ప్రభుత్వం అందించిన పరిహారం సద్వినియోగం చేసుకుంటూ ఇండ్ల నిర్మాణ



పనులు ప్రారంభించాలని, ఇక్కడ సమీపంలోనే కలెక్టరేట్ ఉన్నదని, వైద్య కళాశాల, ఆసుపత్రి వస్తాయని, ఈ ప్రాంతం చాలా విలువ కలిగిన ప్రాంతం అవుతుందని అన్నారు. ఖమ్మం నగరంలోని నిరుపేదలకు ఇండ్లు ఇచ్చే బాధ్యత, రోడ్డు వెడల్పు వంటి కార్యక్రమాల్లో ఇళ్లను కోల్పోయే వారికి సైతం నగరం చుట్టూ మంచి స్థలాల్లో చూసి ఇంటి పట్టాలు అందించేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి, ఖమ్మం ఆర్డీఓ నరసింహారావు, మునిసిపల్ కార్పొరేటర్లు తోట రాములు, కమర్తపు మురళీ, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# కరెంటు స్తంభాలు, ట్రాన్స్ఫార్మర్లు తొలగించండి -సీఎమ్డీ ముషారఫ్

హైదరాబాద్: గ్రేటర్ హైదరాబాద్ నగరంలో రోడ్డుకు అడ్డుగా ఉండి ట్రాఫిక్కు అంతరాయం కలిగిస్తూ, ప్రమాదాలకు కారణమవుతున్న విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్ఫార్మర్లను వెంటనే తొలగించాలని తెలంగాణ రాష్ట్ర దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎస్పీడీసీఎల్) సీఎమ్డీ ముషారఫ్ ఫారూఖీ అధికారుల్ని ఆదేశించారు. శుక్రవారం మింట్ కాంపౌండ్లోని ఆ సంస్థ ప్రధాన కార్యాలయంలో వివిధ ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారుల సమీక్షా సమావేశం జరిగింది. జీహెచ్ఎంసీ, ట్రాఫిక్ పోలీస్, టౌన్ప్లానింగ్, టీజీఎస్పీడీసీఎల్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. నగరంలో రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్న రహదారులతో పాటు, షేక్పేట్, వనస్థలిపురం, ఎల్బీనగర్, గచ్చిబౌలి, ఉప్పల్, హబ్సిగూడ, మాసాబ్ట్యాంక్ సహా రద్దీగా వుండే రహదారులపై ఉన్న అడ్డంకులను తొలగించేందుకు ఈ సమావేశంలో ప్రణాళికలు రూపొందించారు. దీనికోసం ఆయా శాఖల సమన్వయం కోసం నోడల్ అధికారులను నియమించారు. డిస్కం నుంచి డివిజనల్ ఇంజనీర్, ట్రాఫిక్ పోలీస్ విభాగం నుంచి స్టేషన్ హౌస్ ఆఫీసర్, జీహెచ్ఎంసీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, టౌన్ప్లానింగ్ విభాగం ఏసీపీలు నోడల్ ఆఫీసర్లుగా వ్యవహరిస్తారు. ఈ టీం క్షేత్ర స్థాయిలో పర్యటించి డిసెంబర్ చివరినాటికి రోడ్డుకు అడ్డుగా ఉన్న కరెంటు స్తంబాలు, ట్రాన్స్ఫార్మర్లు, ఇతర కట్టడాలను గుర్తించి, వాటి తొలగింపు, తరలింపునకు అవసరమైన



అంచనాలు, అనుమతుల ప్రక్రియను పూర్తి చేయాలని నిర్ణయించారు. 2025 ఫిబ్రవరి నాటికి తొలగింపు,తరలింపు ప్రక్రియను పూర్తి చేయాలని గడువును నిర్దేశించారు. రోడ్డుకు అడ్డుగా ఉపయోగంలో లేని విద్యుత్ స్తంభాలు, రోడ్డుపై అడ్డదిడ్డంగా పడి ఉన్న స్తంభాలను వెంటనే తొలగించాలని ఈ సందర్భంగా సీఎమ్డీ డిస్కం అధికారులను ఆదేశించారు. సమావేశంలో జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్ శివ కుమార్, ట్రాఫిక్ అడిషనల్ కమిషనర్ పీ విశ్వప్రసాద్, ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ సీ జోయెల్ డేవిస్, డీసీపీ ట్రాఫిక్-3 ఆర్ వెంకటేశ్వర్లు, డీసీపీ రాచకొండ వీ శ్రీనివాసులు, డైరెక్టర్ ఆపరేషన్ (ఇంచార్జి) డాక్టర్ ఎన్ నరసింహులు, డైరెక్టర్ ఫైనాన్స్ (ఇంచార్జి) సుధా మాధురి, జీహెచ్ఎంసీ చీఫ్ ఇంజినీర్ భాస్కర్ రెడ్డి, డిస్కం చీఫ్ ఇంజినీర్లు పాండ్య, చక్రపాణి, కామేష్ తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలి..

**- బిసి ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలి**
**- సిపిఎస్ విధానాన్ని రద్దు చేయాలి**
**- బిసిటీయు జిల్లా అధ్యక్షులు మాడవేడి వినోద్ కుమార్**

కంఠేశ్వర్: పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని, బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలని, సిపిఎస్ విధానాన్ని రద్దు చేయాలని బీసీటీయూ జిల్లా అధ్యక్షులు మాడవేడి వినోద్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం స్థానిక కేర్ డిగ్రీ కళాశాలలో జరిగిన బిసిటియు సమావేశం లో వివిధ మండలాల బిసిటియు కార్యవర్గాలను ఏర్పాటు చేశారు. బిసి ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు మాడవేడి వినోద్ కుమార్ బిసిటియు సభ్యత్వ నమోదును ప్రారంభించారు .

ఈ సందర్భంగా మాడవేడి వినోద్ కుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వం నూతన పిఆర్సీ ని వెంటనే అమలు చేయాలని, పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని, బిసి ఉద్యోగుల కు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలని, సిపిఎస్ విధానాన్ని రద్దు చేయాలని, జనాభా దామాషా




ప్రకారం బిసి లకు రిజర్వేషన్లు అమలు చేయాలని, 4 పెండింగ్ డిఏ లను కూడా అమలు చేయాలని, గురుకుల ఆదర్శ పాఠశాల, కెజిబివి ల సమస్యలను పరిష్కరించాలని, బిసి లకు క్రిమిలేయర్ విధానాన్ని తొలగించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిసి ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ గోపాలకృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్ లు కంచరి రవికుమార్, కొట్టాల రామకృష్ణ, గౌరవ అధ్యక్షులు కైరంకొండ బాబు, గౌరవ సలహాదారులు రమణ స్వామి, కొట్టూరు రమేష్, కార్యదర్శులు సతీష్ కుమార్, నామాల శంకర్, మోపాల్ మండల బిసిటియు అధ్యక్షులు గంగయ్య, మాక్లూర్ మండల బిసిటియు అధ్యక్షులు గంగోనె సంజీవ్, ఇందల్వాయి మండల బిసిటియు ప్రధాన కార్యదర్శి ఇంద్రకరణ్ తదితరులు పాల్గొన్నారు.

# కాలం చెల్లిన వాహనాలపై దృష్టి

న్యూఢిల్లీ: వస్తువుకైనా.., వాహనానికైనా.., చివరికి మనిషికైనా ఎక్స్‌పైరీ డేట్ ఉంటుంది కదా.. సరే మనిషిని పక్కన పెడితే వాహనాల ఎక్స్‌పైరీ డేట్ ఎప్పుడో ఎందుకో తెలుసా.. ఆ తర్వాత కూడా వాడితే ఏమవుతుందో తెలిస్తే వెంటనే వాటిని విడిచిపెడతారు. అయితే గతంలో అయితే అలానే జరిగేది. కానీ ఇప్పుడు అలా కాదు. వీటిని తిరిగి ఇచ్చి మరో బైక్ పై రాయితీలను పొందవచ్చు. కాలం చెల్లిన వాహనాలపై ఆర్టీఏ స్పెషల్ ఫోకస్ పెట్టింది. షోరూం నుంచి బయటకు వచ్చిన తర్వాత 15 ఏండ్లు పూర్తయిన వాహనాలను కాలం చెల్లిన వాహనాలుగా పరిగణిస్తారు. వీటిని స్వచ్ఛందంగా స్క్రాపింగ్ చేసుకుంటే రాయితీలు వస్తాయి. ఈ విషయంపై ఇటీవల అధికారులు ఆర్టీఏ కార్యాలయాలతో పాటు ప్రధాన కూడళ్లలో వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నారు. కాలం చెల్లిన వాహనాలపై ఆర్టీఏ ప్రత్యేక దృష్టి పెట్టింది. 15 ఏండ్లు నిండిన వాటిని స్వచ్ఛందంగా స్క్రాపింగ్ చేసుకుంటే రాయితీలు పొందచ్చునని ఆర్టీఏ కార్యాలయాల్లో వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నారు. ఇప్పటికే హైదరాబాద్ లాంటి మహా నగరంలో ఎక్స్ పైరీ వెహికిల్స్ వేలాదిగా ఉన్నాయని గణాంకాలు చెప్తున్నారు. ఇవన్నీ రోడ్లపై చక్కర్లు కొడుతూ పొల్యూషన్ పెంచుతున్నాయి. కాలం చెల్లిన వాహనాలు రోడ్లపైకి రావడం వల్ల చాలా ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. వీటితో ముఖ్యంగా పర్యావరణం కలుషితం అవుతుంది. కాలుష్యం పెరుగుతుంది. 15 ఏళ్ల వాహనం అంటే ఇంజిన్ మొత్తం మరమ్మతుకు గురవుతుంది. ఈ విధంగా ఇంజిన్ నుంచి పొగలు వచ్చి వాయు కాలుష్యం ఏర్పడుతుంది. ఇక అధిక శబ్దం చేస్తుంది కాబట్టి శబ్ద కాలుష్యం కూడా ఉంటుంది. ఆ తర్వాత బ్రేకులు పరిగా పడక తోటి వాహదారులు, బాటసారులను కూడా ఢీ కొనే ప్రమాదం ఉంటుంది. కాబట్టి కాలం చెల్లిన వాహనాన్ని స్క్రాప్ కు పంపించాలని అధికారులు ఆదేశిస్తూనే ఉన్నారు.కాలం చెల్లిన వాహనాల విషయంలో అధికారులు తనిఖీల్లో కొన్ని పట్టుబడుతున్నాయి. ఇందులో చాలా వరకు స్కూల్ బస్ లు, కార్లు, బైకులు ఉంటుంటు న్నాయి. గడువు ముగిసినా ఇంకా ఇవి రోడ్లపై కనిపిస్తూనే ఉన్నాయి. అధికారులు వీటిపై ప్రత్యేక దృష్టి సారించారు. తనిఖీలు నిర్వహిస్తూ పట్టుకుంటూ ఫైన్లు వేస్తున్నారు. స్క్రాపింగ్ ఉపయోగాలను కూడా వివరిస్తున్నారు. ట్రాన్స్ పోర్ట్ కు సంబంధించిన వాహనాలు 20 ఏండ్ల లోపు స్క్రాప్ చేస్తే.. ఏటా పన్నుపై 10 శాతం రాయితీ కలుగుతుంది. సొంత వాహనం 15 ఏండ్ల తర్వాత స్వచ్ఛందంగా స్క్రాప్ కు వస్తే సర్టిఫికెట్ ఆఫ్ డిపాజిట్ వర్తిస్తుంది. దీనిలో భాగంగా రెండేళ్లలోపు అదే విలువ గల వాహనం కొంటే మోటార్ వెహికిల్ (ఎంవీ) ట్యాక్స్‌లో మినహాయింపు వస్తుంది. ఈ అంశాలపై వాహనదారులకు విరివిగా అవగాహన కల్పిస్తున్నారు.

# ఆయిల్ ఫాం సాగు లక్ష్యాన్ని చేరాలి

సిద్దిపేట: ఆయిల్ ఫాం సాగు ఈ సంవత్సర లక్ష్యాన్ని తప్పనిసరిగా చేరేలా పనిచేయ్యాలని జిల్లా కలెక్టర్ ఎం. మను చౌదరి జిల్లా లోని ఆయిల్ ఫ్రేడ్ వ్యవసాయ మరియు ఉద్యాన వన శాఖల అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో జిల్లా లోని ఆయిల్ ఫ్రేడ్, వ్యవసాయ మరియు ఉద్యాన వన శాఖ అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ముందుగా జిల్లాలో ఇప్పటి వరకు 12,200 ఎకరాల్లో ఆయిల్ ఫాం సాగవుతుందని అలాగే 2024-25సంవత్సరానికి గాను 4000ఎకరాల లక్ష్యం పెట్టుకొని ఈ సంవత్సరం 1817 ఎకరాలు డిడిలు కట్టించగా అందులోను 1020 ఎకరాల్లో మొక్కలు పెట్టడం పుర్తైయ్యిందని తెలిపారు.ఈ సమావేశం లో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆయిల్ ఫాం సాగు అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుందని జిల్లాకు ఇచ్చిన లక్షాన్ని తప్పనిసరిగా పూర్తి చెయ్యాలి. అలాగే ఆయిల్ పాం కర్మాగారం సైతం వచ్చే ఏడాది మార్చి నెల లోపూ పూర్తి అవుతుంది. క్షేత్ర స్థాయిలో అధికారులు రైతుల ఇంటికి వెళ్ళి ఆయిల్ పాం వల్ల కలిగే లాభాలు తెలుపి ప్రేరణ కల్పించాలి. గ్రామాల్లో అయిల్ ఫాం సాగు గుర్చి పెద్ద ఎత్తున ప్రచారం చెయ్యాలి. ఆయిల్ పాం సాగులో దశలు రైతులను ఎంపిక చెయ్యడం, డిడి కలెక్షన్లు, మార్కింగ్, డ్రిప్ ఫిట్టింగ్, మొక్కలు పెట్టడం అనే పక్రియను వెంటవెంటనే పూర్తి చెయ్యాలి.మీ మండలాలోని పనిలో వెనకబడిన క్లస్టర్ల ను రోజువారీ పర్యవేక్షణ చేసి ఆయా క్లస్టర్ లలో రైతులతో వ్యవసాయ, ఉద్యాన వన శాఖ అధికారులు మీటింగ్ లు పెట్టాలి. పెద్ద భూస్వాములనే కాకుండా చిన్న, సన్న కారు రైతులను కూడా ఆయిల్ ఫాం వైపు మళ్ళించాలి. వ్యవసాయ శాఖ, ఉద్యాన వన శాఖ, ఆయిల్ ఫ్రేడ్ కార్పొరేషన్ అధికారులు అందరు సమన్వయంతో 100% పూర్తి లక్ష్యాన్ని చేరేవిధంగా పని చేయ్యాలని అదికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రాదిక, ఉద్యాన వన శాఖ అధికారి సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించాలి

కమాన్ పూర్: ఉత్పత్తి వ్యయాన్ని తగ్గిస్తూ నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలని రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ నరేంద్ర సుధాకరరావు అన్నారు. సింగరేణి వ్యాప్తంగా నిర్వహిస్తునటువంటి మల్టీ డిపార్ట్మెంటల్ సమావేశాలలో భాగంగా ఆర్జీ-3 ఏరియాలోని ఓ.సి-1 ఉపరితలగని సైట్ ఆఫీస్ నందు నిర్వహించిన కార్యక్రమాన్ని రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ నరేంద్ర సుధాకరరావు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించుకున్న 72 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను అధిగమించడానికి, యంత్రాలను పూర్తిస్థాయిలో వినియోగించి, భద్రతతో కూడిన ఉత్పత్తిని సాధించడానికి కృషి చేయాలని అన్నారు. ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించుకోవాల్సిన బాధ్యత అందరి పైన ఉందని, కావున ఎవరి స్థాయిలో వారు సాధ్యమైనంత వరకు వ్యయాన్ని తగ్గించుకోవాలని కోరారు. అంతే కాకుండా నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటిస్తూ, అంకిత భావంతో పని చేయాలని అన్నారు. భద్రత పట్ల అశ్రద్ధ వహించకుండా అధికారులు, సూపర్వైజర్లు సంబంధిత ఉద్యోగులకు భద్రతపై అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి ఉద్యోగి సక్రమంగా పని చేస్తూ వ్యక్తిగతంగా అభివృద్ధి చెందుతూ, సంస్థ అభివృద్ధికి తోడ్పడాలన్నారు. ఏ ఇతర ప్రభుత్వ సంస్థలో లేని విధంగా సింగరేణి సంస్థలో ఉద్యోగుల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని, కావున ఉద్యోగులందరూ దీనిని గమనించి, సమిష్టి కృషితో నాణ్యత, ఉత్పత్తి, ఉత్పాదకత పెంచుతూ సంస్థను మరింత ముందుకు తీసుకువెళ్లాలని కోరారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా ఎప్పటికప్పుడు రూపొందించే ప్రణాళికలకు అనుగుణంగా పని చేసేందుకు సిద్ధంగా ఉండాలని కోరారు. సంస్థ పై వినియోగదారుడు పెట్టుకున్న నమ్మకాని వమ్ము



చేయకుండా చూడటం మనందరి బాధ్యత అని అన్నారు. ఈ సమావేశంలో భాగంగా సింగరేణి సాధిస్తున్నటువంటి ప్రగతి, నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించడానికి చేసినటువంటి ప్రణాళికల గురించి సంబంధిత అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. దీనిలో భాగంగా సంస్థ అభివృద్ధికి సంబంధించి పలువురు ఉద్యోగులు ఇచ్చినటువంటి సలహాలు, సూచనలను సంబంధిత అధికారులు స్వీకరించారు.కార్యక్రమంలో గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు వై.వి.రావు, డి.టి.రావు, జి.వెంకటస్వామి, ఏరియా ఇంజనీర్ వై.వి.శేఖరబాబు, ఎస్వోటుజియం జి.రఘుపతి, ఫైనాన్స్ ఎజియం పి.శ్రీనివాసులు, ఐఈ డిజిఎం కె.చంద్రశేఖర్, పర్సనల్ విభాగాధిపతి బి.సుదర్శనం, ప్రాజెక్ట్ ఆఫీసర్ జె.రాజశేఖర్, ప్రాజెక్ట్ ఇంజనీర్ ఉదయ్ భాస్కర్, మేనేజర్ ఉదయ్ హరిజన్, డివైపియం వి.సునీల్ ప్రసాద్, సంక్షేమ అధికారి సాయి కృష్ణ, ఇతర అధికారులు, కార్మిక సంఘాల నాయకులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలి....

**జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**

**అలరించిన సైన్స్ ఫెయిర్**

**రామగుండం, ఎన్టిపిసి లోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్**

గోదావరిఖని: ప్రభుత్వ పాఠశాలలో చదివి పిల్లలకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. ఎన్టిపిసి లోనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నిర్వహించిన సైన్స్ ఫెయిర్ లో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష పాల్గొన్నారు. సైన్స్ ఫెయిర్ లో విద్యార్థులు ఏర్పాటు చేసిన ప్రదర్శనలను కలెక్టర్ ఆసక్తిగా పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, సైన్స్ ఫెయిర్ లో ఆసక్తిగా పాల్గొన్న విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. పాఠశాలకు విద్యార్థులకు మధ్యాహ్నం నాణ్యమైన ఆహారం భోజనంగా అందించాలని, ఎటువంటి పొరపాట్లు జరగడానికి వెళ్లలేదని కలెక్టర్ అధికారులకు సూచించారు. పాఠశాలల్లో విద్యతో పాటు విద్యార్థులకు అవసరమైన



వినోదం ఉండాలని, సైన్స్ ఫెయిర్ నిర్వహణ, పర్యాటక ప్రాంతాల చదవాల్సిన వంటి కార్యక్రమాలను ప్లాన్ చేయడం చాలా మంచిదని కలెక్టర్ తెలిపారు. అనంతరం రామగుండం లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేసిన కలెక్టర్ , విద్యార్థులకు అందుతున్న ఆహారాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి మాధవి, జిల్లా సైన్స్ అధికారి రఘునందన్ రావు, మండల విద్యాశాఖ అధికారులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# బియ్యం.. మాయం

**- ఇష్టారాజ్యంగా రేషన్ డీలర్ల వ్యవహారం**

**- క్వింటాళ్ల కొద్దీ నిల్వలు.. పంపిణీలో తేడాలు**

**- టాస్క్‌ఫోర్స్ దాడులు.. రెండు రేషన్‌షాప్‌లు సీజ్**

**- ఆ అధికారి తీరుతో గాడితప్పిన జిల్లా పౌరసరఫరాల శాఖ**

**- ఖమ్మం నుంచి సముద్రాలు దాటి రవాణా**



ఖమ్మం: రాష్ట్రవ్యాప్తంగా ప్రజాపంపిణీ వ్యవస్థ గాడి తప్పింది. పౌర సరఫరాల శాఖలోని కొందరు అధికారులు శాఖాపరమైన లోపాలను తమ అవినీతికి వేదిక చేసుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. ఖమ్మం, సూర్యాపేట జిల్లాలు ధాన్యం, బియ్యం లెక్కల్లో తేడాలతో తరచూ వార్తల్లో నిలుస్తున్నాయి. గతంలో ఖమ్మం జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో తహసీల్దార్‌గా పనిచేసిన ఒకరు ప్రస్తుతం జిల్లా పౌరసరఫరాల శాఖలో కీలక అధికారిగా ఉన్నారు. ఆ ఆఫీసర్ బాధ్యతలు చేపట్టాక టాస్క్‌ఫోర్స్ దాడులు జరిగిన ప్రతిసారీ ఆ శాఖలోని లోపాలు బయటపడుతున్నాయి. ఆ అధికారి అండతోనే డీలర్లు, మిల్లర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఆ అధికారి అవినీతి కారణంగా కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్)లో బకాయిలు చోటుచేసుకున్నాయి. తాజాగా శుక్రవారం రేషన్ దుకాణాలపై హైదరాబాద్‌కు చెందిన టాస్క్‌ఫోర్స్ అధికారుల దాడుల్లో ఓ ఇద్దరు డీలర్లు పట్టుబడ్డారు. ఒకరు 29 క్వింటాళ్ల బియ్యాన్ని ఒక్కరోజులోనే పంపిణీ చేసినట్టు తప్పుడు లెక్కలు చెప్పగా.. మరొకరి దుకాణంలో 20 క్వింటాళ్ల బియ్యం అదనంగా ఉండటం జిల్లా పౌరసరఫరాల శాఖ నిర్లక్ష్యాన్ని ఎత్తి చూపుతోంది.

**టాస్క్‌ఫోర్స్ దాడుల్లో 49 క్వింటాళ్ల బియ్యం తప్పుడు లెక్కలు**

హైదరాబాద్ నుంచి వచ్చిన టాస్క్‌ఫోర్స్ బృందం ఖమ్మంలోని రేషన్ దుకాణాలపై దాడులు నిర్వహించింది. స్థానిక మేదరిబజార్‌లో ఓ రెండు చౌకదుకాణాలను పరిశీలించగా దానిలో లాల్‌జాన్‌పాషా అనే డీలర్ 29 క్వింటాళ్ల బియ్యాన్ని ఒక్కరోజులోనే పంపిణీ చేసినట్టు తప్పుడు లెక్కలు చూపించారు. ఇదే బజార్లో ఉన్న పద్మ అనే మరో డీలర్ దుకాణంలో 20 క్వింటాళ్ల రేషన్ బియ్యం అదనంగా ఉండటం చర్చనీయాంశమైంది. డ్వాక్రా మహిళకు 2017లో కేటాయించిన ఈ రేషన్ డీలర్‌షిప్‌ను 2018లో రెన్యూవల్ చేయలేదు. నాలుగేండ్లుగా ఆమె రేషన్‌షాప్‌ను రెన్యూవల్ చేసుకోకుండానే నిర్వహిస్తున్నా జిల్లా అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం. పైగా ఇన్‌చార్జి డీలర్‌గానే ఈమె కొనసాగుతున్నారు. నాలుగేండ్లయినా ఇన్‌చార్జి డీలర్‌షిప్ ఎలా కొనసాగిస్తారనే దానిపై అనుమానాలు నెలకొన్నాయి. షాప్ నెం.22, 110 డీలర్లు ఎవరో తెలియకుండా బియ్యం ఎందుకు ఇస్తున్నారని టాస్క్‌ఫోర్స్ అధికారులు స్థానిక అధికారి డీటీ విజరుకుమార్‌ను ప్రశ్నించారు. బాణోత్ రవికుమార్‌కు కేటాయించిన షాప్ నంబర్ 110ని ఆయన తొలగించారు. ఆ తర్వాత ఆ షాప్‌ను ఎవరికి కేటాయించారో కూడా తెలియడం లేదు. ఏ ఆర్డర్ కాపీ లేకుండా షాప్ నెం.22కు రేషన్ బియ్యం సరఫరా చేస్తుండటంపైనా టాస్క్‌ఫోర్స్ అధికారులు ఓఎస్డీ అంజయ్య, రిటైర్డ్ తహసీల్దార్ మసూద్‌పాష, రిటైర్డ్ ఎస్ఐ పుల్లయ్య అనుమానాలు వ్యక్తం చేశారు. బియ్యం కేటాయింపులో అవకతవకలు జరిగినట్టు స్పష్టమైతే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# వీసీలతో త్రిసభ్య కమిటీ నియామకం

**- వర్సిటీ అధ్యాపకుల భర్తీ విధివిధానాలపై**

**- ఘంటా చక్రపాణి నేతృత్వంలో ఏర్పాటు**

**- రెండు వారాల్లో నివేదిక సమర్పించాలి :వీసీల సమావేశంలో ఉన్నత విద్యామండలి నిర్ణయం**



హైదరాబాద్: విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టుల (అసిస్టెంట్ ప్రొఫెసర్) భర్తీకి సంబంధించి విధివిధానాల రూపకల్పన కోసం ఉపకులపతుల (వీసీ)తో త్రిసభ్య కమిటీని ప్రభుత్వం నియమించింది. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం (బీఆర్ఏఓయూ) వీసీ ఘంటా చక్రపాణి చైర్మెన్‌గా, ఉస్మానియా విశ్వవిద్యాలయం (ఓయూ) వీసీ మొలగారం కుమార్, మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం (ఎంజీయూ) వీసీ అల్తాఫ్ హుస్సేన్ సభ్యులుగా కమిటీని ఏర్పాటు చేసింది. ఇద్దరు అదనపు నిపుణులు, వారి నైపుణ్యం ఆధారంగా కమిటీ నిర్ణయం తీసుకుంటుంది. ఆ కమిటీ అధ్యాపక పోస్టుల భర్తీ ప్రక్రియ ఏ విధంగా చేపట్టాలనేది అధ్యయనం చేసి రెండువారాల్లోగా నివేదికను సమర్పించాల్సి ఉంటుంది. బీఆర్ఎస్ ప్రభుత్వం గతంలో రాష్ట్రమంతా ఒకే యూనిట్‌గా పరిగణనలోకి తీసుకుని ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేయాలని నిర్ణయించింది. అందుకనుగుణంగా తెలంగాణ కామన్ రిక్రూట్‌మెంట్ బోర్డు బిల్లును రూపొందించింది. అసెంబ్లీలో ఆమోదించి గవర్నర్ ఆమోదానికి పంపించింది. ఆ బిల్లు వల్ల విశ్వవిద్యాలయాల స్వయం ప్రతిపత్తి దెబ్బతింటుందని ప్రొఫెసర్ల నుంచి వ్యతిరేకత వచ్చింది. దీంతో ఆ బిల్లును రాష్ట్రపతి పరిశీలనకు గవర్నర్ పంపించారు. ఇప్పటి వరకు ఆ బిల్లును రాష్ట్రపతి ఆమోదించలేదు, తిరస్కరించలేదు. దీంతో తెలంగాణ కామన్ రిక్రూట్‌మెంట్ బోర్డు బిల్లు పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది. తాజాగా ముగ్గురు వీసీలతో నియమించిన కమిటీ కామన్ రిక్రూట్‌మెంట్ బోర్డు బిల్లుతోపాటు ఇతర అంశాలను పరిశీలించి నివేదికను సమర్పించాల్సి ఉంటుంది. అంటే అధ్యాపక పోస్టుల భర్తీకి విశ్వవిద్యాలయం యూనిట్‌గా పరిగణించాలా? అనేది పరిశీలిస్తుంది. లేదంటే రాష్ట్రమంతా ఒకే యూనిట్‌గా పరిగణించి టీజీపీఎస్సీ ద్వారా భర్తీ చేయాలా? అనేది కూడా అధ్యయనం చేస్తుంది. ఇతర రాష్ట్రాల్లో అనుసరిస్తున్న పద్ధతులను పరిశీలిస్తుంది. వాటి ఆధారంగా తెలంగాణలో ఏ విధానాన్ని పాటిస్తే వర్సిటీలకు మేలు కలుగుతుంది, అధ్యాపకుల పోస్టుల భర్తీ ప్రక్రియ న్యాయ వివాదాలు లేకుండా జరుగుతుందనేది ఆ కమిటీ పరిశీలించి నివేదికను సమర్పిస్తుంది. దాన్ని ఉన్నత విద్యామండలి పరిశీలించి ప్రభుత్వ ఆమోదానికి సిఫారసు చేస్తుంది. రాష్ట్రంలో 12 విశ్వవిద్యాలయాల పరిధిలో మొత్తం 2,825 పోస్టులను ప్రభుత్వం మంజూరు చేసింది. అందులో 765 (27.08 శాతం) మంది ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు మాత్రమే పనిచేస్తున్నారు. 2,060 (72.92 శాతం) ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చివరిసారిగా 2013లో విశ్వవిద్యాలయాల్లో ప్రొఫెసర్ పోస్టుల నియామకాల ప్రక్రియ సాగింది. తెలంగాణ ఆవిర్భవించిన తర్వాత వర్సిటీల్లో నియామకాల ప్రక్రియను గత ప్రభుత్వం చేపట్టకపోవడం గమనార్హం. రాష్ట్రంలో మొదటి విడతలో 1,061 అధ్యాపక పోస్టులను భర్తీ చేసేందుకు అనుమతి ఇస్తూ బీఆర్ఎస్ ప్రభుత్వం 2017, నవంబర్ 25న ఉత్తర్వులను జారీ చేసింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఆ పోస్టులను భర్తీ చేయలేదు. ప్రొఫెసర్ల ఉద్యోగ విరమణ వయస్సును 60 నుంచి 65 ఏండ్లకు పెంచే అంశాన్ని కూడా పరిశీలించి నివేదిక ఇస్తుంది. కెరీర్ అడ్వాన్స్‌మెంట్ స్కీం (సీఏఎస్) పదోన్నతులకు సంబంధించిన సవాళ్లను పరిష్కరించేందుకు ఉన్నత విద్యాశాఖలోని యూజీసీ నిబంధనలు, జీవో నెంబర్ 15ఉ అనుగుణంగా బోధనా సిబ్బంది నియామకాలకు విధివిధానాలను తయారు చేస్తుంది. హైదరాబాద్‌లో వీసీల సమావేశాన్ని ఉన్నత విద్యామండలి నిర్వహించింది.

# ఉద్యమకారులకు అండగా... కాంగ్రెస్

హైదరాబాద్: కాంగ్రెస్ ఏడాది ప్రభుత్వ పాలన వేడుకలు గులాబీ పార్టీకి కొత్త చిక్కులు తెచ్చి పెట్టాయి. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం గులాబీ పార్టీలో ఓ ఎమ్మెల్సీని డిఫెన్స్‌లోకి లాగింది. ప్రజా పరిపాలన వేడుకల్లో భాగంగా తెలంగాణ తల్లి విగ్రహానికి కొత్త రూపం ఇస్తూ.. సచివాలయంలో ఆవిష్కరించింది కాంగ్రెస్ పార్టీ. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా కృషి చేసిన కొంతమందికి కళాకారులకు సర్కార్ కోటి రూపాయాల నజరానాలు ప్రకటించింది. పైగా ఇంటి స్థలాన్ని కూడా ప్రకటించింది. ఇదంతా బాగానే ఉంది కానీ. నజరానా ప్రకటించిన జాబితాలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ పేరు కూడా ఉండడం పెద్ద చర్చకు దారితీసింది.కవి గోరటి వెంకన్న.. తన పాటలతో తెలంగాణ ఉద్యమానికి ఊపిరి పోశారు. తన రాగాలతో ఉద్యమ స్పూర్తి రగిలించారు. తెలంగాణ ప్రజల్ని ఉద్యమం వైపు నడిపించారు. ప్రజాకవి గోరటి వెంకన్న హృదయమంతా పాటల సవ్వడితోనే మార్మోగిపోతోంది. ఆయన హృదయాన్ని పలకరిస్తే.. మన మనసు పులకరించి పోవాల్సిందే. ఆయన నోటి వెంట జానపదాలు జలపాతాల్లా ప్రవహిస్తూనే ఉంటాయి. అలాంటి ఉద్యమ కళాకారుడిని పెద్దల సభకు పంపించింది బీఆర్ఎస్. ఉద్యమ పార్టీగా బీఆర్ఎస్‌కు ముద్రపడింది. ఆ ముద్రను తొలగించేందుకు ఇప్పుడు బీఆర్ఎస్‌లో ఉన్న కీలక కళాకారుల్ని, ఉద్యమకారుల్ని కాంగ్రెస్ తన వైపు తిప్పుకునేందుకు ట్రై చేస్తోందని టాక్ వినిపిస్తోంది.ఇప్పటికే జయ జయహే తెలంగాణ పాటను రాష్ట్ర గీతంగా గుర్తించి ఆ పాట రాసిన అందెశ్రీని తమ వైపు తిప్పుకోగలిగారు. ఇప్పుడు బీఆర్ఎస్ ఎమ్మెల్సీగా ఉన్న గోరటి వెంకన్నకు ప్రభుత్వం కోటి రూపాయల నజరానా ప్రకటించడంతో భిన్న వాదనలు వినిపిస్తున్నాయి. బీఆర్ఎస్‌లో ఉన్న గోరటి వెంకన్న ఆ నజరానాను తీసుకుంటారా లేదా అని పెద్ద చర్చగా మారింది. ఓ కళాకారుడిగా తీసుకుంటే తప్పేంటని వాదించే వాళ్లు కూడా లేకపోలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చే నజరానాలను తీసుకుంటే ఆ పార్టీకి విధేయులుగా మారిపోయినట్లేనని చర్చ కూడా జరుగుతుంది. నజరానా పుచ్చుకుంటే బీఆర్ఎస్ పెద్దలు ఈ విషయాన్ని సీరియస్‌గానే అవకాశం కూడా ఉంది.దీంతో ప్రభుత్వ నజరానా తీసుకోవాలా వద్దా అని గోరటి వెంకన్న డైలామాలో ఉన్నట్లు సమాచారం. గోరటి వెంకన్న ఎక్కడ చేజారిపోతారోనని బీఆర్ఎస్ పార్టీ అలర్ట్ అయ్యింది. గోరటి వెంకన్నను కారు దిగకుండా చేసే బాధ్యతలను ఆయన సామాజికవర్గానికి చెందిన ఓ యువ నేతకు అప్పగించారు. దీంతో ఆయన రెండు, మూడ్రోజులుగా ఎమ్మెల్సీ గోరటి వెంకన్నను కంటికి రెప్పలా కాపాడుకుంటున్నారు. ఎమ్మెల్సీ సొంత పనులపై బయటకు వెళ్లినా ఆ యువ నేత మాత్రం నీడలా వెంటే ఉంటున్నారట.గోరటి వెంకన్న కూడా ప్రభుత్వ నజరానా తీసుకోనని.. తీసుకుంటానని ఇప్పటి వరకు క్లారిటీ ఇవ్వలేదు. దీంతో గోరటి వెంకన్న నిర్ణయం ఎలా ఉండబోతుందని ఉత్కంఠ మొదలైంది.

ఇప్పటికే గోరటి వెంకన్న బీఆర్ఎస్ పార్టీతో అంటిముట్టన్నట్లు ఉంటున్నారు. ఇప్పుడు సడెన్‌గా కాంగ్రెస్ ప్రభుత్వం నజరానా ప్రకటించడంతో గోరటి వెంకన్న ఎలా రియాక్ట్ అవుతారని పెద్ద టాపిక్ గా మారింది.

# ఎయిర్ పోర్టులలో కాఫీ, సమోసా ఏటీఎంలు

ముంబై: విమాన ప్రయాణికులకు మోదీ సర్కార్ భారీ కానుక ఇవ్వనుంది. ఎయిర్‌పోర్టులో విమాన ప్రయాణికులకు తక్కువ ధరకే ఆహారం అందించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేయనుంది. ప్రయాణికుల బడ్జెట్‌కు తగ్గట్టుగా స్నాక్స్, టీ, కాఫీ, నీరు విమానాశ్రయంలో అందుబాటులో ఉంటాయి. పౌర విమానయాన మంత్రిత్వ శాఖ వర్గాల నుండి అందిన సమాచారం ప్రకారం.. విమానాశ్రయంలో 'కియోస్క్'లను ప్రారంభించేందుకు మోదీ ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేసింది. ఇప్పుడు ప్రయాణికులు దేశంలోని విమానాశ్రయాల్లో టీ, సమోసా, అల్పాహారం, ఇతర ఆహార పదార్థాలను తక్కువ ధరలకు పొందగలుగుతారు. విమానాశ్రయాలలో ఆహారం, పానీయాల ధరలు సాధారణంగా చాలా ఎక్కువగా ఉంటాయి.. అయితే ప్రభుత్వం ఇప్పుడు దానిని అందుబాటులోకి తీసుకురావడానికి కొత్త పథకాన్ని రూపొందించింది. ఈ పథకం కింద ప్రయాణీకులకు 60-70 శాతం తక్కువ ధరలకు ఆహారం, పానీయాలు లభిస్తాయి. దీని లక్ష్యం ప్రయాణీకులకు ఖరీదైన ఆహారం నుండి ఉపశమనం కలిగించడమని ప్రభుత్వ ప్రతినిధులు చెబుతున్నారు.ఎకానమీ జోన్ పరిధిలోని విమానాశ్రయాలలో తక్కువ రేట్లకు టీ, నీరు, అల్పాహారం, సమోసా, ఇతర ఆహార పదార్థాలను పొందుతారు. ఉదాహరణకు, ప్రస్తుతం విమానాశ్రయాల్లో టీ ధర రూ.125 నుంచి రూ.200 వరకు ఉండగా, ఎకానమీ జోన్‌లో అదే టీ రూ.50 నుంచి 60కి మాత్రమే అందుబాటులో ఉంటుంది. అదేవిధంగా సమోసాలు, బిస్కెట్లు, ఇతర చిరుతిళ్లు కూడా 60-70 శాతం తక్కువ ధరకే లభిస్తాయి.ఈ పథకం కింద విమానాశ్రయంలో కౌంటర్ సిస్టమ్ ఉంటుంది. ఇక్కడ ప్రయాణికులు తమకు ఇష్టమైన వస్తువులను స్వయంగా ఎంచుకోవచ్చు. అయితే, విమానాశ్రయంలో సీటింగ్ ఏర్పాటు ఉండదు, అంటే ప్రయాణీకులు ఇక్కడ నుండి కొనుగోలు చేసిన వస్తువులను ప్యాక్ చేసి "ఆన్ ది గో" తీసుకోవచ్చు. దీనర్థం ప్రయాణీకులు త్వరగా ఆహారాన్ని పట్టుకుని, ఆపై వారి ప్రయాణాన్ని కొనసాగించవచ్చు. ఎయిర్‌పోర్ట్ క్యాటరింగ్ ఖరీదైన ఖర్చులను తగ్గించడం, ప్రయాణీకులకు డబ్బులను ఆదా చేయడం లక్ష్యంగా ఈ ఏర్పాటు చేయబడింది. విమానాశ్రయంలో ఆహారం చాలా ఖరీదైనదని.. ఇది తమ జేబులకు భారంగా ఉందని చాలా మంది ప్రయాణికులు వాపోతున్నారు. విమానాశ్రయాల్లో ఎకానమీ జోన్‌లను ముందుగా కొత్తగా నిర్మించే విమానాశ్రయాల్లో ప్రారంభించనున్నారు. ఈ ఎయిర్‌పోర్ట్‌లు ఈ రకమైన కౌంటర్ సిస్టమ్‌కు తగినంత స్థలం ఉండే విధంగా రూపొందించ బడతాయి. దీని తరువాత, పాత విమానాశ్రయాలలో కూడా ఎకానమీ జోన్‌లకు అనువైన స్థలాలను గుర్తించి, దానిని అమలు చేస్తారు. ఈ పథకం ముందుగా అధిక సంఖ్యలో ప్రయాణికులు ఉన్న పెద్ద విమానాశ్రయాలలో అమలు చేయబడుతుంది. తరువాత, చిన్న మరియు మధ్యస్థ విమానాశ్రయాలలో కూడా ఎకానమీ జోన్లు ఏర్పాటు చేయబడతాయి. చిన్న విమానాశ్రయాలలో 6-8 దుకాణాలు, ప్రతి గంటకు కనీసం 200 మంది ప్రయాణీకులకు సేవలందించే సామర్థ్యం ఉండేలా ప్రణాళిక చేయబడింది.ప్రస్తుతం విమానాశ్రయాలలో చాలా ఆహార పదార్థాలు చాలా ఖరీదైనవి. ఉదాహరణకు, బయట రూ. 10కి లభించే సాధారణ సమోసా విమానాశ్రయంలో రూ. 100 వరకు ఉంటుంది. ఇతర స్నాక్స్, పానీయాల విషయంలో కూడా ఇదే పరిస్థితి. దీంతో ఎయిర్‌పోర్టులో సామాన్యులు భోజనాలు, పానీయాలు ఆస్వాదించలేకపోతున్నారు. కానీ ఎకానమీ జోన్‌ను ప్రవేశపెట్టడంతో ప్రయాణికులు ఇప్పుడు ఈ వస్తువులను చాలా తక్కువ ధరలకు పొందుతారు. ప్రయాణీకుల అనుభవాన్ని మెరుగుపరచడం, వారికి సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఈ చొరవ తీసుకోబడింది. విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్ మోహన్ నాయుడు పలు దఫాలుగా సమావేశాల అనంతరం ఈ ప్రణాళికకు సంబంధించిన పనులను ప్రారంభించారు. దీని కింద, విమానాశ్రయాలలో ఆహారం ,పానీయాలు చౌకగా, అందుబాటులో ఉంటాయి, తద్వారా ఎక్కువ మంది ప్రజలు విమానాశ్రయంలో వారి ప్రయాణంలో హాయిగా తినవచ్చు త్రాగవచ్చు. ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ), ఫుడ్ అవుట్‌లెట్‌లు, విమానాశ్రయానికి సేవలందిస్తున్న కొత్త ఏజెన్సీల సహకారంతో ఈ పథకం అమలు చేయబడుతుంది. ఈ పథకం ప్రధాన లక్ష్యం ప్రయాణికులకు తక్కువ ధరలకు తాజా ఆహారాన్ని అందించడం, తద్వారా వారి ప్రయాణంలో ఎటువంటి అసౌకర్యం కలగకుండా చేయడం.ఈ పథకం అతి త్వరలో అమలులోకి రావచ్చు. ముందుగా కొత్త విమానాశ్రయాల్లో దీనిని పరీక్షించనున్నారు. ఇతర పాత విమానాశ్రయాలలో కూడా ఎకానమీ జోన్ల కోసం స్థలం ఎంపిక చేయబడుతుంది. ఈ ప్రక్రియ తర్వాత, విమానా శ్రయంలో సరసమైన, సౌకర్యవంతమైన క్యాటరింగ్ వ్యవస్థ ఏర్పాటు చేయబడుతుంది. ఎకానమీ జోన్‌ను ప్రవేశపెట్టడంతో, ప్రయాణీకులు ఇప్పుడు చౌకైన, నాణ్యమైన ఆహారం పొందుతారు. విమానాశ్రయాలలో ఖరీదైన ఆహార భారం నుండి బయటపడటం ద్వారా, ప్రయాణీకులు తమ ప్రయాణ అనుభవాన్ని మరింత ఆహ్లాదకరంగా మార్చుకోగలు గుతారు. ఈ పథకం ప్రయాణీకులకు ఉపశమనం కలిగించడమే కాకుండా విమానాశ్రయాల వ్యాపారంలో కొత్త మార్పును తీసుకు రాగలదు.

# అర్ధరాత్రి దొంగల బీభత్సం..



## - రూ.1 లక్ష 50, వేలు నగదు , 4 తులాల బంగారం చోరీ..

అచ్చంపేట : నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలం బోల్గట్ పల్లి గ్రామంలో శుక్రవారం అర్ధరాత్రి తాళాలు వేసిన 8 ఇండ్లలో తాళాలు పగలగొట్టి ఇంట్లో ఉన్న బంగారు, వెండి, నగదును దొంగలు తీసుకెళ్లారు. ఉదయాన్నే వ్యవసాయ పొలం నుండి ఇంటికి వచ్చి చూసిన కుటుంబ సభ్యులు ఇళ్ల తాళాలు పగలకొట్టి ఉండడంతో వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు గ్రామానికి వెళ్లి దొంగతనానికి గురైన ఇండ్లలో చెల్లాచెదురుగా పడి ఉన్న పెట్టే, పగలగొట్టిన బీరువాను పరిశీలించారు. మూడావత్ శివ, మూడవత్ భీముడు, శీలం సంజీవ మూడవ భీమ్లా, శ్రీను, ప్రభాకర్ ఇండ్లలో 4 తులాల బంగారం, 30 తులాల వెండి, రూ. 1లక్ష 50 వేల నగదు తీసుకెళ్లినట్లు బాధితులు తెలిపారు. భాదితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు, పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు జిల్లా కేంద్రం నుండి క్లూస్ టీం వస్తువులపై ఉన్న వేలిముద్రలను సేకరించారు.

# సీవరేజ్ స్పెషల్ డ్రైవ్

హైదరాబాద్: మరికొన్ని ఎస్టీపీలను ప్రారంభించేందుకు హైదరాబాద్ జలమండలి సిద్ధమవుతోంది. జనవరి నాటికి 9 ఎస్టీపీలు ప్రారంభించాలని యోచిస్తోంది. ఇప్పటికే 11 ఎస్టీపీలు ప్రారంభమైన సంగతి తెలిసిందే. కొత్త ఎస్టీపీల ప్రారంభంతో మూసీ నీటి ప్రక్షాళనలో మరో అడుగు ముందుకు పడినట్లు అవుతుంది.రానున్న జనవరి నాటికి హైదరాబాద్ నగరంలో మరికొన్ని సీవరేజ్ ట్రీట్ మెంట్ ప్లాంట్లు(ఎస్టీపీ) అందుబాటులోకి రానున్నాయి. ఆ దిశగా జల మండలి అడుగులు వేస్తోంది. పెండింగ్ లో ఉన్న పనులను వేగవంతంగా పూర్తి చేసేలా కార్యాచరణను సిద్ధం చేసింది. నగరంలో మరో 9 ఎస్టీపీలు నిర్మాణ దశలో ఉన్నాయి.ఈ నిర్మాణలపై ఇటీవలే జల మండలి ఎండీ అశోక్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. నిర్మాణంలో ఉన్న ఎస్టీపీలను ప్రారంభించేందుకు సిద్ధంగా ఉండాలని.. జనవరి నాటికి పనులు పూర్తి అవ్వాలని ఆదేశించారు. సరిపడా కార్మికులను ఈ ఎస్టీపీల నిర్మాణానికి కేటాయించాలని నిర్మాణ సంస్థకు కూడా సూచించారు. వివిధ దశల్లో పనులు పూర్తి చేయడానికి నిర్దేశించుకున్న గడువులోగా పనులు పూర్తి కాకపోతే జరిమానా విధిస్తామని హెచ్చరించారు.ఎస్టీపీల నిర్మాణంలోని వివిధ దశల పనులు అవకాశం ఉన్నంత వరకు సమాంతరంగా జరగాలని ఎండీ అశోక్ రెడ్డి సూచించారు. అనుకున్న సమయానికి ఎలెక్ట్రో మెకానికల్ ఈక్విప్మెంట్ సమకూర్చుకోవాలని? ఇందుకు గానూ ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు. రెండు షిఫ్టుల్లో పనులు జరగాలని సూచించారు. ఎస్టీపీల నిర్మాణంలో భద్రత విషయంలో ఏమాత్రం అజాగ్రత్తగా ఉండొద్దని పేర్కొన్నారు. కార్మికులు కచ్చితంగా భద్రతా పరికరాలను వినియోగించేలా చూడాలని చెప్పారు. ఎస్టీపీల నిర్మాణం జరుగుతున్న ప్రదేశాల్లో తగు భద్రతా చర్యలు తీసుకోవాలని సూచించారు.జలమండలి ఎస్టీపీ ప్రాజెక్టుల్లో నిర్మిస్తున్న వాటిల్లో.. ఇప్పటికే 11 ఎస్టీపీలు ప్రారంభమయ్యాయి. మరో 9 ఎస్టీపీలు నిర్మాణం దశలో ఉన్నాయి. వీటిలో డిసెంబర్ లో పాలపిట్ట, వెన్నల గడ్డ ఎస్టీపీలు పూర్తి కావాలన్నారు. జనవరిలో అంబర్ పేట్, ముల్లకత్వ చెరువు, శివాలయ నగర్, నలగండ్ల, అత్తాపూర్, రెయిన్ బో విస్తా, రామ చెరువు దగ్గర నిర్మిస్తున్న ఎస్టీపీలు ప్రారంభానికి సిద్ధం చేయాలని ఎండీ అశోక్ రెడ్డి ఆదేశించారు.నిరంతర పకడ్బందీ పర్యవేక్షణతో 90 రోజుల స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎండీ అశోక్ రెడ్డి తెలిపారు. ఖైరతాబాద్ లోని ప్రధాన కార్యాలయంలో మాట్లాడిన ఆయన? "సీవరేజ్ ఓవర్ ఫ్లో ఫ్రీ సిటీ - హైదరాబాద్" లక్ష్యంగా 90 రోజుల స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం ప్రారంభించామని 70 రోజులు పూర్తయిందన్నారు. ఇప్పటి వరకు నిర్దేశించుకున్న లక్ష్యాన్ని 50 శాతం చేరుకున్నట్లు తెలిపారు. బుధవారం నాటికి 12673 ప్రాంతాల్లో 1602 కిలోమీటర్ల మేర సీవరేజ్ పైపు లైన్, 1.22 లక్షల మ్యాన్ హోళ్లలో పూడికతీత పనులు చేసినట్లు చెప్పారు. మురుగు నీటి నిర్వహణలో రోజూవారీగా ఉపయోగించే 220 ఎయిర్ టెక్ మిషన్లు, 146 సిల్ట్ తరలింపు వాహనాలు, సీవరేజ్ సిబ్బందినే ఇందులోనూ వాడుకునేలా కార్యక్రమాన్ని రూపొందించామని చెప్పారు.

# కాళోజీ కళాక్షేత్రానికి ఆదిలోనే పగుళ్లు

వరంగల్: హైదరాబాద్ లోని రవీంద్ర భారతిని తలదన్నేలా వరంగల్ లో నిర్మించిన కాళోజీ కళాక్షేత్రానికి ఆదిలోనే పగుళ్లు ఏర్పడ్డాయి. గత, ప్రస్తుత ప్రభుత్వాలు మొత్తంగా రూ.90 కోట్ల వరకు వెచ్చించి, ప్రజా కవి కాళోజీ నారాయణరావు పేరున నిర్మించిన ఈ కళాక్షేత్రం ఓపెనింగ్ నిర్వహించి నెల కూడా దాటకముందే ఈ పగుళ్ల వ్యవహారం కలకలం రేపుతోంది. శంకుస్థాపన చేసి పదేళ్లపాటు పట్టించుకోకుండా గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం, క్రెడిట్ కొట్టేసేందుకు ప్రస్తుత ప్రభుత్వం హడావుడిగా పనులు పూర్తి చేయడం వల్లే కళాక్షేత్రానికి ఈ దుస్థితి ఎదురై ఉంటుందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పనులు అసంపూర్తిగా ఉండటంతో పాటు సరిగా క్యూరింగ్ కాకముందే హడావుడిగా ప్రారంభానికి సిద్ధం చేయడం వల్ల గోడలు నెర్రలుబారాయనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. కాగా రూ.90 కోట్లు పెట్టి పూర్తి చేసిన కళాక్షేత్రం ఆదిలోనే పగుళ్ల బారిన పడటంతో దాని నాణ్యత ప్రమాణాలు అధికారులు కూడా పట్టించుకోలేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.తెలంగాణ ఏర్పడిన కొత్తలో వరంగల్ కు వచ్చిన అప్పటి సీఎం కేసీఆర్ ప్రజాకవి కాళోజీ నారాయణరావు పేరున కళాక్షేత్రం నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఈ మేరకు 2014 సెప్టెంబర్ 9న కాళోజీ జయంతి సందర్భంగా వరంగల్ కు వచ్చిన కేసీఆర్.. ఈ మేరకు హయగ్రీవాచారి గ్రౌండ్ పక్కనే ఉన్న నాలుగెకరాల స్థలంలో కాళోజీ కళాక్షేత్రం నిర్మించేందుకు శంకుస్థాపన చేశారు. రవీంద్ర భారతిని తలదన్నేలా కాళోజీ కళాక్షేత్రం నిర్మించాలంటూ రూ.50 కోట్లు కూడా ప్రకటించారు. శంకుస్థాపన చేసిన తరువాత సరైన సమయంలో నిధులు విడుదల కాకపోవడం వల్ల పనులు నెమ్మదించాయి. స్థానిక ఎమ్మెల్యేలు కూడా పట్టించుకోకపోవడం, కాళోజీ జయంతి, వర్ధంతి కార్యక్రమాల సందర్భంగా పనులు పూర్తి చేస్తామంటూ హడావుడి చేయడం తప్ప పెద్దగా శ్రద్ధ పెట్టకపోవడంతో బీఆర్ఎస్ అధికారంలో ఉన్నన్ని రోజులు కాళోజీ కళాక్షేత్రం పనులు మాత్రం పూర్తి కాలేదు. దీంతో పదేళ్ల పాటు కాళోజీ కళాక్షేత్రం అసంపూర్తిగానే ఉండిపోయింది. ఏ ఎన్నిక వచ్చిన ప్రతిపక్షాలకు ఇదొక అస్త్రంగా మాత్రమే ఉపయోగపడింది.బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాటు పనులను సాగదీయగా.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఇక్కడి లీడర్లు కాళోజీ కళాక్షేత్రాన్ని సీరియస్ గా తీసుకున్నారు. ఈ మేరకు బడ్జెట్ అంచనాలు మార్పించి, రూ.90 కోట్లకు పెంచారు. ఆ తరువాత నిధులు తీసుకొచ్చి పనులు పూర్తి చేయించారు. కాళోజీ కళాక్షేత్రం ఓపెనింగ్ ను ఛాలెంజింగ్ గా తీసుకున్న ఇక్కడి ఎమ్మెల్యేలు పనుల్లో నాణ్యతా ప్రమాణాలపై మాత్రం పెద్దగా దృష్టి పెట్టలేదు. వేగంగా పూర్తి చేయాలని టార్గెట్లు పెట్టడం తప్ప పనుల నాణ్యతను ఎప్పుడూ పట్టించుకోలేదు. దీంతో ఆఫీసర్లు మాత్రం ప్రజాప్రతినిధుల ఒత్తిళ్ల మేరకు పనులు స్పీడప్ చేయించారు. అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన 10 నెలల్లోనే కాళోజీ కళాక్షేత్రాన్ని ప్రారంభానికి సిద్ధం చేశారు. మొదట కాళోజీ జయంతి సెప్టెంబర్ 9న ఓపెనింగ్ చేద్దామనుకున్నప్పటికీ.. ఆరోజు సీఎం టూర్ ఖరారు కాకపోవడంతో కళాక్షేత్రం ఓపెనింగ్ వాయిదా వేశారు. చివరకు నవంబర్ 19న వరంగల్ పర్యటనకు వచ్చిన సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా కాళోజీ కళాక్షేత్రాన్ని గ్రాండ్ గా ఓపెనింగ్ నిర్వహించారు.కాళోజీ కళాక్షేత్రం క్రెడిట్ కొట్టేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఆరాటపడిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కళాక్షేత్రం భీములు, గోడలు బీటలు వారడంతో దాని భవిష్యత్తుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటివరకు అందులో అధికారికంగా ఒకట్రెండు ప్రోగ్రామ్స్ మాత్రమే జరగగా.. ఓపెనింగ్ చేసిన నెల రోజుల్లోగానే లోపాలు బయటపడటం పట్ల తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. క్రెడిట్ కొట్టేసేందుకు ప్రజాధనాన్ని వృథా చేస్తారా అనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై రాజకీయ వర్గాల్లో చర్చ నడుస్తుండగా.. కాళోజీ అభిమానులు మాత్రం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మరి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని నిర్మించిన కాళోజీ కళాక్షేత్రం ఇప్పుడే పగుళ్ల బారిన పడగా.. అధికారులు, ప్రజాప్రతినిధులు ఎలాంటి దిద్దుబాటు చర్యలు చేపడతారో చూడాలి.

# 2030 నాటికి 20 గిగావాట్ల గ్రీన్ పవర్ ఉత్పత్తి లక్ష్యం

హైదరాబాద్: రాష్ట్రంలో 2030 నాటికి 20 గిగావాట్ల గ్రీన్ పవర్ ఉత్పత్తి లక్ష్యంగా ప్రత్యేక ప్రణాళికతో ప్రభుత్వం పనిచేస్తుందని ఉప ముఖ్యమంత్రి, విద్యుత్, ఆర్థిక శాఖల మంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా తెలంగాణ రాష్ట్ర పునరుత్పాదన విద్యుత్ అభివృద్ధి సంస్థ (టీజీరెడ్కో) రూపొందించిన 2025 సంవత్సర విద్యుత్ పొదుపు క్యాలెండర్‌ను శుక్రవారం నాడాయన ప్రగతిభవన్‌లో ఆవిష్కరించారు. 2030 నాటికి 20 గిగావాట్లు, 2035 నాటికి 40 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ స్థాపనే తమ లక్ష్యమని వివరించారు. విద్యుత్ పొదుపు కోసం అన్ని రంగాల్లో టెక్నాలజీ ఆధారిత చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈ సందర్భంగా టీజీరెడ్కో చేపట్టిన పలు కార్యక్రమాలను ఆ సంస్థ వైస్‌చైర్మెన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ వావిల్ల అనీల డిప్యూటీ సీఎంకు వివరించారు. బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియన్సీతో కలిసి పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎనర్జీ కన్సర్వేషన్ బిల్డింగ్ కోడ్ (ఈసీబీసీ) అమల్లో భాగంగా 879 కమర్షియల్ భవనాలను మార్పులు చేయడం ద్వారా 392.21 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఆదా చేసినట్టు తెలిపారు. కూల్ రూఫ్ పాలసీ అమలు చేస్తున్నామనీ, విద్యార్థులకు విద్యుత్ పొదుపుపై



అవగాహనా తరగతులు నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ సంస్థల్లో 57,483 పాత విద్యుత్ పరికరాలను మార్చి, ఎల్‌ఈడీ లైట్లను అమర్చడం ద్వారా 2.87 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఆదా జరిగిందని వివరించారు. ఈ సందర్భంగా సంస్థకు వచ్చిన పలు పురస్కారాలను మంత్రికి ఆమె వివరించారు. కార్యక్రమంలో టీజీ రెడ్కో జనరల్ మేనేజర్ జీవిస్వీ ప్రసాద్, డిప్యూటీ జనరల్ మేనేజర్ వెంకటరమణ, ప్రాజెక్ట్ డైరెక్టర్ రాధిక తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్ లో న్యూ ఇయర్ ఆంక్షలు

హైదరాబాద్: హైదరాబాద్‌లో న్యూ ఇయర్ వేడుకలపై పోలీసుల ఆంక్షలు విధించారు. న్యూ ఇయర్ ఈవెంట్ నిర్వాహకులకు పోలీసులు కీలక హెచ్చరికలు జారీ చేశారు. ఈవెంట్స్‌లో సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఉండాలని స్పష్టం చేశారు. వేడుకల్లో అశ్లీల నృత్యాలపై నిషేధం విధించారు. ఔట్‌డోర్‌లో రాత్రి 10 తర్వాత లౌడ్ స్పీకర్లు బ్యాన్ చేశారు. పబ్‌లు, బార్లలో మైనర్లకు అనుమతి లేదని హైదరాబాద్ పోలీసులు స్పష్టం చేశారు.పార్టీల్లో డ్రగ్స్ వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని.. హైదరాబాద్ పోలీసులు వార్నింగ్ ఇచ్చారు. తాగి వాహనం నడిపితే 10 వేలు జరిమానా, 6 నెలలు జైలు శిక్ష తప్పదని స్పష్టం చేశారు. మైనర్లు వాహనం నడిపితే యజమానిపైనా కేసు నమోదు చేస్తామన్న పోలీసులు.. ర్యాష్ డ్రైవింగ్‌పై వెహికల్ యాక్ట్ కింద కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎవరైనా నిబంధనలను అతిక్రమిస్తే.. చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

ఇవీ నిబంధనలు..

1.హోటల్స్, పబ్, క్లబ్ నిర్వాహకులు తప్పనిసరిగా వేడుకల కోసం అనుమతులు తీసుకోవాలి.

2.ఈవెంట్స్ జరిగే ప్రాంతాల్లో ఎంట్రీ, ఎగ్జిట్స్, పార్కింగ్ పాయింట్లలో సీసీ టీవీ కెమెరాలు అమర్చాలి.

3.పరిమితికి మించి పాసెస్, టికెట్స్, కూపన్స్ ఇవ్వొద్దు. మైనర్స్‌కు పార్టీల్లో అనుయమతి లేదు.

4.మ్యూజికల్ ఈవెంట్స్ ఇండోర్‌లో మాత్రమే జరుపుకోవాలి.

5.సెక్యూరిటీ గార్డులను ఏర్పాటు చేయాలి. ట్రాఫిక్ మానిటరింగ్ చేయాలి.

6.రాత్రి 10 గంటల వరకు మ్యూజిక్ నిలిపివేయాలి.

7.సౌండ్ పొల్యూషన్ 45 డెసిబుల్స్‌కి మించి ఉండొద్దు.

8.అసభ్యకర డ్యాన్సులకు, డ్రెస్సింగ్‌ను అనుమతించరాదు.

9.డ్రగ్స్, మత్తు పదార్థాల యాక్టివిటీ చేసే నిర్వాహకులపై చర్యలు తప్పవు.

10.ఈవెంట్స్ పరిసర ప్రాంతాల్లో స్థానిక పోలీసులు, షీ టీమ్స్ నిఘా పెడతాయి. మహిళలను వేధించే వారిని స్పాట్‌లోనే అరెస్ట్ చేస్తాం

11.వెహికల్ మూవ్‌మెంట్, పార్కింగ్‌కు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలి.

12.డ్రంకెన్ కండిషన్‌లో ఉన్న వారు వెహికల్ డ్రైవ్ చేయకూడదనే సైన్ బోర్డులు పెట్టాలి.

13.డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడే వారికి రూ.10,000 ఫైన్ లేదా 6 నెలల జైలు శిక్ష విధిస్తాం. లైసెన్స్ 3 నెలలు గరిష్టంగా, పర్మినెంట్‌గా రద్దు చేస్తాం.

# 16 నుంచి అసెంబ్లీకి కేసీఆర్..?

హైదరాబాద్: తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు తిరిగి డిసెంబర్ 16వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. ఏడాది పాలనపై రేవంత్ సర్కార్ సంతృప్తిని వ్యక్తం చేస్తుండగా? మరోవైపు బీఆర్ఎస్ అస్త్రాలను సిద్ధం చేస్తోంది. హామీల అమల్లో విఫలమైందంటూ విమర్శలు చేస్తోంది. అయితే ఈసారి కేసీఆర్ రాకపై ఆసక్తి నెలకొంది.తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమై వాయిదా పడిన సంగతి తెలిసిందే. తిరిగి ఈనెల 16వ తేదీన నుంచి శాసనసభ, మండలి ప్రారంభం కాను న్నాయి. అయితే రాష్ట్రంలోని కాంగ్రెస్ సర్కార్ ఏడాది పూర్తి చేసుకుంది. డిసెంబర్ 9వ తేదీ నాటికి రేవంత్ సర్కార్ ఏడాదా పాలన పూర్తి అయింది. కీలకమైన హామీలను అమలు చేస్తూ? ప్రజా పాలనకు అద్దం పట్టేలా పాలన సాగిందని ప్రభుత్వంలోని మంత్రులు, నేతలు చెప్పుకొస్తున్నారు.కాంగ్రెస్ ఏడాది పాలన వేళ ప్రజాపాలన విజయోత్సవాలను కూడా నిర్వహించారు. తొమ్మిదిరోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా ఈ వేడుకలు జరిగాయి. 9వ తేదీ సెక్రటేరియట్ లో తెలంగాణ తల్లి విగ్రహాన్ని కూడా ఆవిష్కరించారు. రాష్ట్రంలో రుణమాఫీతో పాటు ఉచిత బస్సు, ఆరోగ్యశ్రీ వంటి హామీలను అమలు చేశామని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. మరోవైపు అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కాగా? తెలంగాణ తల్లి విగ్రహంపై సీఎం ప్రకటన చేశారు. ఆ తర్వాత సభను 16వ తేదీకి వాయిదా వేశారు.అసెంబ్లీ సమావేశాలు 16వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. గత సమావేశాల సందర్భంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతల మధ్య వాదోపవాదనలు కొనసాగాయి. ఓవైపు సీఎం రేవంత్ సహా మంత్రులంతా? గత బీఆర్ఎస్ పాలను ప్రస్తావిస్తూ విమర్శలు, ప్రశ్నాస్త్రాలను సంధించారు. అయితే అంతే ధీటుగా బీఆర్ఎస్ వైపు నుంచి కేటీఆర్, హరీశ్ రావు, జగదీశ్వర్ రెడ్డి వంటి నేతలు? సమాధానాలు, ప్రశ్నలు సంధించారు. అయితే గత బడ్జెట్ సమావేశాల సందర్భంగా? ప్రతిపక్ష నేతగా ఉన్న కేసీఆర్ అసెంబ్లీకి వచ్చినప్పటికీ సభలో మాట్లాడలేదు. మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతూ?. బడ్జెట్ లోని లోపాలను ఎత్తి చూపారు. కాంగ్రెస్ పాలనపై విమర్శలు గుప్పించారు.అసెంబ్లీ సమావేశాలు ఉండటంతో ఈసారి కేసీఆర్ వస్తారా..? లేదా?? అన్నది ఆసక్తికరంగా మారింది. ప్రతిపక్ష నేతగా ఉన్న కేసీఆర్? ఈ ఏడాది కాలంలో అసెంబ్లీ వేదికగా మాట్లాడలేదు. బడ్జెట్ సందర్భంగా కేవలం హాజరయ్యారు. ఆరోగ్య పరిస్థితుల కారణంగా ఎమ్మెల్యేగా ప్రమాణస్వీకారం కూడా స్పీకర్ ఛాంబర్ లోనే చేశారు.కాంగ్రెస్ ఏడాది పాలనలోని వైఫల్యాలను సభ వేదికగా ఎత్తి చూపాలని బీఆర్ఎస్ నిర్ణయించింది. ఇటీవలే కేసీఆర్ కీలక సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు దిశానిర్దేశం చేశారు. లగచర్ల భూముల అంశం, రుణమాఫీ, రైతు భరోసా, మూసీ సుందరీకరణ, హైడ్రా కూల్చివేతలు, తెలంగాణ తల్లి విగ్రహ మార్పు, గురుకులాల్లో పరిస్థితుల వంటి పలు కీలక అంశాలపై సర్కార్ ప్రశ్నించేలా సిద్ధమవ్వుతున్నారు

# పట్టణంలోని అభివృద్ధి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే

పెద్దపల్లి: పట్టణంలోని అభివృద్ధి పనులను ఎమ్మెల్యే చింత కుంట విజయ రమణ రావు పలువురు అధికారులతో కలిసి పరిశీలించారు. అలాగే టీఎఫ్ ఐడీసి నిదుల ద్వారా ప్రారంభం కానున్న పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్ తో కలిసి మాట్లాడుతూ పెద్దపల్లి పట్టణ అభివృద్ధి కొరకు నెల రోజుల క్రితం 30 కోట్ల రూపాయలతో పనులకు శంకుస్థాపన చేసుకుని పనులు మొదలు పెట్టడం జరిగిందని 9 ప్యాకేజీలకు గాను 7 ప్యాకేజీల పనులు మొదలు పెట్టడం జరిగిందని ఈనెల 4వ తేదీన పెద్దపల్లి పట్టణానికి వచ్చిన ముఖ్యమంత్రి ఏనుమల రేవంత్ రెడ్డి పెద్దపల్లి పట్టణ అభివృద్ధికి 15 కోట్ల రూపాయలు మంజూరు చేయడం జరిగిందన్నారు. అందులో భాగంగా 4 ఎకరాల స్థలంలో నాలుగు కోట్ల రూపాయలతో పార్కు ఏర్పాటు చేసుకోవడం మిగతా 11 కోట్ల రూపాయలతో పెద్దపల్లి పట్టణంలోని అన్ని వార్డుల్లో అవసరం ఉన్నచోట సిసి రోడ్లు, మురికి కాలువలు, ఇతరత్రా పనులను చేసుకోవడం జరుగుతుందన్నారు. పెద్దపల్లి పట్టణ అభివృద్ధికి రానున్న ఆరు నెలల్లో మరో 45 కోట్ల రూపాయల తో పనులు చేయుటకు అనుమతులు తీసుకోవడం జరిగిందని, పట్టణంలోని చాకలి ఐలమ్మ విగ్రహం నుండి జెండా చౌరస్తా వరకు,జెండా చౌరస్తా జెండా నుండి మజీద్ వరకు అలాగే జెండా నుండి సుభాష్ విగ్రహం వరకు 75 లక్షల రూపాయలతో 40 ఫీట్లతో బిటి రోడ్డు పనులను త్వరలోనే మొదలు పెట్టడం జరుగుతుందని అన్నారు. ఈ మేరకు మున్సిపల్ ఏఈ, కౌన్సిలర్లతో కలిసి రోడ్డు వెడల్పు స్థలాలను పరిశీలించి, పట్టణ ప్రజలకు వారికి అనుకూలంగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా రోడ్లు, మురికి కాలువలు నిర్మాణం చేయిస్తామని, దీనికి ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్ , కౌన్సిలర్లు నూగిల్ల మల్లన్న, భూతగడ్డ సంపత్,పాగల సోని శ్రీకాంత్, మున్సిపల్ ఏఈ సతీష్ టౌన్ ప్లానింగ్ అధికారి వినయ్, మున్సిపల్ అధికారులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు

# బుమ్రా, సిరాజ్.. ఆకాశ్ దీప్‌ను చూసి నేర్చుకోండి: చతేశ్వర్ పుజారా

ఐదు టెస్ట్‌ల బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో భాగంగా ఆస్ట్రేలియాతో జరుగుతున్న మూడో టెస్ట్‌లో భారత పేసర్లు జస్‌ప్రీత్ బుమ్రా, మహమ్మద్ సిరాజ్‌లు మెరుగ్గా బౌలింగ్ చేయలేదని వెటరన్ బ్యాటర్ చతేశ్వర్ పుజారా అన్నాడు.

తొలి 6 ఓవర్లలో ఆసీస్ బ్యాటర్లను ఈ ఇద్దరూ పేసర్లు ఇబ్బంది పెట్టలేకపోయారని విమర్శించాడు. ఈ ఇద్దరి కంటే యువ పేసర్ ఆకాశ్ దీప్ మెరుగ్గా బౌలింగ్ చేశాడని కొనియాడాడు.

బ్రిస్బేన్‌లోని గబ్బా స్టేడియం వేదికగా శనివారం ప్రారంభమైన ఈ మ్యాచ్‌కు వర్షం అంతరాయం కలిగించడంతో తొలి రోజు 13.2 ఓవర్ల ఆట మాత్రమే సాధ్యమైంది. వర్షంతో మ్యాచ్ ఆగిపోయే సమయానికి ఆస్ట్రేలియా వికెట్ నష్టపోకుండా 28 పరుగులు చేసింది. ఓపెనర్లు ఉస్మాన్ ఖవాజా(19 బ్యాటింగ్), నాథన్ మెక్‌స్వీనీ(4 బ్యాటింగ్) ఆచితూచి ఆడారు.

ఈ 13.2 ఓవర్లను సిరాజ్, బుమ్రా, ఆకాశ్‌దీప్‌లే వేసారు. ఓవర్‌కాస్ట్ కండిషన్స్‌తో పాటు పిచ్‌పై గ్రాస్ ఉండటంతో వికెట్ బౌలింగ్‌కు అనుకూలంగా ఉంటుందని టీమిండియా బౌలర్లు భావించారు. కానీ బుమ్రా, సిరాజ్ బంతులు ఏమాత్రం స్వింగ్ కాలేదు. బంతి స్వింగ్ అవ్వడం లేదని బుమ్రా చెప్పిన మాటలు స్టంప్ మైక్‌లో రికార్డ్ అయ్యాయి. అయితే బుమ్రా సిరాజ్‌లు సరైన లైన్ అండ్ లెంగ్త్‌లో బౌలింగ్ చేయలేదని ఈ మ్యాచ్‌కు కామెంటేటర్‌గా వ్యవహరిస్తున్న పుజారా అన్నాడు. బుమ్రా, సిరాజ్‌లు.. ఆకాశ్ దీప్‌ను చూసి నేర్చుకోవాలని సూచించాడు. ఆకాశ్




దీప్ సరైన లెంగ్త్‌లో బౌలింగ్ చేసి ఆసీస్ బ్యాటర్లను ఇబ్బంది పెట్టాడని చెప్పాడు. బుమ్రా. సిరాజ్‌లు మాత్రం ఎక్స్‌ట్రా ఫుల్ లెంగ్త్, షార్ట్ లెంగ్త్, లెగ్ స్టంప్ లైన్‌లో బౌలింగ్ చేశారని తెలిపాడు. ఆసీస్ పిచ్‌లపై 6 మీటర్ల పొడవున బౌలింగ్ చేయడం సరికాదన్నాడు. పెర్త్ టెస్ట్‌లో బుమ్రా, సిరాజ్ సరైన లెంగ్త్‌లో బౌలింగ్ చేసి వికెట్లు పడగొట్టారని గుర్తు చేశాడు.

తొలి 6 ఓవర్లలో విఫలమైనా.. తర్వాత లయను అందుకున్నారని పుజారా చెప్పుకొచ్చాడు. ఉస్మాన్ ఖవాజా, మెక్‌స్వీని భారత బౌలర్ల వైఫల్యాన్ని అందిపుచ్చుకొని క్రీజులో నిలబడ్డారని తెలిపాడు. రెండో రోజు అయిన భారత పేసర్లు సరైన లెంగ్త్‌లో బౌలింగ్ చేయాలని సూచించాడు.

# బుమ్రా రిస్క్ వద్దు.. టెస్ట్ క్రికెట్‌ను వదిలేయ్: షోయబ్ అక్తర్

టీమిండియా స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రాకు పాకిస్థాన్ మాజీ పేసర్, రావల్పిండి ఎక్స్‌ప్రెస్ షోయబ్ అక్తర్ విచిత్రకరమైన సలహా ఇచ్చాడు. టెస్ట్ క్రికెట్ నుంచి తప్పుకోవాలని భారత స్టార్ పేసర్‌కు సూచించాడు. బుమ్రా టెస్ట్ క్రికెట్ నుంచి తప్పుకోని వైట్‌బాల్ క్రికెట్‌పై ఫోకస్ పెట్టాలన్నాడు. టెస్ట్ క్రికెట్‌లో కొనసాగితే బుమ్రా కెరీర్ దెబ్బతింటుందని హెచ్చరించాడు.

సుదీర్ఘ ఫార్మాట్‌లో కొనసాగే సామర్థ్యం బుమ్రాకు లేదన్నాడు. టెస్ట్ క్రికెట్‌లో బుమ్రా కొనసాగాలనుకుంటే బౌలింగ్ వేగం పెంచాలని, ఎక్స్‌ట్రా పేస్ కోసం ప్రయత్నిస్తే గాయపడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని అభిప్రాయపడ్డాడు. ఓ పోడ్‌కాస్ట్ ఇంటర్వ్యూలో అక్తర్.. బుమ్రా బౌలింగ్ గురించి ఆసక్తికర విషయాలు పంచుకున్నాడు.

'వన్డే, టీ20ల్లో బుమ్రా అద్భుతమైన ఫాస్ట్ బౌలర్. ఎందుకంటే అతను లెంగ్త్‌ను బాగా అర్థం చేసుకుంటాడు. బంతిని రెండు వైపులా స్వింగ్ చేస్తూ పవర్ ప్లేలో.. డెత్ ఓవర్లలో అద్భుత ప్రదర్శన కనబర్చాడు. కానీ టెస్ట్ క్రికెట్‌లో మాత్రం సుదీర్ఘమైన స్పెల్స్ వేయాల్సి ఉంటుంది. అంతేకాకుండా బ్యాటర్లు డిఫెన్స్‌కు ప్రయత్నిస్తారు కాబట్టి ఎక్స్‌ట్రా పేస్‌తో బౌలింగ్ చేయాల్సి ఉంటుంది. లెంగ్త్‌తో పెద్దగా అవసరం ఉండదు. బౌలింగ్‌లో పేస్ లేకుంటే బంతి సీమ్, రివర్స్ స్వింగ్ కాదు. బౌలింగ్‌లో తడబడుతుంటే జనాలు ప్రశ్నించడం మొదలుపెడుతారు. భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని బుమ్రా టెస్ట్ క్రికెట్ నుంచి తప్పుకోవడమే ఉత్తమం. ఇప్పటికే టెస్ట్ క్రికెట్‌లో అతను చాలా వికెట్లు తీసాడు. న్యూజిలాండ్‌తో సిరీస్‌లో బుమ్రా దారుణంగా విఫలమయ్యాడు. ఒకవేళ బుమ్రా టెస్ట్ క్రికెట్‌లో కొనసాగాలనుకుంటే బౌలింగ్‌లో వేగాన్ని పెంచాలి. పేస్‌ను పెంచితే గాయపడే ప్రమాదం




పొంచి ఉంది. నేనే బుమ్రా ప్లేస్‌లో ఉంటే మాత్రం టెస్ట్ క్రికెట్‌కు వీడ్కోలు పలికి పరిమిత ఓవర్లపై ఫోకస్ పెట్టేవాడిని.

నేను నా మనసు మాట వినేవాడిని. నేను బాగున్నానని భావిస్తేనే ఆడేవాడిని. బుమ్రా టెస్ట్ క్రికెట్ మాత్రమే ఆడితే సమస్య లేదు. కానీ అతను ఐపీఎల్‌తో పాటు వన్డేలు, టీ20లు, టెస్ట్ క్రికెట్ కూడా ఆడాలనుకుంటున్నాను. వరల్డ్ బెస్ట్ పేసర్ అయిన బుమ్రాను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపైన ఉంది. గాయాల బారిన పడకుండా చూసుకోవాలి.'అని షోయబ్ అక్తర్ చెప్పుకొచ్చాడు.

టెస్ట్ క్రికెట్‌లో బుమ్రా ఇప్పటికే 42 మ్యాచ్‌లు ఆడి 20.01 సగటుతో 185 వికెట్లు పడగొట్టాడు. మూడు ఫార్మాట్లలో కలిపి 400 ప్లస్ వికెట్లు పడగొట్టాడు. బుమ్రా నిలకడగా గంటలకు 140 ప్లస్ కిలోమీటర్ల వేగంతో బౌలింగ్ చేస్తాడు. అలాంటి బుమ్రా బౌలింగ్‌లో పేస్ లేదని అక్తర్ చెప్పడం హాస్యాస్పదకంగా ఉందని నెటిజన్లు విమర్శలు గుప్పిస్తున్నారు.

# IND vs AUS మూడో టెస్ట్ రద్దయితే.. టీమిండియా డబ్ల్యూటీసీ ఫైనల్ చేరడం ఎలా?

ఐదు టెస్ట్‌ల బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో భాగంగా ఆస్ట్రేలియాతో టీమిండియా మూడో టెస్ట్ ఆడుతోంది. బ్రిస్బేన్‌లోని గబ్బా స్టేడియం వేదికగా శనివారం ఈ మ్యాచ్ ప్రారంభమైంది.

అయితే వర్షం కారణంగా తొలి రోజు 13.2 ఓవర్ల ఆట మాత్రమే సాధ్యమైంది.వర్షంతో మ్యాచ్ ఆగిపోయే సమయానికి ఆస్ట్రేలియా వికెట్ నష్టపోకుండా 28 పరుగులు చేసింది. ఓపెనర్లు ఉస్మాన్ ఖవాజా(19 బ్యాటింగ్), నాథన్ మెక్‌స్వీనీ(4 బ్యాటింగ్) ఆచితూచి ఆడారు.

గబ్బా టెస్ట్‌కు వరుణ గండం..

రెండో రోజు ఆటకు కూడా వర్షం ముప్పు పొంచి ఉంది. రెండో రోజే కాదు ఈ మ్యాచ్ మొత్తం వర్షం కారణంగా రదయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం బ్రిస్బేన్‌లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. అక్యూ వెదర్ రిపోర్ట్ ప్రకారం భారత్ వర్సెస్ ఆస్ట్రేలియా మూడో టెస్ట్ రెండో రోజు కూడా భారీ వర్షం కురిసే అవకాశం ఉంది. 100 శాతం వర్షం వచ్చే ఛాన్స్ ఉన్నట్లు తెలుస్తోంది. మూడో రోజు 46 శాతం, నాలుగో రోజు 67 శాతం, ఐదో రోజు 68 శాతం వర్షం వచ్చే అవకాశాలు ఉన్నాయి.

మ్యాచ్ రద్దయితే..?



అయితే ఈ మ్యాచ్ రద్దయితే వలర్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ 2025లో టీమిండియా ఫైనల్ చేరే అవకాశాలు సంక్లిష్టంగా మారుతాయి. ఒక వేళ ఈ మ్యాచ్ వర్షంతో రద్దయినా లేక.. ఫలితం లేకుండా ముగిసినా.. తదుపరి రెండు మ్యాచ్‌ల్లో టీమిండియా విజయం సాధించాల్సి ఉంటుంది. చివరి రెండు మ్యాచ్‌లకు రెండు గెలిస్తే టీమిండియా ఈ సిరీస్‌ను 3-1తో కైవసం చేసుకోనుంది. అప్పుడు ఎలాంటి సమీకరణాలు అవసరం లేకుండా నేరుగా ఫైనల్ చేరనుంది.

# మహమ్మద్ సిరాజ్‌కు ఘోర అవమానం..!

టీమిండియా స్టార్ పేసర్ మహమ్మద్ సిరాజ్‌కు ఘోర అవమానం ఎదురైంది. ఐదు టెస్ట్‌ల బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో భాగంగా ఆస్ట్రేలియాతో గబ్బా వేదికగా జరుగుతున్న మూడో టెస్ట్‌లోనూ సిరాజ్‌ను అభిమానులు గేలి చేస్తున్నారు. శనివారం ప్రారంభమైన ఈ మ్యాచ్‌లో టీమిండియా టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకుంది. అయితే ఈ మ్యాచ్‌కు హాజరైన ఆసీస్ అభిమానులు.. సిరాజ్‌ను టార్గెట్ చేశారు. బౌండరీ లైన్ వద్ద సిరాజ్ ఫీల్డింగ్ చేస్తున్న సమయంలో అసభ్యకరమైన పదజాలంతో దూషించారు. అతన్ని తక్కువ చేసేలా కామెంట్స్ చేశారు. అభిమానుల కామెంట్స్‌ను పట్టించుకోకుండా సిరాజ్ తన బౌలింగ్‌పై ఫోకస్ పెట్టాడు. అడిలైడ్ వేదికగా జరిగిన పింక్ బాల్ టెస్ట్‌లో ఆస్ట్రేలియా విధ్వంసకర బ్యాటర్ ట్రావిస్ హెడ్, సిరాజ్‌ల మధ్య చిన్నపాటి వాగ్వాదం చోటు చేసుకున్న విషయం తెలిసిందే. ఆ మ్యాచ్‌లో ట్రావిస్ హెడ్ సెంచరీ సాధించగా.. అతన్ని సిరాజ్ ఔట్ చేశాడు. సెంచరీ బ్యాటర్‌ను ఔట్ చేశాననే ఆనందంలో సిరాజ్ గట్టిగా సంబరాలు చేసుకోగా.. ట్రావిస్ హెడ్ నోటికి పనిచెప్పాడు. సిరాజ్ కూడా అదే స్థాయిలో రియాక్ట్ అవుతూ బయటకు వెళ్లాలని సైగలు చేశాడు.

సిరాజ్ బౌలింగ్‌ను మెచ్చుకుంటే అనుచితంగా ప్రవర్తించాడని మ్యాచ్ అనంతరం ట్రావిస్ హెడ్ మీడియాకు తెలిపాడు. అయితే ఈ వ్యాఖ్యలను సిరాజ్ ఖండించాడు. ట్రావిస్ హెడ్ అబద్దాలు చెప్పాడని, తనను ఎక్కడా మెచ్చుకోలేదన్నాడు. దాంతో ఈ ఘటన తీవ్ర చర్చనీయాంశమైంది. ఆ మ్యాచ్ సందర్భంగా ఆసీస్ అభిమానులు సిరాజ్‌ను టార్గెట్ చేస్తూ విమర్శలు గుప్పించారు. అతన్ని పదే పదే గేలి చేశారు. అయితే మ్యాచ్ అనంతరం ఈ ఘటనను మరిచి సిరాజ్, ట్రావిస్ హెడ్ మాట్లాడుకున్నారు. దాంతో ఈ గొడవకు తెరపడిందని అంతా అనుకున్నారు. కానీ అభిమానులు మాత్రం సిరాజ్‌ను విడిచిపెట్టడం లేదు.

# గబ్బాలో మెరిసిన సారా టెండూల్కర్.. అతని కోసమే అంటూ..!

భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ ముద్దుల కూతురు సారా టెండూల్కర్ ఇండియా వర్సెస్ ఆస్ట్రేలియా మూడో టెస్ట్‌కు హాజరైంది. ఐదు టెస్ట్‌ల బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో భాగంగా ఇరు జట్ల మధ్య శనివారం గబ్బా స్టేడియం వేదికగా మూడో టెస్ట్ ప్రారంభమైంది.

ఈ మ్యాచ్‌కు సచిన్ తనయ హాజరైంది. ప్రేక్షకుల గ్యాలరీలో కూర్చొని టీమిండియాకు మద్దతు తెలిపింది. ప్రస్తుతం సారా టెండూల్కర్ మ్యాచ్‌కు హాజరైన ఫొటోలు నెట్టింట వైరల్‌గా మారాయి. దాంతో సారా టెండూల్కర్ సోషల్ మీడియా వేదికగా ట్రెండింగ్‌లోకి వచ్చింది. టీమిండియా కోసం కాదని, శుభ్‌మన్ గిల్ కోసమే సారా టెండూల్కర్ ఈ మ్యాచ్‌కు హాజరైందని ఫ్యాన్స్ కామెంట్ చేస్తున్నారు. ఈ మ్యాచ్‌లో శుభ్‌మన్ గిల్ శతకం బాదడం ఖాయమంటున్నారు.

సారా టెండూల్కర్, శుభ్‌మన్ గిల్ పీకల్లోతు ప్రేమలో ఉన్నట్లు గత కొంతకాలంగా జోరుగా ప్రచారం జరుగుతోంది. ఈ ఇద్దరూ పలు కార్యాక్రమాలకు హాజరైన ఫొటోలు బయటకు రావడం ఈ వార్తలకు బలం చేకూర్చింది. శుభ్‌మన్ గిల్ సోదరితో కలిసి సారా లేట్ నైట్ పార్టీలకు వెళ్లడం కూడా అప్పట్లో తీవ్ర చర్చనీయాంశమైంది.

అయితే ఇటు సారా టెండూల్కర్ కానీ, అటు శుభ్‌మన్ గిల్ కానీ తమ ప్రేమ గురించి ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. సచిన్ కూడా ఈ విషయంపై స్పందించలేదు. ఈ లవ్ రూమర్స్‌ను కూడా కొట్టిపారేయలేదు. సారా టెండూల్కర్ వచ్చిన విశేషమో ఏమో కానీ వర్షం అంతరాయం కారణంగా తొలి రోజు ఆట రద్దయ్యింది. వర్షంతో మ్యాచ్ ఆగిపోయే సమయానికి ఆస్ట్రేలియా 13.2 ఓవర్లలో వికెట్



నష్టపోకుండా 28 పరుగులు చేసింది. ఓపెనర్లు ఉస్మాన్ ఖవాజా(19 బ్యాటింగ్), నాథన్ మెక్‌స్వీనీ(4 బ్యాటింగ్) ఆచితూచి ఆడారు.

ఇటీవలే సారా టెండూల్కర్ కొత్త బాధ్యతల్ని చేపట్టారు. సచిన్ టెండూల్కర్ ఫౌండేషన్ (ఎస్‌టీఎఫ్) డైరెక్టర్‌గా సారా నియమితులయ్యారు. ఈ విషయాన్ని స్వయంగా సచిన్ 'ఎక్స్' (ట్విటర్) వేదికగా ప్రకటించారు. 'నా కుమార్తె సారా ఎస్‌టీఎఫ్ డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించడం నాకెంతో సంతోషంగా ఉంది. ఈ విషయాన్ని మీ అందరితో పంచుకోవడం మరింత హ్యాపీగా ఉంది. తన కుమార్తెకు వైద్య, విద్యా రంగంపై ఉన్న నాలెడ్జ్ సమాజానికి మరింత తోడ్పడుతుంది' అని సచిన్ ట్వీట్‌లో పేర్కొన్నాడు.

# ద్వంద్వ వైఖరిని ఆపండి.. ఆసీస్ ఫ్యాన్స్‌పై సునీల్ గవాస్కర్ ఫైర్!

ఆస్ట్రేలియా క్రికెట్ అభిమానులపై భారత క్రికెట్ దిగ్గజం సునీల్ గవాస్కర్ ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఐదు టెస్ట్‌ల బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో భాగంగా జరుగుతున్న మూడో టెస్ట్‌లో టీమిండియా స్టార్ పేసర్ మహమ్మద్ సిరాజ్‌ను ఆసీస్ అభిమానులు మరోసారి హేళన చేశారు. వర్షం కారణంగా తొలి రోజు 13.2 ఓవర్ల ఆట మాత్రమే సాధ్యమవ్వగా.. సిరాజ్ 4 ఓవర్లు బౌలింగ్ చేశాడు.

సిరాజ్ బౌలింగ్‌కు వచ్చిన ప్రతిసారీ ప్రేక్షకులు పెద్దగా అరుస్తూ అతన్ని గేలి చేశారు. ఈ మ్యాచ్‌కు కామెంటేటర్‌గా వ్యవహరిస్తున్న సునీల్ గవాస్కర్.. ఆసీస్ అభిమానుల తీరును తప్పుబట్టాడు. ఆస్ట్రేలియా ప్రేక్షకులు ఇకనైన తమ ద్వంద్వ వైఖరికి ముగింపు పలకాలని అసహనం వ్యక్తం చేశాడు.

'రెండో టెస్ట్‌లో ట్రావిస్ హెడ్ బ్యాటింగ్ అద్భుతంగా ఉంది. కానీ ఏ బౌలర్‌కు కూడా ప్రత్యర్థి బ్యాటింగ్ నచ్చదు. సిరాజ్ రియాక్షన్‌లోనూ వింతేమి లేదు. సిక్స్ కొట్టిన తర్వాత వికెట్ దక్కితే ఏ బౌలర్ అయినా అలానే సంబరాలు చేసుకుంటాడు. కానీ లోకల్ హీరో అయిన ట్రావిస్ హెడ్‌తో సిరాజ్ అలా ప్రవర్తించడం సరికాదని కూడా చెప్పాను.

ఈ ఇద్దరూ ఐసీసీ ఆగ్రహానికి కూడా గురయ్యారు. పేసర్లు మైదానంలో కాస్త దూకుడుగానే ఉంటారు. వారిని వారు నియంత్రించుకోవడం కష్టమే. తమ లోకల్ హీరోకు సెండాఫ్ ఇవ్వడంతో అభిమానులు కూడా సిరాజ్‌ను గేలి చేశారు. కానీ మూడో టెస్ట్‌లో తొలి ఓవర్ నుంచే సిరాజ్‌ను ఆటపట్టించడం ప్రారంభించారు.

తమ ఆసీస్ ఆటగాళ్లు ఇలాగే ఇతర ప్లేయర్లకు సెండాఫ్ ఇస్తే మాత్రం




సంతోష పడుతారు. యాషెస్‌లో ఇంగ్లండ్ బ్యాటర్ పట్ల ఇలానే ప్రవర్తిస్తే మెచ్చుకుంటారు. ఈ ద్వంద్వ వైఖరినే ఆసీస్ అభిమానులు మానుకోవాలి.'అని సునీల్ గవాస్కర్ చురకలంటించాడు.


ఈ మ్యాచ్ తొలి రోజు ఆటను వరణుడు మింగేసాడు. ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురవడంతో అంపైర్లు తొలి రోజు ఆటను రద్దు చేశారు. వర్షంతో మ్యాచ్ ఆగిపోయే సమయానికి ఆస్ట్రేలియా 13.2 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 28 పరుగులు చేసింది. ఓపెనర్లు ఉస్మాన్ ఖవాజా(19 బ్యాటింగ్), నాథన్ మెక్‌స్వీనీ(4 బ్యాటింగ్) ఆచితూచి ఆడారు. జస్‌ప్రీత్ బుమ్రా, సిరాజ్, ఆకాశ్ దీప్ బంతులను చాకచక్యంగా ఎదుర్కొన్నారు. రెండో రోజు ఆట భారత కాలమాన ప్రకారం ఆదివారం ఉదయం 5.20 గంటలకు ప్రారంభం కానుంది. ఆట సజావుగా సాగితే 98 ఓవర్లు ఆడించనున్నారు.

# తొలి రోజు ఆట రద్దు.. 76 ఓవర్ల ఆటను మింగేసిన వరుణుడు!

ఐదు టెస్ట్‌ల బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో భాగంగా భారత్ వర్సెస్ ఆస్ట్రేలియా మధ్య జరుగుతున్న మూడో టెస్ట్‌కు వర్షం అంతరాయం కలిగించింది. బ్రిస్బేన్‌లోని గబ్బా స్టేడియం వేదికగా శనివారం ప్రారంభమైన ఈ మ్యాచ్ తొలి రోజు ఆటను అంపైర్లు రద్దు చేశారు. ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురవడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. వర్షంతో మ్యాచ్ ఆగిపోయే సమయానికి ఆస్ట్రేలియా 13.2 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 28 పరుగులు చేసింది. ఓపెనర్లు ఉస్మాన్ ఖవాజా(19 బ్యాటింగ్), నాథన్ మెక్‌స్వీనీ(4 బ్యాటింగ్) ఆచితూచి ఆడారు. జస్‌ప్రీత్ బుమ్రా, సిరాజ్, ఆకాశ్ దీప్ బంతులను చాకచక్యంగా ఎదుర్కొన్నారు. రెండో రోజు ఆట భారత కాలమాన ప్రకారం ఆదివారం ఉదయం 5.20 గంటలకు ప్రారంభం కానుంది. ఆట సజావుగా సాగితే 98 ఓవర్లు ఆడించనున్నారు.

అయితే రెండో రోజు కూడా వర్షం ముప్పు పొంచి ఉంది. దాంతో అభిమానులను ఆందోళనకు గురవుతున్నారు. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన టీమిండియా బౌలింగ్ ఎంచుకుంది. 5.3 ఓవర్ల పాటు ఆట జరగ్గానే వర్షం రావడంతో అంపైర్లు, ఆటగాళ్లు స్టేడియం నుంచి బయటకు పరుగెత్తారు. వర్షం తగ్గడంతో తిరిగి ఆట ప్రారంభమైంది. కానీ మరో 7.5 ఓవర్ల పాటు ఆట జరగ్గా వర్షం మరోసారి అంతరాయం కలిగించడంతో అంపైర్లు ముందుగానే లంచ్ బ్రేక్ ప్రకటించారు.

ఆ తర్వాత వర్షం ఎంతకీ తగ్గకపోవడంతో తొలి రోజు ఆటను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. ఇక ఓవర్‌కాస్ట్ కండీషన్స్ నేపథ్యంలోనే బౌలింగ్ ఎంచుకున్నానని టాస్ సందర్భంగా టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ తెలిపాడు. 'మేం ముందుగా బౌలింగ్ చేస్తాం. కొంచెం




ఓవర్‌కాస్ట్ కండిషన్స్ ఉండటంతో పాటు పిచ్‌పై గ్రాస్ కూడా ఉంది. ఈ కండిషన్స్‌ను ఉపయోగించుకోవాలనుకుంటున్నాం. ఇప్పటికే మేం చాలా క్రికెట్ ఆడాం. గత రెండు మ్యాచ్‌ల్లో ఇరు జట్లు మెరుగైన ప్రదర్శన చేశాయి. ఈ మ్యాచ్ మాకు చాలా కీలకం.

మాపై ఉన్న అంచనాలను అందుకోవాలనుకుంటున్నాం. మంచి క్రికెట్ ఆడుతాం. విజయవకాశాలను అందిపుచ్చుకోవాలి. గత మ్యాచ్‌లో వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోలేకపోయాం. అందుకే ఓటమిపాలయ్యాం. ఈ మ్యాచ్ కోసం కుర్రాళ్లంతా సిద్దంగా ఉన్నారు. ఎప్పుడెప్పుడు ఆడుదామా? అనే ఉత్సాహంతో ఉన్నారు.

మ్యాచ్ సాగుతున్నా కొద్దీ ఈ వికెట్ బ్యాటింగ్‌కు అనుకూలిస్తోంది. తుది జట్టులో మేం రెండు మార్పులు చేశాం. అశ్విన్, హర్షిత్ రాణా స్థానాల్లో రవీంద్ర జడేజా, ఆకాశ్ దీప్ జట్టులోకి వచ్చారు. టీమ్ కాంబినేషన్‌లో భాగంగానే ఈ మార్పులు చేశాం.'అని రోహిత్ శర్మ చెప్పుకొచ్చాడు.

# సెంచరీ బాదిన ద్రవిడ్ చిన్న కొడుకు!

ప్రతిష్టాత్మక దేశవాళీ అండర్ 16 టోర్నీ విజయ్ మర్చంట్ ట్రోఫీలో అన్వయ్ ద్రవిడ్ అజేయ శతకంతో చెలరేగాడు.

జార?ండ్‌తో శుక్రవారం ముగిసిన మూడ్రోజుల మ్యాచ్‌లో కర్ణాటక తరఫున నాలుగో నెంబర్ ఆటగాడిగా బరిలోకి దిగిన అన్వయ్ ద్రవిడ్ 153 బంతుల్లో 10 ఫోర్లు, 2 సిక్సర్లతో సెంచరీ సాధించాడు.

మరో బ్యాటర్ అనిరుధ్(76)తో కలిసి మూడో వికెట్‌కు 167 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పిన అన్వయ్ ద్రవిడ్.. సుకృత్(33)తో నాలుగో వికెట్‌కు 43 పరుగులు జోడించాడు. ఫలితంగా కర్ణాటక 123.3 ఓవర్లలో 441/4 స్కోరుతో చివరిరోజును ముగించింది. దాంతో మ్యాచ్ ఫలితం తేలకుండా డ్రాగా ముగిసింది. ఈ మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో జార?ండ్ 387 పరుగులకు ఆలౌటైంది. ఇటీవలే జరిగిన కర్ణాటక క్రికెట్ అసోసియేషన్(కేఎస్‌సీఏ) అండర్-16 టోర్నీలో బెంగళూరు జోన్‌కు ఆడిన అన్వయ్ ద్రవిడ్ డబుల్ సెంచరీతో అందరి దృష్టిని ఆకర్షించాడు. ఇక అన్వయ అన్నయ్య సమిత్ ద్రవిడ్ కూడా అండర్ 19 క్రికెట్‌లో సత్తా చాటుతున్నాడు. నిలకడైన ప్రదర్శనతో భారత అండర్ 19 జట్టుకు ఎంపికయ్యాడు. ఇటీవలే ఆస్ట్రేలియా అండర్ 19 జట్టుతో తలపడిన భారత అండర్ 19 జట్టుకు ప్రాతినిథ్యం వహించాడు.

ద్రవిడ్ ఇద్దరు కొడుకులు క్రికెట్‌లో దూసుకుపోతుండటంపై అతని అభిమానులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. టీ20 ప్రపంచకప్ 2024 విజయానంతరం టీమిండియా హెడ్ కోచ్ పదవి బాధ్యతల నుంచి తప్పుకున్న ద్రవిడ్.. రాజస్థాన్ రాయల్స్ హెడ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టాడు.

Editor,Printer, Publisher & Owner by **Reddy Shekar**,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48 **SS Printers,** (m) mulugu, mulugu. RNI No: TELTEL/2021/86151, **E Mail : teenmaardesk@gmail.com, Cell : 9177108128**

సెషన్ల ఆట తుడిచిపెట్టుకుపోయింది. వర్షంతో ఆట ఆగిపోయే సమయానికి ఆస్ట్రేలియా 13.2 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 28